


ww.voodyam.com Estd :1999

# వృదయం

శనివారం, అక్టోబర్ 18, 2025 | హైదరాబాద్ | సంపుటి : 26 | సంచిక :221| వెల : రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM TELUGU DAILY

/VOODAYAM Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal




### ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా..

# సమయమివ్వలేదు

- బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది
- భాజపా నేతలు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం:** బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఖమ్మంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు.

### కుల్సుంపురాలో రూ.110 కోట్ల

## ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా



**హైదరాబాద్:** గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రజావసరాలకు ఈ భూమిని వినియోగించాలని గతంలో ప్రభుత్వం భావించింది. మరోవైపు అశోక్ సింగ్ అనే వ్యక్తి దీన్ని తన భూమిగా చెబుతున్నాడు. ఈక్రమంలో సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమిలో ఇప్పటికే రెండు సార్లు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. అయినా అశోక్ సింగ్ స్థలాన్ని ఖాళీ చేయడంలేదు. మరోవైపు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడ్డాడు. అశోక్ సింగ్‌పై లంగర్‌హౌస్, మంగళ్‌హాట్, శాహినాయత్‌గంజ్ పోలీసు స్టేషన్లలో 8కి పైగా కేసులు నమోదయ్యాయి.

### డిజిటల్ అరెస్టు పేరుతో

# మోసాలు

- సుప్రీం ఆందోళన

డిజిటల్ అరెస్టులు ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా ఇదే. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తు లను భయాందోళనకు గురిచేస్తూ.. పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందో ళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సం దర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలని న్యాయ స్థానం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. హరి యాణాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించార న్నారు. రూ.కోటి ఇస్తే ఈ అరె స్టు నుంచి బయట పడొచ్చని వారు బెదిరింపులకు పాల్ప డ్డారని ఆమె తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్లు సొమ్ములు కాజే యడా న్ని సీజేఐతో సహా సీనియర్ న్యాయమూర్తు లు తీవ్రంగా పరిగణించారు.

### పీఎం జన్‌మన్‌లో తెలంగాణకు మూడో ర్యాంకు..

## అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్,అక్టోబర్ 17 (వృదయం ప్రతినిధి): ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరపున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. శుక్రవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు – పీఎం–జన్‌మాన్, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు.ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే..




తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు.

బెస్ట్ పెర్ఫార్మర్స్ స్క్రీన్ డిస్‌ప్లే..

1. ఆదికర్మయోగి అభియాన్ – ఆదిలాబాద్, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం
2. ఉత్తమ ప్రదర్శన సూపర్ కోచ్/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్ – డాక్టర్ కీర్తి
3. ధార్తీ అభా జనభాగిదారి అభియాన్ – ఆదిలాబాద్, ఆసిఫాబాద్

ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేశ్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

# భూపరిపాలనలో మరో ముందడుగు

- ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- రేపు ముఖ్యమంత్రి చేతులమీదుగా లైసెన్సుల పంపిణీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్,అక్టోబర్ 17 (వృదయం ప్రతినిధి): తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మెరుగైన సేవలను అందించడానికి, రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామపాలనాధికారులు (జీపీవో)ను అందుబాటులోకి తీసుకురాగా తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్లు పొంగులేటి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్ ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి లేఖ రాశాం

- హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం
- రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాలి
- రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది



**హైదరాబాద్:** బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది విద్యాసాగర్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని గత విచారణ సందర్భంగా ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ కూడా రాశామని.. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి 3 వారాల సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఈక్రమంలో ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు 2 వారాల గడువు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## టెర్రరిజాన్ని అడ్డుకోవడంలో ఐపీఎస్‌లే కీలకం

- బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి



**హైదరాబాద్:** మాదక ద్రవ్యాలు, స్మగ్లింగ్, టెర్రరిజాన్ని అడ్డుకోవడంలో ఐపీఎస్‌లే కీలకమని బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 77వ ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ హక్కులను కాపా డాలని, ముందున్న సవాళ్లుఅధిగమించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై దృష్టి పెట్టాలన్నారు. ధనవంతులు, పేదవారిని ఒకేలా చూడాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్‌లో పోలీసు సిబ్బంది ఎంతో సహకారం అందిం చారు. సాయుధ దళాలతో కలిసి పనిచే శారు. సాంకేతికత మీద మాత్రమే ఆధార పడొద్దు.. క్షేత్ర స్థాయిలో పని చేయాలి. పోలీసు స్టేషన్ అనేది ప్రతి పౌరుడికి మొదటి నమ్మకం. ఐపీఎస్‌లుగా మీకు ఎన్నో ఒడుదొడుకులు ఉంటాయి. ఆరో గ్యం, ఫిట్‌నెస్ కూడా చాలా ముఖ్యం. మీ రు బలంగా ఉంటేనే విధుల్లో సమగ్రంగా రాణించగలరు. కొత్త చట్టాలను పటిష్ఠంగా అమలు చేయండి. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు ఒక సవాలే. రాజ్యాంగానికి లోబడి పని చేస్తే ఉన్నతంగా ఉండగలరు. మీరు ఐపీఎస్‌లు మాత్రమే కాదు.. పేదలను ఆపద నుంచి కాపాడే సంరక్షకులు” అని దల్జీత్ సింగ్ చౌదరి అన్నారు.

# మరో ఎదురుదెబ్బ

- రికార్డుల ఆధారంగా వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులు
- ఆ గ్రీన్ కార్డ్ లాటరీలో 2028 వరకు భారతీయులకు నోఛాన్స్
- వలసదారుల పెరోల్ ఫీజు 1,000 డాలర్లు





**వాషింగ్టన్:** ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్పటినుంచి అమెరికా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు 2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. అమెరికాలో అన్ని దేశాలకు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు. గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీలో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో, 93,450 మంది భారతీయులు అమెరికాకు వలస రాగా.. 2022లో ఈ సంఖ్య 1,27,010గా ఉంది. ఇది అమెరికాకు వస్తున్న దక్షిణ అమెరికన్ (99,030), ఆఫ్రికన్ (89,570), యూరోపియన్ (75,610) వలసదారుల సంఖ్య కంటే ఎక్కువ. 2023లో 78,070 మంది భారతీయులు అమెరికాకు వలస వచ్చారు. ఈ రికార్డుల ఆధారంగా 2028 వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులుగా నిర్ణయించినట్లు తెలిపింది. ఇప్పటికే ఇమిగ్రేషన్ విధానంలో అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలతో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ లాటరీకి 2026 వరకు అర్హత సాధించని ఇతర దేశాల్లో చైనా, దక్షిణ కొరియా, కెనడా, పాకిస్థాన్ ఉన్నాయి.

పెరోల్ ఫీజుపై అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కొన్నిరకాల వలసదారులకు అవసరమయ్యే పెరోల్ ఫీజును 1,000 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వీసా లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండా అమెరికాలో ప్రవేశించడానికి, ఉండటానికి పెరోల్ అనేది తాత్కాలిక అనుమతి. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిపై విదేశీయులను అమెరికాలోకి అనుమతిస్తారు. ఇటీవల ట్రంప్ ప్రవేశపెట్టిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లులో ఈ పెరోల్ ఫీజును తప్పనిసరి చేశారు. ప్రస్తుతం దీని ఆధారంగా అమెరికాలోకి ప్రవేశించాలంటే విదేశీయులు 1,000 డాలర్ల పెరోల్ రుసుమును చెల్లించాలి. వీటిలో ప్రారంభ పెరోల్, రీ–పెరోల్, పెరోల్ ఇన్ ప్లేస్ లేదా డీహెచ్ఎస్ కస్టడీ నుంచి పెరోల్ వంటివి ఉంటాయి. ఈ రుసుము ఇప్పటికే ఉన్న ఏదైనా ఇతర ఇమిగ్రేషన్ సర్వీస్ ఫైలింగ్ లేదా బయోమెట్రిక్ రుసుముకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ అధికారులు సూచించిన సమయం లోపు ఈ రుసుమును చెల్లిస్తేనే పెరోల్ పొందడానికి అనుమతినిస్తారు.

## పాక్ మంత్రి బీరాలు

- భారత్, అఫ్గాన్‌తో యుద్ధానికి సిద్ధం



భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనలు చేసింది. అఫ్గానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటి కొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. ఖ్వాజా ఆసిఫ్ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా... “ అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను” అని చెప్పారు. అప్పుడే భారత్ గురించి నోరు పారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. “వారివల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు.

వుదయం

శనివారం, అక్టోబర్ 18, 2025

# నిరు పేదలకు వరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

– పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని 105 చెక్కుల పంపిణీ



సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నేడు నిరుపేదలకు వరంగా మారాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని అమీన్పూర్, రామచంద్రపురం, గుమ్మడిదల, జిన్నారం, పటాన్చెరు రెవెన్యూ మండలాల పరిధిలోని 105 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 5 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, అమీన్పూర్ మాజీ జెడ్పీటిసి సుధాకర్ రెడ్డి, గుమ్మడిదల మాజీ జెడ్పీటిసి కుమార్ గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రమోద్ గౌడ్, ఐలేష్, బండి శంకర్, వెంకటేష్, షేక్ హుస్సేన్, రంశెట్టి, శివా రెడ్డి, ఆయా మండలాల తహసిల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

# బీసీ సంఘాల జేఏసీ బంద్ కు జనసేన పార్టీ మద్దతు...



మేడ్చల్ మల్కాజిగిరి, అక్టోబర్ 17,(వుదయం ప్రతినిధి),జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు అక్టోబర్ 18వ తారీకు జరగబోయే తెలంగాణ రాష్ట్ర బంద్ కార్యక్రమానికి కూకట్పల్లి, శేలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో రాష్ట్ర సభ్యులు జర్నలిస్ట్ తెల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్ కార్యక్రమానికి జనసేన పార్టీ కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ నియోజకవర్గ జనసేన కార్యకర్తలు బంద్ లో పాల్గొని బీసీ సంఘాలకు మద్దతు ఇవ్వాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇప్ప రాకేష్, కెవి శివరాం, జనసేన నాయకులు కొల్ల శంకర్, వేముల మహేష్, కలిగినీడీ ప్రసాద్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# 41 రోజులు అయ్యప్ప స్వాములకు నిత్య అన్నప్రసాద వితరణ...



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17,(వుదయం ప్రతినిధి),నిజాంపేట్ లో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో మాన్యశ్రీ అరుణ్ గురు స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా అయ్యప్ప స్వాములకు 41 రోజుల నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 17 నుండి అయ్యప్ప స్వాములకు ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో 41రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల మాధవరెడ్డి, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, సత్తిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్తయిన ఈజీఎస్ పనుల బిల్లులను వెంటనే చెల్లించాలి...

## మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గంలో పూర్తయిన ఈజీఎస్ పనుల బిల్లులను తరిత గతిన మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు ఎందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తెలిపారు అలాగే జగిత్యాల నియోజకవర్గం లో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కను కోరినట్లు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తెలిపారు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపినట్లు ఆయన తెలియజేశారు

# ప్రతి ఒక్కరికీ సీపీఆర్ పై అవగాహన తప్పనిసరి

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీపీఆర్ పై అవగాహన

## 108 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎన్ జనార్ధన్



జగిత్యాల అక్టోబర్ 17(వుదయం విలేఖరి): ప్రతి ఒక్కరికీ సీపీఆర్ పై అవగా హన తప్పనిసరిగా ఉండాలని 108 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎన్ జనార్ధన్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ లో జిల్లా పరిషత్ హైస్కూల్ లో 108 ఈఏంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎన్ జనార్ధన్ ఆధ్వర్యం లో పాఠశాలలోని 9వ,10వ తరగతి విద్యార్థులకు సీపీఆర్ పై అవగాహన కల్పించారు.అనుకోని అత్యవసర పరిస్థితుల్లో గుండె ఆగిపోయిన వ్యక్తిని సీపీఆర్ చేయడం ద్వారా ఏ విధంగా బతికించవచ్చో తెలిపారు.సీపీఆర్ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియచేశారు.సీపీఆర్ అంటే కార్డియో పల్మనరీ రిససిటేషన్ అనగా గుండె ఆగిపోయిన వ్యక్తి (వారి గుండె రక్తాన్ని పంప్ చేయలేనప్పుడు) ప్రాణాలను కాపాడే ఒక మార్గం.ఇది వారి గుండెను పునఃప్రారంభించడానికి మరియు వారి రక్త ప్రసరణను కొనసాగించడానికి చేసే ప్రయత్నం నేటికాలంలో అకస్మాత్తుగా వస్తున్న గుండె సంబంధిత కార్డియాక్ అరెష్టులను ఎదుర్కొన్న వారిని సకాలంలో కాపాడేందుకు కార్డియో పల్మనరీ రీససిటేషన్(సీపీఆర్)పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని 108 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎన్ జనార్ధన్ అన్నారు.సీపీఆర్ అనేది కార్డియాక్ అరెష్టులను ఎదుర్కొం టున్న వ్యక్తుల ప్రాణాలను కాపా డడానికి సీపీఆర్ అనే లైఫ్ సేవింగ్ టెక్నిక్ ఉపయోగపడుతుంద న్నారు.ఇది ప్రథమ చికిత్స లాంటి దని,ప్రాణాలను నిలుపు తుందని, ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనే జర్ ఆశోద ఐలయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు జి శ్రీదేవి, ఎం శ్రీలత,ఎ గంగయ్య, షబానా,ఎం ప్రవీణ్, ఎండి షకీల్, ఎం ప్రభాకర్,ఎన్ అనుజ,కె మనోహర్, ఈ కిరణ్,ఎ పవన్ కుమార్ మరియు 108 సిబ్బంది వేణు,విజయ్,చంద్రశేఖర్,రాజు, శ్రీనివాస్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శబరిమల మహా పాదయాత్ర భక్తులకు ఘన స్వాగతం

## శబరిమల మహా పాదయాత్ర భక్తులకు ఘన స్వాగతం పలికిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి



శేరి లింగంపల్లి ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): హెచ్ఇఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమల అయ్యప్ప దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్ర బృందానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామం లో గల శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఈ రోజు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శాలువాలతో సన్మానించి, ఘన స్వాగతం పలికారు.అనంతరం రంగనాథ్ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ , కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి .ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, బిహెచ్ఇఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమల వరకు పాదయాత్ర చేయడం అభినందనీయమని, శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఏ ఆటంకం లేకుండా భక్తులు సురక్షితంగా తమ యాత్ర పూర్తి చేయాలని కోరారు.అనంతరం గోపనపల్లి తండాకు చెందిన సీనియర్ నాయకుడు అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద విందు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది అయ్యప్ప స్వామి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం కాలినడకన శబరిమల బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో గురు స్వామిలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బూచి రెడ్డి, ఎస్.ఎన్.రెడ్డి, శ్రీశైలం, కిరణ్, చారు,పాదయాత్ర భక్తులు, సీనియర్ నాయకులు, శేఖర్, సుమన్, శ్రీశైలం,స్థానిక నేతలు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బంద్ ఫర్ జస్టిస్ ను విజయవంతం చేయాలని బిసి జేఏసీ పిలుపు




శేరి లింగంపల్లి ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): తెలంగాణలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిసి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శేరిలింగంపల్లి బిసి జెఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్ లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బిసి రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్న వ్యతిరేక శక్తులకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తెలంగాణ జేఏసీ మాజీ చైర్మన్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కో చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తెలంగాణ బిసి కుల సంఘాల జేఏసీ కన్వీనర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, జేఏసీ నాయకులు తుడి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ లు మాట్లాడుతూ దేశంలో స్వతంత్రం వచ్చిన నాటినుంచి నేటి వరకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేవలం బిసి లకు మాత్రమే లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి లకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 18 వ తేదీన బంద్ ఫర్ జస్టిస్ పేరుతో తలపెట్టిన తెలంగాణ బంద్ ను సంపూర్ణంగా విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కె సాయన్న ముదిరాజ్, బీసీ జేఏసీ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, నగర సంఘం రాష్ట్ర సలహాదారులు కెపి రామ్ సగర, సగర సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మోడల రవి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్ సగర, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గంగాధర్ సగర, జేఏసీ నాయకులు జిల్ల గణేష్, సీతారాం సగర, రామకృష్ణ సగర, అశోక్ యాదవ్, నరసింహ, శంకర్ ముదిరాజ్, బాలరాజు సగర, నారాయణ రావు, శివశంకర్, ఆంజనేయులు సగర, చింతకింది రవీందర్ గౌడ్, కుమార్ యాదవ్, చెన్నం రాజు ముదిరాజ్, చందు సగర, శివ సగర, రాము, తిరుమలేష్, అడ్వకేట్ రమేష్, అంజమ్మ, మాధవి, బిక్షపతి, వెంకట నర్సింహా రావు, రమేష్ గౌడ్, రాజు ముదిరాజ్, మధుకుమార్, పెద్ద సంఖ్యలో బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు,

# అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత..

వెంకటాపురం ఫారెస్ట్ కార్యాలయానికి తరలింపు..



వెంకటాపురం అక్టోబర్ 17 (వుదయం ప్రతినిది)అడవులను పెంచడం వల్ల మానవాళికి ఆయుషు పెరుగుతుందని పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు,చెట్లను నరకొద్దని ప్రభుత్వాలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేస్తున్నప్పటి,స్మగ్లర్లు మాత్రం అటవీ అధికారులకళ్ళుగప్పి య దేచ్ఛగా విలువైన చెట్లను నరికి సొమ్ముచేసుకుంటున్నారు.ములుగు జిల్లా వెంకటాపురం ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని ఎదిర సెక్షన్ శుక్రవారం తెల్లవారుజామున ట్రాక్టర్ పై అక్రమంగా టేకు దుంగలను తరలిస్తున్న స్మగ్లర్లను నమ్మదగిన సమాచారంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కృష్ణవంశీ ఎదర సెక్షన్ అధికారులను,సిబ్బందిని అప్రమత్తం చేసి కొత్తపల్లి రోడ్డు క్రాస్ వద్ద అడవి నుంచి బయలుదేరిన ట్రాక్టర్ ను అటవీశాఖ అధికారులు స్వాధీనం పరుచుకోవడం జరిగింది.

ఆ ఆకస్మిక దాడితో కలప దొంగలు అడవుల్లోకి పరారయ్యారు.ట్రాక్టర్ ను కలపతో సహా వెంకటాపురం ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు.ఈ ఘటనపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కృష్ణవంశీ మాట్లాడుతూ..కలపను స్వాధీనం చేసుకొని కేసు నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని తెలిపారు.ఈ దాడిలో ఎదర సెక్షన్ ఆఫీసర్ జై సింగ్,బీట్ ఆఫీసర్లు వసంత్,చంద్రహాసన్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండవ రోజు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

క్రీడాకారులతో కలిసి అల్పాహారం..



సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు ,,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, కబడ్డీ రెండవ రోజు పోటీలను శుక్రవారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు లాంచనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి అల్పాహారం చేశారు. మూడు రోజులపాటు జరగనున్న పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. శనివారం సాయంత్రం ముగింపు పోటీలు జరుగుతాయని తెలిపారు.

# గురుకుల విద్యాలయాల్లో 5వ నుండి 9వ తరగతి వరకు ఖాళీల భర్తీ దరఖాస్తులకు ఆహ్వానం

సంగారెడ్డి జిల్లా ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2025 26 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు గల ఖాళీలను భర్తీ చేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, ఇస్నాపూర్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎం. జయలక్ష్మి గారు ఒక ప్రకటనలో తెలిపారు.బాలికల కోసం ఇస్నాపూర్, చిట్కుల్, రంజోల్, రాయికోడ్, అందోల్ గురుకుల పాఠశాలల్లో, బాలుర కోసం హత్నూర, నారాయణఖేడ్, నల్లవాగు, సింగూరు, న్యాల్కల్, కొండాపూర్ పాఠశాలల్లో ప్రవేశ అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు.ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్నవారు, ప్రవేశ పరీక్ష రాసినవారు, అలాగే పరీక్ష రాయని ఆసక్తి గల విద్యార్థులందరూ తమ దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ (బుధవారం) మధ్యాహ్నం లోపు ఇస్నాపూర్ బాలికల పాఠశాలలో సమర్పించాల్సిందిగా కోరారు.దరఖాస్తుదారులకు మెరిట్ మరియు రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశం కల్పించబడుతుందని శ్రీమతి జయలక్ష్మి గారు పేర్కొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శ మాజీమంత్రి కొప్పుల. ఈశ్వర్



ధర్మపురి అక్టోబర్ 17(వుదయం విలేకరి):ధర్మపురి పట్టణ వాస్తవ్యులు చంద్ర థియేటర్ యజమాని టోపీ రాం కిషన్ కుమారుడు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామ ర్శించి ప్రగాఢ సానుభూతి తెలి పారు.

వారి వెంట మాజీ డిసిఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, సౌళ్ళ భీమయ్య, సంగి శేఖర్, నాగయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకంతో పట్టణాలకు మహర్దశ

జనగామ, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): చిన్న, మధ్య తరహా పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే ఆధారం కానుంది. స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల ద్వారా నగరాల అభివృద్ధికి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నిధులు మంజూరు చేస్తోంది. చిన్న, మధ్యతరహా పట్టణాల సమగ్రాభివృద్ధికి 'పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి' (యూఐడీఎఫ్) పథకం ద్వారా నిధులు రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం పట్టణాల అభివృద్ధికి 'తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ' ద్వారా పురపాలకశాఖ నిధులిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తుగా బ్యాంకుల నుంచి రుణం తీసుకొని ఈ సంస్థ ద్వారా పురపాలికలకు నిధులు మంజూరు చేస్తోంది. ఇకపై యూఐడీఎఫ్ పథకం ద్వారా పురపాలికల అభివృద్ధికి నిధులు మంజూరయ్యే అవకాశముంది.

# అనంతగిరి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

నల్లగొండ,,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): అనంతగిరి మండల పోలీస్ స్టేషన్ను శుక్రవారం జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది ఒత్తిడి లేకుండా, టీం వర్క్ తో పనిచేయాలని ఆయన సూచించారు. పోలీస్ స్టేషన్లోని పరిసరాలు, డైరీ, నేరాలు, ఫిర్యాదుల తీరు, కేసుల స్థితిగతులు, గ్రామ రిజిస్టర్లు, హిస్టరీ షీట్స్, పెండింగ్ కేసులు, కోర్టు డ్యూటీ, రిసెప్షన్, బ్లూ కోట్, పెట్రో కార్ విధులు, అంతర్జాల నమోదు, సిసి కెమెరాల పనితీరు, ఎస్ హెచ్ ఓ విధులు వంటి పలు అంశాలను పరిశీలించారు. శాంతినగర్ గ్రామానికి వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎస్సై నవీన్ కుమార్కు సూచించారు.

# గుండెకు ఆయువు పోద్దాం...!

మిర్యాలగూడ, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మారుతున్న ఆహార పద్ధతులు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో చిన్న వయసు నుంచే అనేక మంది గుండెపోటుకు గురవుతున్నారు. అయితే గుండెపోటుకు గురైన బాధితుల ప్రాణాలు నిలిపేందుకు ఆసుపత్రికి తరలించే లోగా సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసస్కిటేషన్) చేయడం ద్వారా ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

# జాతీయం – అంతర్జాతీయం

## చైనాలో పెట్టుబడులు పెంచుతాం



చైనాలో పెట్టుబడులు పెంచుతామని ఆపిల్ కంపెనీ తెలిపింది. అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఆపిల్ కంపెనీ చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఆపిల్ కంపెనీ సీఈఓ టిమ్ కుక్ బుధవారం చైనా పరిశ్రమల మంత్రి లీ లెచంగ్‌తో సమావేశమయ్యారు. ఆ వివరాలను చైనా ప్రభుత్వం విడుదల చేసింది. ఆపిల్ కంపెనీ చైనా మార్కెట్‌లో మరిన్ని ఉత్పత్తులు ప్రవేశపెడుతుందని, చైనా సరఫరాదారులతో కలిసి అభివృద్ధి చెందుతుందని సమావేశం సందర్భంగా లీ లెచంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆపిల్ సహా విదేశీ కంపెనీలకు మంచి వ్యాపార వాతావరణం కల్పిస్తామని చెప్పారు. చైనా పర్యటన సందర్భంగా కుక్ షాంఘైలోని ఆపిల్ స్టోర్‌ను సందర్శించారు. చైనా గేమ్ డెవలపర్లతో సమావేశమయ్యారు. కాగా ఐఫోన్ల తయారీ సంస్థ ఆపిల్ చైనాలో ఏ మేరకు పెట్టుబడులు పెడుతుందన్న సమాచారం ప్రభుత్వ ప్రకటనలో ఇవ్వలేదు. అమెరికా, చైనా మధ్య నడుస్తున్న వాణిజ్య యుద్ధం ఇప్పటి వరకూ ఈ కంపెనీపై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టవద్దంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశీయ దిగ్గజ కంపెనీలకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. హువావై వంటి చైనా కంపెనీలపై అమెరికా చాలా కాలం క్రితమే ఆంక్షలు విధించింది. ప్రపంచంలో అతి పెద్ద వినియోగదారుల మార్కెట్ అయిన చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తే అధ్యక్ష భవనం ఆగ్రహించి తమ వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీస్తుందేమోనని అనేక దేశీయ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. అందుకే చైనాలో పెట్టుబడులపై అవి ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దేశీయ తయారీ రంగంలో మరో వంద బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని ఆగస్టులో ట్రంప్‌కు కుక్ హామీ ఇచ్చారు. దీంతో ఉబ్బితబ్బిబయిన ట్రంప్ ఆయనకు 24 క్యారట్ల బంగారు స్టాండ్‌పై అమర్చిన ఫలకాన్ని బహూకరించారు. ఆపిల్ సంస్థ చైనాకు చెందిన సరఫరాదారులు, ఫ్యాక్టరీలపై ఆధారపడుతోంది. అది ఉత్పత్తి చేస్తున్న ఐఫోన్లలో చాలా వరకూ చైనాఫ్యాక్టరీలలోనే అసెంబుల్ అవుతున్నాయి. చైనా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో అక్కడికి ఆపిల్ ఎగుమతులు పెరుగుతున్నాయి.

## వైమానిక శక్తిలో చైనాను అధిగమించిన భారత్

న్యూఢిల్లీ: ప్రపంచ వైమానిక దళాల శక్తిసామర్థ్యాల్లో భారత వాయుసేన సత్తా చాటింది. ఇప్పటివరకు ఆసియాలో అగ్రగామిగా ఉన్న చైనాను వెనక్కి నెట్టి, ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వైమానిక శక్తిగా అవతరించింది. 'వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడ్రన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్' తాజాగా విడుదల చేసిన ర్యాంకుల్లో ఈ విషయం స్పష్టమైంది.ప్రపంచవ్యాప్తంగా 103 దేశాలకు చెందిన 120 రకాల వైమానిక సేవలను విశ్లేషించి డబ్ల్యూడీఎంఎంఏ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఈ జాబితాలో అగ్రరాజ్యం అమెరికా 242.9 ట్రూ వాల్యూ రేటింగ్ స్కోర్‌తో మొదటి స్థానంలో తిరుగులేని శక్తిగా నిలిచింది. ఆ తర్వాత 114.2 టీవీఆర్ స్కోర్‌తో రష్యా రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇక, 69.4 టీవీఆర్ పాయింట్లతో భారత వాయుసేన మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటివరకు మూడో స్థానంలో ఉన్న చైనా 63.8 పాయింట్లతో నాలుగో స్థానానికి పడిపోయింది.ఈ జాబితాలో జపాన్ (58.1), ఇజ్రాయెల్ (56.3), ఫ్రాన్స్ (55.3) వరుసగా ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో నిలిచాయి. మరోవైపు, పాకిస్థాన్ వైమానిక దళం 46.3 రేటింగ్‌తో 18వ స్థానానికి పరిమితమైంది. ఈ తాజా ర్యాంకులు భారత వైమానిక దళం ఆధునికీకరణ, పెరుగుతున్న సామర్థ్యాలకు అద్దం పడుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## పాఠశాలలు, కాలేజీల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలపై నిషేధం



బెంగళూరు: ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతతత్వ సంస్థలు ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ నియంత్రణలోని ఇతర సంస్థల్లోకి ప్రవేశించకుండా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కర్నాటక మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర న్యాయ, శాసనసభా వ్యవహారాల మంత్రి హెచ్‌కె పాటిల్ గురువారం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఆర్‌ఎస్‌ఎస్ సాగించే కార్యకలాపాలపై నిషేధం విధించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరుతూ ఐటీ–బీటీ మంత్రి ప్రియాంక ఖర్గే లేఖ రాసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆస్తులైన కాలేజీలు, పాఠశాలలు, సంస్థల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలా పాలను ఎంత మాత్రమూ అనుమతించరాదని ఖర్గే ఈ నెల 12న ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దేశంలోని పిల్లలు, యువత, ప్రజలు మొత్తంగా సమాజం సంక్షేమం దృష్టిలో వుంచుకుని ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వ ఆస్తుల ఆవరణల్లో నిర్వహించే అన్ని రకాల కార్యకలాపాలపై నిషేధం విధించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో అక్కడి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్‌పై తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేయాల్సిందిగా చీఫ్ సెక్రటరీని సిద్ధరామయ్య ఆదేశించారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు హాజరయ్యే ప్రభుత్వ అధికారులను సస్పెండ్ చేస్తామని మంత్రి ప్రియాంక ఖర్గే హెచ్చరించారు. తన విభాగంలో కొంతమంది ఉద్యోగులు ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలకు సంస్థ యూని ఫారంలో వెళ్ళారని, త్వరలో వారిని సస్పెండ్ చేస్తామని విలేకర్లకు తెలిపారు. ఇందుకు సంబంధించి పలువురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఆర్‌ఎస్‌ఎస్ ఇంకా ఇటువంటి సంస్థల కార్యకలపాలకు ప్రభుత్వ ఉద్యోగులు హాజరవుతున్నారని అన్నారు.

## గవర్నర్ తీరు రాజ్యాంగ విరుద్ధం



చెన్నై: సిద్ధ యూనివర్సిటీ బిల్లు–2025పై గవర్నర్ ఆర్.ఎన్.రవి వ్యాఖ్యలను తిరస్కరిస్తూ గురువారం తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ఆమోదించింది. ఈ బిల్లుపై గవర్నర్ వ్యాఖ్యలకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమిళనాడు సిద్ధ వైద్య విశ్వవిద్యాలయం బిల్లు ఆర్థిక బిల్లు విభాగంలోకి వస్తుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 207(3) ప్రకారం.. అసెంబ్లీలో ప్రవేశపెట్టే ముందు గవర్నర్ సిఫారసు అవసరమని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించి, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముసాయిదా బిల్లు రూపొందించిందని తెలిపారు. దీనిని న్యాయశాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి పరిశీలించారని, ఆ తర్వాత బిల్లును గవర్నర్‌కి పంపినట్టు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పద్ధతిని అనుసరించి బిల్లును ఆమోదించడానికి బదులుగా గవర్నర్ బిల్లులోని నిర్దిష్టమైన నిబంధనలపై కొన్ని అభిప్రాయాలను వ్యక్తం చేశారని సీఎం స్టాలిన్ తెలిపారు. బిల్లును ప్రవేశపెట్టినపుడు తన పరిశీలనలను అసెంబ్లీ సభ్యుల దృష్టికి తీసుకురావాలని చెప్పారని ఆయన అన్నారు. "రాజ్యాంగం, అసెంబ్లీ విధి విధానాలు, నిబంధనలకు విరుద్ధం. ఒక బిల్లు పరిశీలనలో ఉన్నప్పుడు.. సవరణలను ప్రతిపాదించడానికి, ఆమోదయోగ్యమైన వివరణలు ఇస్తే వాటిని ఉప సంహరించుకోవడానికి లేదా వారు ఆమోదించకపోతే ఓటును డిమాండ్ చేయడానికి అసెంబ్లీ సభ్యులకు మాత్రమే హక్కు ఉంటుంది. ఒక బిల్లును అసెంబ్లీ ఆమోదించే ముందు, దానిపై పరిశీలన సూచించే అధికారం గవర్నర్‌కు లేదు. బిల్లుపై గవర్నర్ నుంచి వచ్చిన పరిశీలనను ఈ సభ ఆమోదించదు" అని స్టాలిన్ పేర్కొన్నారు. "గవర్నర్ 'పరిశీలన' అనే పదాన్ని ఉపయోగించకుండా 'సముచిత పరిశీలన' అనే పదబందాన్ని వినియోగించారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. సముచితం అనే పదానికి అర్థం ఏమిటి? దాని అర్థం అసెంబ్లీ బిల్లును సరైన లేదా తగిన రీతిలో పరిశీలించాలని అర్థం. బిల్లుపై గవర్నర్ సూచన ఆమోదయోగ్యం కాదు. ఇది సభ గౌరవాన్ని అమర్యాద పరచడం. చట్టాలు చేసే అధికారం అసెంబ్లీకి మాత్రమే ఉంటుంది" అని పేర్కొన్నారు.

### హెచ్1బి వీసా రుసుము పెంపుపై
## యుఎస్‌చాంబర్ ఆఫ్ కామర్స్ దావా

హెచ్1బి వీసాల దరఖాస్తుల వార్షిక రుసుమును పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ట్రంప్ యంత్రాంగంపై యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ దావా వేసింది. ఈ రుసుము చట్ట విరుద్ధమని, అమెరికా వ్యాపారాలకు తీవ్ర హాని కలిగిస్తుందని పేర్కొంది. వార్షిక ఖర్చులను గణనీయంగా పెంచాల్సి వస్తుందని, తక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులను నియమించాల్సి వస్తుందని వాదించింది. ట్రంప్ కార్యనిర్వాహక శాఖ అధికారాన్ని అధిగమించారని, ఫెడరల్ గవర్నమెంట్ ఏజెన్సీలు దానిని అమలు చేయకుండా నిరోధించాలని వాషింగ్టన్ డిసిలో గురువారం చాంబర్ ఆఫ్ కామర్స్ దాఖలు చేసిన వ్యాజ్యంలో కోరింది. అమెరికా పౌరులు కాని వారు ప్రవేశించకుండా అడ్డుకునే అధికారం అధ్యక్షుడికి ఉంది కానీ ఆ అధికారం చట్టానికి కట్టుబడి ఉంటుందని, కాంగ్రెస్ ఆమోదించిన చట్టాలను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంది. టెక్ కంపెనీలు భర్తీ చేయడం కష్టతరమైన అధిక నైపుణ్యం కలిగిన కార్మికుల కోసం హెచ్1బి వీసాలు ఉద్దేశించబడ్డాయని, భారత్‌కు చెందిన టెక్ కార్మికులతో సంబంధం కలిగి ఉంటాయని పేర్కొంది. భారతదేశానికి చెందిన సుమారు మూడొంతుల మంది నైపుణ్యం కలిగిన కార్మికులు ఉంటారని పేర్కొంది. కానీ ఆ వర్గం వెలుపల ఉన్న ఉపాధ్యాయులు, వైద్యులు వంటి క్లిష్టమైన వారు కూడా ఉన్నారని తెలిపింది. రుసుము పెంపు హెచ్1బి వీసాలను నియంత్రించే ఇమ్మిగ్రేషన్ చట్టాలను, వీసాలను ప్రాసెస్ చేయడంలో ప్రభుత్వం చేసే ఖర్చుల ఆధారంగా రుసుములు ఉండాలనే నిబంధనను ఉల్లంఘిస్తున్నాయని దావాలో వాదించింది. అమెరికా కార్మికులకు బదులుగా విదేశాల నుండి చవకగా టెక్ కార్మికులను భర్తీ చేస్తున్నారని ఆరోపిస్తూ.. ట్రంప్ యంత్రాంగం గత నెల హెచ్1బి వీసాల వార్షిక రుసుమును 10,000 డాలర్లు (88లక్షలు) పెంచుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అనంతరం ప్రస్తుత వీసా హోల్డర్లకు ఈ రుసుము వర్తించదని పేర్కొంది.

## షట్‌డౌన్ సమయంలో ఉద్యోగులను తొలగించొద్దు

ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగు తున్న సమయంలో ఉద్యోగులను తొలగించేందుకు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఫెడరల్ జడ్జి అడ్డుకున్నారు. షట్‌డౌన్ కొనసాగినంత కాలం ఉద్యోగులను తొలగించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించారు. నాలుగు వేల మంది ప్రభుత్వోద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం ఐదు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను నిలిపివేస్తూ న్యాయమూర్తి బుధవారం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఉద్యోగుల తొలగింపుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకూడదు. అంతేకాక తొలగింపులను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన రెండు కార్మిక సంఘాలకు చెందిన సభ్యులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకూడదు. ప్రభుత్వం చేపట్టిన చర్యలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని శాన్ ఫ్రాన్సిస్కో జిల్లా కోర్టు న్యాయమూర్తి సుసాన్ ఒన్నే ఇల్‌స్టన్ స్పష్టం చేశారు. చట్టాలు అమలవుతున్న దేశంలో ఇలాంటి పనులు చేయకూడదంటూ ప్రభుత్వంపై అక్షింతలు వేశారు. 'మనకు చట్టాలు ఉన్నాయి. ఇక్కడ జరిగిన పనులు చట్టానికి లోబడి లేవు' అని వ్యాఖ్యానించారు. షట్‌డౌన్ సమయంలో ఉద్యోగులను ఇంటికి పంపడం అసాధారణ చర్య అని అన్నారు. ప్రతిపక్ష పార్టీని అప్రదిష్టపాలు చేయడానికి ఉద్యోగుల తొలగింపును ఓ మార్గంగా ఎంచుకోవడం ప్రభుత్వం చేయాల్సిన పని కాదని చురక వేశారు. కాగా ఉద్యోగుల తొలగింపును వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేసిన రెండు కార్మిక సంఘాల్లో వేలాది మంది సభ్యులుగా కొనసాగుతున్నారు.

## చిరకాల మిత్రుడు రష్యాకు మద్దతుగా ఉండాలన్న ఇమ్రాన్ మసూద్



న్యూఢిల్లీ: రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్ర విమర్శలు చేశారు. "ట్రంప్ మనకు తండ్రా ఏంటి మన ప్రధాని మౌనంగా ఉంటే, మనకు అన్నీ ఆయనే చెబుతారా దీని వెనుక ఉన్న రహస్యం ఏంటి" అంటూ ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ సందర్భంగా ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ, "రష్యా మన చిరకాల మిత్రుడు. మేం రష్యాకు అండగా నిలుస్తామని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి. ట్రంప్ మనకిస్తేనే మనం రొట్టెలు తింటామా ప్రపంచంలో భారత్ చాలా పెద్ద మార్కెట్, కాబట్టి ట్రంప్ మనల్ని విస్మరించలేరు. ఆయన కేవలం తన ప్రయోజనాల గురించే ఆలోచిస్తారు. చైనాతో విభేదాలు ఉన్నప్పటికీ అమెరికా పాకిస్థాన్‌కు మద్దతిస్తోంది. ఈ పరిణామాలను గమనిస్తే మనకు ఎవరూ లేరని, మనం ఎవరికీ చెందినవాళ్లం కాదని అర్థమవుతుంది" అని అన్నారు.

## వెనిజులాలో వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర



వెనిజులాలోని వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చాడానికి అమెరికా అధ్యక్షులు ట్రంప్ కుట్ర పన్నారు. ఇందుకోసం రహస్య కార్యకలాపాలు నిర్వహించడానికి సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ( సిఐఎ)కు ట్రంప్ అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తెలిపారు. బుధవారం వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ వెనిజుల నుంచి నేరస్తులను అమెరికాలోకి పంపిస్తున్నారని, మాదక ద్రవ్యాలను సముద్ర మార్గం ద్వారా అక్రమ రవాణా చేసి అమెరికాను అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అందుకే సిఐఎకి అనుమతి ఇచ్చానని చెప్పుకొచ్చారు. అయితే వెనిజులాపై ఆరోపణలకు సంబంధించిన అధారాలను మాత్రం వెల్లడించలేదు. వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా ప్రయత్నాలను వేగవంతం చేసింది. కరేబియన్ సముద్ర జలాల్లో యుద్ధ నౌకలను, విమానాలను, అణు జలాంతర్గాములను,10 వేల సైన్యాన్ని మోహరించింది. అమెరికా సైన్యం తమ ఓడలపై దాడి చేసిన ఇప్పటివరకు 29 మంది అమాయక మత్స్యకారులను హత్య చేసిందని వెనిజులా అధికారులు వెల్లడించారు. దీనిపై అమెరికాలోనూ విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇతర దేశాలపై అమెరికా సైన్యం దాడి చేయాలంటే కాంగ్రెస్ అనుమతి తప్పనిసరని, సైనిక చర్య జరిపిన 48 గంటల్లో అధ్యక్షుడు కాంగ్రెస్‌కు తెలియజేయాలి. కాని ట్రంప్ రాజ్యాంగ విరుద్ధంగా కరేబియన్ సముద్ర జలాల్లో దాడులు జరిపారని ప్రముఖ రాజ్యాంగ న్యాయవాది బ్రూస్ ఫిన్ విమర్శించారు.

## రష్యా చమురు దిగుమతిదార్లపై ఏకపక్ష ఆంక్షలను సహించం




రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్ తదితర దేశాలపై ఆంక్షలు, సుంకాలు విధిస్తామంటూ పదేపదే బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్న అమెరికా తీరుపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయబోమంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమకు హామీ ఇచ్చారని, ఈ విషయంలో చైనా కూడా తొందరలోనే నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ గురువారం నాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తావనకు రాగా..అమెరికా తీరుపై జియాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకపక్ష ఆంక్షలను సహించే ప్రసక్తే లేదని, తీరు మారకపోతే ప్రతి తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోవడాన్ని సమర్థించుకున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులు చట్టబద్ధమైనవని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి ఉండదన్నారు. అమెరికా వైఖరి ఏకపక్ష బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. ఆర్థికపరమైన ఒత్తిళ్లకు గురిచేడమే అమెరికా ఉద్దేశ్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఒంటెద్దు పోకడల వల్ల అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పారిశ్రామిక, సరఫరా గొలుసుల భద్రత, సుస్థిరతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. రష్యాతో సహా పలు ప్రపంచ దేశాలతో చైనా సాధారణ వాణిజ్య, ఇంధన సహకారాన్ని కొనసాగిస్తోందని, ఇది పూర్తి చట్టబద్ధమైనదని జియాన్ స్పష్టం చేశారు.

## బీహార్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ : బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకంపై విపక్ష మహా గట్‌బంధన్(ఇండియా బ్లాక్)లో ఇప్పటికీ ఏకాభిప్రాయం కుదరలేదు. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ పార్టీ 15 మందికి పైగా పేర్లతో తొలి జాబితాను విడుదల చేసింది. తొలి దశ పోలింగ్ నామినేషన్ల స్వీకరణకు నేడే చివరి తేదీ. అయినప్పటికీ మహా గట్‌బంధన్‌లో సీట్ల పంపకం కొలిక్కి రాకపోవటం, కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించటం ఆసక్తికరంగా మారింది. తమ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపే ప్రకటనను కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్ ద్వారా వెల్లడించింది. గోపాల్ గంజ్, అమర్‌పూర్, బెగుసరాయ్, సుల్తాన్‌గంజ్, కుటుంబ, వసీర్‌గంజ్, నలంద, ఔరంగబాద్, రాజాపకడ్, బచ్వర్, బారాబిగా, ముజఫర్‌పూర్, గోవింద్‌గంజ్, రోసెరా, లఖిసరాయ్, బిక్రమ్ వంటి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్టుగా తెలుస్తున్నది. మహాగట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ మొత్తం 60 స్థానాలో కోసం పట్టుబడుతున్నది. కానీ ఆర్జేడీ 50 సీట్లను మాత్రమే ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నది. తాను గెలిచే స్థానాలను విడిచిపెట్టుకోవటానికి ఆర్జేడీ ఏ మాత్రమూ సిద్ధంగా కనబడటం లేదు. ఈ నేపథ్యంలో సీట్ల పంపకంలో ఏకాభిప్రాయం సాధించేందుకు కాంగ్రెస్, ఆర్జేడీ అగ్రనేతల మధ్య చర్చలు నడుస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు ఆర్జేడీ అగ్రనేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడరని పార్టీ వర్గాలు తెలిపాయి. సీట్ల పంపకంలో ఒక ఒప్పందాన్ని ఖరారు చేయాలని ఇరు పార్టీలు నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఇక కాంగ్రెస్ చెప్పినట్టుగానే 61 స్థానాలు ఇవ్వటానికి ఆర్జేడీ సిద్ధమైనా.. హస్తంపార్టీ పట్టుబడుతున్న కొన్ని కీలక నియోజకవర్గాల విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం.

2020 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం 70 స్థానాల్లో పోటీ చేసిన విషయం విదితమే. ఈ సారి ఆ సీట్ల సంఖ్య తగ్గనున్నట్టు తెలుస్తున్నది. ఇటు సీట్ల కేటాయింపుపై ఏకాభిప్రాయం రాకముందే ఆర్జేడీ కీలక నేత బుధవారం రాత్రి నామినేషన్ దాఖలు చేయటం, అనంతరం కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించటం జరిగాయి.

## సీనియర్ ఐపీఎస్ ఇంట్లో గుట్టులుగా నోట్ల కట్టలు..

పంజాబ్: కింది స్థాయి సిబ్బందికి ఆదర్శంగా ఉండాల్సిన ఐఏఎస్, ఐపీఎస్‌లు తప్పుడుగులు వేస్తున్నారు. ప్రజల హితం కోసం పని చేయాల్సిన వారు లంచాలు మేస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. తాజాగా పంజాబ్ రాష్ట్రంలోని రోపవర్ రేంజ్ డీఐజీ, ఐపీఎస్ హర్‌చరణ్ సింగ్ భుల్లర్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కేసులో ఫిర్యాదుదారుడి నుంచి లంచం డిమాండ్ చేయగా.. ఆ విషయం కాస్త సీబీఐకి చేరింది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి డీఐజీ హర్‌చరణ్ సింగ్ భుల్లర్ ఇంటితో పాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో సీబీఐ అధికారులు తనిఖీలు చేపట్టగా.. గుట్టలు గుట్టలుగా కరెన్సీ నోట్ల కట్టలు బయటపడ్డాయి. అది చూసిన సీబీఐ అధికారులకు మతిపోయింది. భారీగా విలువైన వివిధ దేశాల వాచ్‌లతో పాటు భారీ ఎత్తున బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. ప్రస్తుతం రోవర్ రేంజ్ డీఐజీగా పనిచేస్తున్న హర్‌చరణ్ సింగ్ భుల్లర్ ఓ ప్రైవేట్ వ్యక్తితో కలిసి లంచం తీసుకున్న కేసులో అరెస్టు చేసినట్లుగా సీబీఐ అధికారులు ధృవీకరించారు. ఓ కేసు విషయంలో ఫిర్యాదుదారుడి నుంచి రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అయితే, చండీగఢ్‌లోని సెక్టార్ 21లో డీఐజీ తరఫున లంచం తీసుకొంటున్న వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లుగా పేర్కొన్నారు. అనంతరం డీఐజీని అదుపులోకి తీసుకుని చండీగఢ్, పంజాబ్‌లలోని అతడి ఇళ్లలో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ రెయిడ్స్‌లో రూ.5 కోట్లకు పైగా నగదుతో పాటు కిలోన్నర బంగారు ఆభరణాలు, స్థిర ఆస్తులకు సంబంధించిన పత్రాలు, మెర్సిడెజ్, ఆడి వంటి ఖరీదైన రెండు కార్లు, 22 విదేశీ లగ్జరీ వాచ్‌లు, లాకర్ తాళాలు, 40 లీటర్ల దిగుమతి చేసిన లిక్కర్ బాటిళ్లు, పలు ఆయుధాలను అధికారులు సీజ్ చేశారు.

## ప్రశాంత్ కిషోర్‌పై బీజేపీ నేతల వ్యంగ్యాస్త్రాలు



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ (పీకే) ప్రకటించడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ నిర్ణయంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఘాటుగా స్పందించారు. "యుద్ధం ప్రారంభం కాకముందే సేనాని పారిపోయాడు. ఇక సైన్యం పరిస్థితి ఏంటి?" అంటూ ఆయన పీకేను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు పాట్నా చేరుకున్న అనురాగ్ ఠాకూర్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పీకే నిర్ణయం, ఆయన పార్టీ భవిష్యత్తుపై తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు.అంతకుముందు రోజు, తాను ఎన్నికల బరిలో నిలబడటం లేదని ప్రశాంత్ కిషోర్ ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత పనులపైనే పూర్తిగా దృష్టి సారించాలని జన్ సూరజ్ నిర్ణయించిందని, అందుకే తాను పోటీకి దూరంగా ఉంటున్నానని ఆయన తెలిపారు. ఇదే సమయంలో, బీహార్‌లో అధికార ఎన్డీయే ఓటమి ఖాయమని పీకే జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ తిరిగి రాలేరని, ఆయన నేతృత్వంలోని జేడీయూ 25 సీట్లు గెలవడం కూడా కష్టమేనని అన్నారు. తమ పార్టీకి 150 సీట్ల కంటే తక్కువ వస్తే అది ఓటమి కిందే లెక్క అని ఆయన పేర్కొన్నారు.

### అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో బీహార్ ఎన్నికల్లో మరో కొత్త ఫ్రంట్



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం పార్టీ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రెండు ఇతరపార్టీలతో కలిసి కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో బీహార్ రాజకీయాల్లో మరో కొత్త ఫ్రంట్ ఆవిర్భవించినట్లయింది. కిషన్ గంజ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ ఈ పొత్తు వివరాలను వెల్లడించారు. ఆజాద్ సమాజ్ పార్టీ, స్వామి ప్రసాద్ మౌర్యకు చెందిన రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీలతో కలిసి తమ కూటమి ఎన్నికల బరిలో నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. మతతత్వ శక్తులను నిలువరించడమే తమ ప్రధాన లక్ష్యమని ఇమాన్ పేర్కొన్నారు.ఈ కూటమిలో భాగంగా సీట్ల పంపకాలపై కూడా స్పష్టతనిచ్చారు. మొత్తం మీద ఏఐఎంఐఎం 35 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుండగా, ఆజాద్‌సమాజ్ పార్టీకి 25సీట్లు, రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీకి 4 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తయిందని, త్వరలోనే వారి పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ఆయన వివరించారు.

## సంపాదకీయం

# చైనా ఉన్నతిని గుర్తిస్తున్న ప్రపంచం

చైనా, యావత్ ప్రపంచ దేశాలూ అసాధారణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సి.పి.ఐ(యం) ప్రతినిధి బృందం చైనాలో పర్యటించింది. ఆరుగురు ప్రతినిధులతో కూడిన మా బృందం సెప్టెంబరు 23 నుండి 30 వరకు ఆ దేశ రాజధాని బీజింగ్‌తో పాటు హుబెయీ, ఝెజియాంగ్ ప్రావిన్స్‌లను సందర్శించింది. నేను 40 ఏళ్ళ క్రితం, 1985లో తొలిసారిగా చైనాలో జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సుకు హాజరయ్యాను. ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలో మరలా చైనాలో అడుగు పెట్టిన నేను ఆ దేశంలో చోటు చేసుకున్న మార్పులు చూసి ఆశ్చర్యపోయాను. బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్‌లో 'నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' (జాతీయ కళా ప్రదర్శనా వేదిక) పేరిట భూగర్భంలో నిర్మించిన సాంస్కృతిక రంగస్థల సమాహార వేదిక ఆసియాలోనే అతి భారీ కట్టడంగా పేరొందింది. స్థానికంగా ఈ కాంప్లెక్స్‌ను 'జెయింట్ ఎగ్'గా పిలుచుకుంటారు. అద్భుతమైన శిల్ప కళా నైపుణ్యంతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒకేసారి నాలుగైదు భారీ ఇవెంట్లు నిర్వహించుకోవచ్చు. మౌలిక సౌకర్యాల అభివృద్ధిలోని సృజనాత్మకత, సాంస్కృతిక వైభవాలకు ఇది అద్దం పడుతుంది. గతంలో పర్యటించినప్పుడు ఇక్కడ చుట్టు పక్కల పరికిస్తూ ఉండిపోయాను. ఈసారి మాత్రం వయోలిన్, గిటార్‌ల వీనుల విందైన కచేరీని అస్వాదించాం. 2021 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్ళు అయ్యింది. ఈ శత వార్షిక సంబరాల్లో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ అమలు చేసిన భారీ ప్రజా సంక్షేమ కార్యక్రమాన్ని యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నది. ప్రపంచబ్యాంకు నిర్వచనం ప్రకారం దారిద్యరేఖకు దిగువన ఉన్న 80 కోట్ల ప్రజానీకాన్ని చైనా పైకి తీసుకు వచ్చింది. ఈ స్ఫూర్తితోనే కేరళలో సి.పి.ఐ(యం) నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం కూడా దుర్భర దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను పైకి తీసుకురావడానికి వివిధ అభ్యుదయ కార్యక్రమాలను అమలు చేసిన తీరును గుర్తు చేసుకోవడం సందర్భోచితమని భావిస్తున్నాను. ఈ ఏడాది నవంబర్ నాటికి మన దేశంలో దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలుస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది జులై 15న బీజింగ్‌లో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఒక దేశ చరిత్రను, పార్టీ చరిత్రను సునిశితంగా ఎలా ప్రదర్శించవచ్చనే దానికి మ్యూజియమ్‌ను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కాలం నుండి ఆధునిక కాలం వరకూ వందేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలను కళ్ళకు కట్టినట్లు డిజిటల్ రూపంలో ప్రదర్శించారు. చైనాను సామ్రాజ్యావాద, వలస పాలన నుండి విముక్తి చేసేందుకు సాగించిన పోరాటాన్ని, వివిధ దశలలో అనుసరించిన వ్యూహాలను, ఎత్తుగడలను ఆది నుండి తుది వరకు సచిత్ర రూపంలో ప్రదర్శించారు. మావో జెడాంగ్ నాయకత్వం.. కుమింటాంగ్‌తో పొత్తు, 1927 తర్వాతి కాలం నాటి చీలిక, పోరాటాలు, లాంగ్ మార్చ్, అశేష త్యాగాలు, సమరశీల పోరాటాల ద్వారా సాధించిన విప్లవ విజయం, డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన చేపట్టిన ఆధునీకరణ చర్యలు, జియాంగ్ జెమిన్, హుజింటావో నాయకత్వాన కొనసాగిన ఆధునీకరణ పర్వం, 2012 నుండి సీ జిన్‌పింగ్ నాయకత్వాన పార్టీ, దేశం పురోగమిస్తున్న వర్తమాన దశను ఇందులో పొందుపరిచారు. ఈ మ్యూజియంలో 4,548 వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. కార్ల్‌మార్క్స్ బ్రసెల్స్ నోట్‌బుక్, చైనా రిపబ్లిక్‌ను ప్రకటించిన రోజున మావో ధరించిన కోటు, టోపీ, మావో చేతి రాత ప్రతులు, కమ్యూనిస్టు ప్రణాళికను చెన్ వాంగ్టా చైనా భాషలోకి అనువదించిన ప్రతి, లాంగ్ మార్చ్ సందర్భంగా ధరించిన బెల్ట్‌లు, చైనా సైన్యం అమెరికా 31వ పదాతి దళాన్ని ఓడించి కైవసం చేసుకున్న అమెరికన్ జాతీయ జెండా వంటివి చూశాం.మా పర్యటన సందర్భంగా అనేక ద్వైపాక్షిక చర్యలు చోటు చేసుకున్నాయి. అన్నింటిలోకి చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు 'లీ షులేరు' నాయకత్వాన ఉన్న ప్రతినిధి బృందంతో సాగిన చర్యలు ప్రముఖమైనవి. చైనా కమ్యూనిస్టు పార్టీ - సి.పి.ఐ.(యం), ఇరు పార్టీల మధ్య ఉన్న దీర్ఘకాలిక దృఢ సంబంధాలను కొనసాగించాలన్న అభిప్రాయం ఈ చర్చల్లో వచ్చింది. ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచ దేశాల మీద, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణాది దేశాల మీద తన ఆధిపత్యాన్ని రుద్దడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ఇరు పార్టీలూ గమనంలో ఉంచుకుని, ఈ ప్రయత్నాలను నిలవరించడానికి భుజం భుజం కలిపి నిలబడాలన్న ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సందర్భంగా తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్స్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన విషయాన్ని గమనంలోకి తీసుకున్నది. భారత్ చైనా దేశాల మధ్య రాయబార సంబంధాలు నెలకొని 75 ఏళ్లు కావొస్తున్న సందర్భం ఇది. షాంఘై కోఆపరేషన్ వేదికతో పాటు బ్రిక్స్ కూటమిలో కూడా రెండు దేశాలూ వాటి వంతు పాత్ర పోషిస్తున్నాయి. రాబోయే కాలంలో భారత్, చైనాలు వంతుల వారీగా బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని నిర్వహించనున్నాయి. భారత్ %-% చైనాలు చర్చల ద్వారా రెండు దేశాల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవాలని చైనా కమ్యూనిస్టు పార్టీ సిపిఐ(ఎం) ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడడం ఇరు దేశాలకూ లాభదాయకం కావడంతో పాటు ప్రపంచ శాంతికి, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది కాబట్టి ఇరు దేశాలూ సరిహద్దుల వద్ద నెలకొన్న ఉద్రిక్తతలను ఉపశమింపచేయడానికి ఓపికగా కృషి చేయాలని ఇరు పార్టీల ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. వేం ఈ పర్యటనలో ఉన్న సందర్భంలోనే ఆ దిశగా ఆశాజనకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందులో భాగంగానే చైనా-భారత్‌ల మధ్య ప్రత్యక్ష విమానయానానికి ఇరు దేశాలూ అంగీకారానికి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల మీద టారిఫ్ ఉగ్రవాదంతో ఎడాపెడా దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. చైనా మాత్రం తొణుకూబెణుకూ లేకుండా అమెరికాను ప్రతిఘటిస్తూ తమ దేశ ప్రయోజనాల కోసం నికరంగా నిలబడింది. చైనా పటిష్ట ఆర్థిక వ్యవస్థ, చైనా కమ్యూనిస్టు పార్టీ రాజకీయ దృక్పథం ఇందుకు ఎంతగానో తోడ్పడ్డాయి.

# మావోల లొంగుబాటులో భిన్నస్వరాలు


భారతదేశంలో మావోయిస్టు ఉద్యమం దశాబ్దాలుగా రక్తపాతానికి, అస్థిరత్వానికి చిహ్నంగా నిలిచింది. 1967లో నక్సల్‌బరీ తిరుగుబాటుతో మొదలైన ఈ సాయుధ పోరాటం, దేశంలోని అనేక ప్రాంతాలను అస్తవ్యస్తం చేసింది. కానీ, 2025 అక్టోబర్‌లో జరిగిన వరుస సరెండర్లు ఈ ఉద్యమానికి ముగింపు దశ వచ్చినట్టు సూచిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు (అలియాస్ భూపతి, సోనూ) మహారాష్ట్రలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోవడం, ఆయనతో పాటు 60 మంది కేడర్ సరెండర్ చేయడం ఒక మైలురాయి. ఇది కేవలం ఒక సంఘటన కాదు. మావోయిజంలో అంతర్గత విభేదాలు, ప్రభుత్వ ఒత్తిడి, సమాజ మార్పులు అన్నీ కలిసి సృష్టించిన పరిణామమే ఈ లొంగుబాటు. ఈ సరెండర్లు మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బ. కానీ, ఈ లొంగుబాటు దీర్ఘకాలిక ఉద్యమానికి,విరామమా !? లేక వ్యూహాత్మక వెనకడుగా!? అనేది విశ్లేషించాల్సిన అంశం. మల్లోజుల వేణుగోపాల్ సరెండర్ ఒక చారిత్రక సంఘటన. 70 ఏళ్ల వయస్సున్న అగ్రనేత. పార్టీ వ్యవస్థాపక సభ్యుడు.పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు. ఆయన వ్యూహకర్తగా పేరుపొందాడు. రెండు నెలల క్రితం వరకు పార్టీ అధికారిక ప్రతినిధిగా పనిచేశాడు. గడ్చిరోలి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన తుపాకీని సీఎం చేతికి అప్పగించి, రాజ్యాంగాన్ని అందుకున్నాడు. 7 ఏకే-47లు, 6 ఎస్ఎల్ఆర్‌లు, 6 ఇన్సాస్ రైఫిళ్లతో సహా 54 ఇతర ఆయుధాలు ప్రభుత్వానికి అప్పగించారు. ఇది మావోయిస్టు చరిత్రలో మొదటిసారి ఒక సీఎం ముందు అగ్రనేత సరెండర్ అవడం. సీఎం ఫడ్నవీస్ దీనిని "మావోయిజం వెన్ను విరిగింది" అని వ్యాఖ్యానించారు. మిగిలిన కేడర్ కూడా త్వరలో లొంగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో మావోయిజం దాదాపు అంతమైందని, కేవలం ఒక కంపెనీ (10 మంది) తో మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. నెల రోజులుగా పోలీసుల సంప్రదింపులు, ఆపరేషన్లు ఈ ఫలితానికి కారణమని పేర్కొన్నారు. ఈ సరెండర్ వెనుక అంతర్గత విభేదాలు స్పష్టం. సెప్టెంబర్‌లో 'అభయ్' పేరిట వచ్చిన లేఖలో మావోయిస్టులు ఆయుధాలు వీడటానికి సిద్ధమని, దీర్ఘకాలిక సాయుధ పోరు పొరపాటని పేర్కొన్నారు. ఒక నెల సీజ్‌ఫైర్ ప్రతిపాదన కూడా చేశారు. ఇది పార్టీలో కలకలం రేపింది. కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణ రెడ్డి (అధికార ప్రతినిధి) దీనిని తప్పుపట్టి లేఖ విడుదల చేశారు. కానీ ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. మల్లోజుల పార్టీ వ్యూహంలో లోపాలున్నాయని, తాను భాగస్వామినని పేర్కొంటూ పొలిట్‌బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశాడు. ఈ లేఖలు సరెండర్‌కు సంకేతాలిచ్చాయి. పోలీసులు ఈ సంకేతాలను పసిగట్టి, వేణుగోపాల్ సోర్స్‌ను పట్టుకుని రాయబారం నడిపారు. ఆయన సీఎం ముందు మాత్రమే సరెండర్ అవుతానని షరతు పెట్టడం గమనార్హం. గతేడాది డిసెంబర్‌లో ఆయన భార్య తారక్క గడ్చిరోలిలో సరెండర్ అయింది. ఇటీవల మల్లోజుల కోటేశ్వరరావు భార్య సుజాత తెలంగాణలో లొంగిపోయింది. కోటేశ్వరరావు 2011లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. వేణుగోపాల్ ఆయన రెండో అన్న. తెలంగాణకు చెందిన వేణుగోపాల్ లొంగుబాటుకు మహారాష్ట్రను ఎంచుకోవడం ఆసక్తికరం. సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ, మహారాష్ట్ర ప్రభుత్వం సరెండర్ అయినవారికి ఉద్యోగాలు, నివాసం, సదుపాయాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు. లాయిడ్ స్టీల్ కంపెనీ లొంగిపోయిన మావోయిస్టులకు ఉద్యోగాలు ఇస్తుంది, ఇప్పటికే 70 మంది పనిచేస్తున్నారు. తాజాగా సరెండర్ అయినవారికి 6 నెలలు వృత్తి పరంగా శిక్షణ ఇచ్చి, షేర్‌హోల్డర్లుగా చేస్తామని కంపెనీ ప్రతినిధి ప్రభాకరన్ తెలిపారు. ఇది ప్రభుత్వ రీహాబిలిటేషన్ పాలసీల విజయాన్ని సూచిస్తుంది. కానీ విమర్శకులు ఇది తాత్కాలిక ఆకర్షణ మాత్రమేనని అంటున్నారు. లొంగిపోయినవారు సమాజంలో పూర్తిగా సమైక్యమవుతారా లేక పాత ఇడియాలజీకి తిరిగి వెళ్తారా అనేది ప్రశ్న. వేణుగోపాల్ 45 ఏళ్ల పార్టీ ప్రస్థానం ఆసక్తికరం. 1956లో తెలంగాణ పెద్దపల్లిలో జన్మించిన ఆయన, తండ్రి వెంకటయ్య ప్రభావంతో నక్సల్ బాట పట్టాడు. అన్న కోటేశ్వరరావు (కిషన్‌జీ) తర్వాత పీపుల్స్ వార్‌లో చేరాడు. 1981లో ఫుల్‌టైమర్‌గా అజ్ఞాతంలోకి వెళ్లాడు, 1992లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రెటరీగా, 2007లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగాడు. 2011లో చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్) మరణం తర్వాత అధికార ప్రతినిధిగా పనిచేశాడు. తల్లి 2022లో మరణించినా అంత్యక్రియలకు రాలేదు. ఇప్పుడు సరెండర్ చేయడం మావోయిజం ఆదర్శాల ఆచరణలో వచ్చిన మార్పును సూచిస్తుంది. ఈ సరెండర్ తర్వాత వరుస పరిణామాలు జరిగాయి. తెలంగాణలో మావోయిస్టు తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ బండి ప్రకాశ్ (అలియాస్ ప్రభాత్) డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయాడు. 40 ఏళ్లకు పైగా దండకారణ్యంలో ఉన్న ఈ బెల్లంపల్లి వాసి, తీవ్ర అనారోగ్యం కారణంగా పార్టీ వీడాడు. మావోయిస్టు అనుబంధ సంస్థ సింగరేణి కార్మిక సమాఖ్యలో మాజీ కార్యదర్శి అయిన ప్రకాశ్, మల్లోజుల వేణుగోపాల్ ఆయుధాలు వదులుకోవాలన్న వాదనను సమర్థించాడు. ఇది పార్టీలో అనారోగ్యం, వయస్సు సమస్యలు సరెండర్లకు కారణమవుతున్నాయని చూపిస్తుంది. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లో 50 మంది మావోయిస్టులు ఉత్తర బస్తర్ అడవుల నుంచి కాంకేర్ జిల్లాలోని కామ్‌తేరా బీఎస్ఎఫ్ క్యాంపుకు చేరుకున్నారు. వీరిలో డీకేఎస్‌జడ్సీ సభ్యుడు రాజ్‌మన్ (కందగట్ల యాదగిరి), మిలిటరీ చీఫ్ రాజు సలామీ (శివప్రసాద్) సహా 32 మహిళలు ఉన్నారు. 49 ఆయుధాలతో వచ్చిన వీరిలో ఒక రీజనల్ కమిటీ సభ్యుడు, 5 వ, డివిజన్ కమిటీ సభ్యులు, 21 ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో వీరు సరెండర్ అవుతారని అంచనా. ఆశన్న (తక్కళ్లపల్లి వాసుదేవరావు), రనిత టీమ్ కూడా 50-70 మందితో సరెండర్ అవుతారనే ఊహాగానాలు ఉన్నాయి. ఇది జరిగితే, మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద సరెండర్ అవుతుంది, 100-120 మంది లొంగిపోవచ్చు. ప్రధాన మీడియాలో ఈ సరెండర్లపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా దీనిని "50 ఏళ్ల మావోయిస్టు ఉద్యమం ముగింపు" అని వర్ణించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ "రాజకీయ-ఆదర్శవాద విజయం" అని పేర్కొంది. హిందూ పత్రిక వేణుగోపాల్ సరెండర్‌ను "పెద్ద దెబ్బ" అని చెప్పింది. ది ప్రింట్ ఆయన టెక్ సావీ, అగ్రనేత అయినా సరెండర్ చేయడాన్ని విశ్లేషించింది. కొంతమంది విమర్శకులు మావోయిజం "మాసెస్ నుంచి అన్యాయం" అని, పార్టీలో వెస్టెడ్ ఇంటరెస్ట్స్ ఉన్నాయని చెప్పారు.సోషల్ మీడియాలో (%శ%) కూడా హల్‌చల్. ఒక పోస్ట్ "మహారాష్ట్ర నక్సల్ ఫ్రీ" అని ప్రశంసించింది. మరొకటి అమిత్ షా వాగ్దానాన్ని గుర్తుచేసింది. కానీ కొన్ని పోస్టులు మావోయిజం ముగియడాన్ని సందేహించాయి, ప్రభుత్వ ఒత్తిడిని విమర్శించాయి. గణాంకాల ప్రకారం, 2025లో 1040 మావోయిస్టులు సరెండర్ చేశారు, గత ఏడాది 881తో పోలిస్తే పెరిగింది.రెండు రోజుల్లో 258 మంది లొంగిపోయారు. మావోయిజం 11 జిల్లాలకు పరిమితమైంది, మూడు మాత్రమే తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లో 836 అరెస్టులు, 1639 సరెండర్లు జరిగాయి. ప్రభుత్వం 2026 నాటికి మావోయిజం అంతం చేస్తామని వాగ్దానం చేసింది. కానీ విమర్శనాత్మకంగా చూస్తే, సరెండర్లు పెరిగినా, మూల కారణాలు (పేదరికం, అసమానతలు) పరిష్కరించకపోతే ఉద్యమం మళ్లీ తలెత్తవచ్చు. అంతర్గతంగా పార్టీ "మాసెస్ నుంచి దూరమైంది" అని వేణుగోపాల్ చెప్పాడు. రీహాబిలిటేషన్ పాలసీలు బలోపేతం చేయాలి.లేకపోతే ఇవి తాత్కాలిక విజయాలుగా మిగిలిపోతాయి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.రావూరి భరద్వాజ (జూలై 5, 1927- (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చు కున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతుంది. ఆయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబ రాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో



ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకల నాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించుకున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదమైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలిసరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారావాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ - ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇసుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# ధన త్రయోదశి తో దీపారాధనకు శ్రీకారం

దీపావళి పండగ సందర్భంగా వరుసగా ఐదు రోజులు పర్వదినాలుగా భావించ బడుతున్న క్రమంలో మొదటిదైన ధన త్రయోదశి ప్రాముఖ్యతను సంత రించుకున్నది. ఆది వైద్యుడైన ధన్వంతరి జయంతి కావడం చేత ధన్వంతరి త్రయోదశిగా భావిస్తారు. అందుకే వైద్యులు ఘనంగా పూజిస్తారు. మహావిష్ణువు వామనావతారం ధరించి, బలిచక్రవర్తిని పాతాళానికి అణగదొక్కిందీ ఈరోజేనని ప్రతీతి. అందుకే 'త్రివిక్రమ త్రయోదశి'గా పిలవడమూ పరిపాటి. ఈ రోజుకు ధన్వంతరీ త్రయోదశి, యమ త్రయోదశి, కుబేర త్రయోదశి, ఐశ్వర్య త్రయోదశి వంటి పేర్లూ ఉన్నాయి. 'అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. అకాల మత్యుభయాలు లేకుండా, సిరి సంపదలతో విలసిల్లాలి' అనే శుభాకాంక్షలకు నేపథ్యమే ధనత్రయోదశి పర్వదినం. సంపదలతో తుల తూగడానికి లక్ష్మీదేవినీ, సంపూర్ణ ఆరోగ్యంకోసం ధన్వంతరినీ, సుస్థిర ఆర్థిక వృద్ధికి కుబేరుణ్ణీ, అపమృత్యు బాధలు తొలగడానికి యమధర్మరాజును వివిధ రీతుల్లో ధన త్రయోదశినాడు పూజించడం సాంప్రదాయం.గుజరాతీయులకు సంవత్స రాది. అమావేర్ జ్యోతిషీ త్రయోదశిగా పేర్కొంది. అనగా పదమూడవ తిథి, పాశ్చాత్యులు పదమూడవ సంఖ్య మంచిది కాదని భావిస్తుండగా, హిందువులు మాత్రం మంచి రోజుగా తలుస్తారు. ధన త్రయోదశిని గుజరాతీయులు "ధన్ తేరస్" అని పిలుస్తారు. పొరుగు వారైన మహారాష్ట్రులు ధన త్రయోదశిని గొప్పగా జరుపు కుంటారు. ఆంధ్రావనిలోనూ పవిత్రమైన దినంగా ఆచరిస్తారు. ఈరోజు తమ ఇళ్ళను శుభ్ర పరుస్తారు. అలికి, కడిగి, ఇళ్ళముందు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దుతారు. శుచిగా, శుభ్రంగా ఉంచితే లక్ష్మీదేవి తమ ఇంటికి రాగలదని విశ్వాసం. ఈనాటి నుండి దీపాలను వెలిగించడం ప్రారంభం అవుతుంది. ఈనాడు అభ్యంగన స్నానం చేసి, మంచి బట్టలు వేసుకుని, సుగంధ ద్రవ్యాలు రాసుకుని, ధన పూజ చేస్తారు. ఇంట్లో ఉన్న బంగారు, వెండి వస్తువులను పాలతో కడుగుతారు. శుభ్రంగా పూజా స్థలంలో ఉంచుతారు. షావుకార్లు వ్యాపారులు ఈదినం తమ సరుకుల నిలువ, రొక్కం నిలువ సరి చూసుకుని, లక్ష్మీ పూజ చేస్తారు.గుజరాత్, మహారాష్ట్రలలో, మాళవదేశంలో పండగ ఆచరణ అనాదిగా ఉంది. దీపావళి నుండి కొత్త ఖాతాలు, లెక్కలు ప్రారంభిస్తారు. వర్షాలు చాలా వరకు వెనకపట్టు పడుతుండడంతో, ఇక్కకు వెల్లవేసి, అలంకరణలు చేస్తారు. యమలోకం లోని పితరులు కూడా ఈ పండగకు తమ పూర్వ గృహాలకు తిరిగి వస్తారని మాళవ దేశస్తుల విశ్వాసం. ధన త్రయోదశి నాడు సాయంకాలం తమ ఇళ్ళ ముందు దక్షిణ దిశగా దీపాలు ఉంచుతారు. వచ్చే పితృ దేవతలకు దీపాలు దారి చూపిస్తా యని నమ్మకం. ఇంటి యజమాని, తల్లిదండ్రులు ఉంటే దక్షిణ దిక్కుగా పెట్టరు. ఈనాడు ఇంటిలో ఒక్క దీపమైనా పెడతారు. వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సహస్ర నామార్చ నలు, లక్ష్మీ సూక్త మూలమంత్ర సంపుటీకరణం శ్రీసూక్త పూజలు గావిస్తారు. ప్రత్యేక దీపాలంకరణ ఆరాధనలు నిర్వహిస్తారు. ఆయుర్వేద విజ్ఞానానికి ధన్వంతరి ఆరాధ్య దైవం. క్షీరసాగర మథనం సమ యంలో మహావిష్ణువు అంశావతారంగా అమృత కలశ హస్తుడై సమస్త జనావళికి రోగ నివారణ ద్వారా ఆరోగ్యాన్ని ప్రసాదించడానికి ధన్వంతరి ఆవిర్భవించిన దినాన్ని హిందువులు ధన త్రయోదశి అని పండుగ జరుపుకుంటారు. గృహాలలో, నదీ సాగర తీరాలలో, వైద్య శాలలలో తూర్పు దిక్కుగా కలశ స్థాపన చేసి, ధన్వంతరిని ఆవాహన గావించి, ధన్వంతరిని ధ్యానించాకనే యథాశక్తి షోడశోపచార సహిత పురుశసూక్త విధానంతో అర్చన జరిపి, మత్స్య పురాణాంతర శ్లోక పఠనం చేసి, గరుడ పురాణాంతర్గత ధన్వంతరి సార్థకత కథ పారాయణం చేసి, వైద్యులకు, పెద్దలకు తాంబూలాలు సమర్పించి, ఘృతయుక్త పెసర పులగం నివేదన చేసి, భుజించడం ఆచారం. అలాగే లక్ష్మీదేవి ధనప్రదాతగా ఆవిష్కారమైన రోజుగా, దన త్రయోదశినాడు బంగారు,

వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దీంతో ఏడాది పొడవునా తమకు ధనలక్ష్మీ కృపాకటాక్షాలు చేకూరుతాయని విశ్వసిస్తారు...

# రైతుల ప్రయోజనం ప్రధానం,

## వసతులు సమృద్ధిగా ఏర్పాటు చేయాలి,
## హార్వెస్టర్, ట్రాన్స్పోర్ట్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి,
## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు,
## మిల్లర్లు రైతుల వరి ధాన్యంలో తాలు పేరుతో తగ్గిస్తే కఠిన చర్యలు ఉంటాయి,
## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17(వుదయం ప్రతినిధి) :రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, సకాలంలో చెల్లింపులు జరిగే విధంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి స్థాయిలో ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయబోయే అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వసతులు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడ సమీపంలో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వానాకాలం 2025%–%26 ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, మిల్లర్లు, రైతు సంఘాల నాయకులు, హార్వెస్టర్ యజమానులు, ట్రాన్స్పోర్ట్ యజమానులు, మెట్మ కేంద్రాలు, ఐకెపి కేంద్రాల ఆపరేటర్లు, ప్రాథమిక వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, కోఆపరేటివ్ శాఖ, లీగల్ మెట్రాలజీ, ట్రాన్స్పోర్ట్ శాఖలు, మార్కెట్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,%ˆ% రైతుల కష్టం వృథా కాకూడదు. వారికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా, వారు అమ్మిన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర చెల్లింపులు 48 నుంచి 72 గంటల్లోపు వారి ఖాతాల్లో జమ కావాలి, అని స్పష్టం చేశారు. మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతుల నష్టానికి కారణమయ్యే విధమైన ఆలస్యాలు జరగకుండా చూడాలని సూచించారు. మిల్లర్లు రైతులకు అవరోధాలు సృష్టిస్తే లేదా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఉద్దేశం రైతు సంతోషం, రైతుకు న్యాయం జరగడం. ఎవరైనా దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే సహించము, అని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, తేమ కొలిచే పరికరాలు, గడ్డి తొలగించే యంత్రాలు, తాత్కాలిక షెడ్లు, వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా కప్పు సౌకర్యం వంటి వసతులు తప్పనిసరిగా ఉండాలని ఆయన చెప్పారు. వర్షాల కారణంగా ధాన్యం పాడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుండి ధాన్యం తరలింపును ఆన్లైన్ విధానంలో నమోదు చేసి, రైతుల ఖాతాల్లో చెల్లింపులు వెంటనే జరగేలా చూడాలి. పారదర్శకత, సమయపాలన ఈ సీజన్ యొక్క ప్రధాన లక్ష్యాలు కావాల ని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం సరిగ్గా కొలవడం, ధాన్యం నాణ్యత పర్యవేక్షణ, మిల్లులకు తరలింపుపై డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించాలని ఆయన సూచించారు. వరి కోతలు ప్రారంభమైన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు రైతుల అవసరాలకు అనుగుణంగా హార్వెస్టర్‌లను సమీకరించి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తమ ధాన్యం తరలించడానికి వాహనాల కోసం ఇబ్బంది పడకుండా ట్రాన్స్పోర్ట్ యజమానులు ముందస్తు ప్రణాళికతో వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ ధాన్యం కోసి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వెంటనే మిల్లుకు తరలించే విధంగా సమర్థవంతమైన వ్యవస్థ ఏర్పాటుచేయాలి. ఎక్కడైనా ధాన్యం నిల్వలు పెరగకూడదు, అని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన వెంటనే కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాల పనితీరు, చెల్లింపుల స్థితి, ధాన్యం తరలింపు వివరాలు రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తారు. ఎక్కడైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే లేదా రైతులు ఫిర్యాదు చేస్తే, వెంటనే విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాము, అని కలెక్టర్ హెచ్చరించారు. రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రతి ధాన్యం గింజ రైతు కష్టానికి ప్రతీక. రైతు చెమట చిందించి పండించిన ఆ ధాన్యాన్ని గౌరవంగా కొనుగోలు చేసి, అతనికి గౌరవప్రదమైన ధర చెల్లించడం మన బాధ్యత, అని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ఈ సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు డిఆర్డిఏ పిడి చిన్న ఓబులేసు, జిల్లా సహకార అధికారి రఘు, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంతరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# పత్రికలపై కక్ష సాధింపు తగదు

- –అక్రమ కేసులతో జర్నలిస్టుల కలాలను బంధించలేరు
- – సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై అక్రమ కేసులు ఎత్తి వేయాలి
- – పత్రికలపై రాజకీయ దుష్ట నీతిని ప్రదర్శించరాదు
- – నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు
- – ధనుంజయ రెడ్డి పై అక్రమ కేసులను నిరసిస్తూ జర్నలిస్టుల నిరసన



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17(వుదయం ప్రతినిధి) :పత్రికలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, పత్రికలు, జర్నలిస్టులు, ఎడిటర్లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దుష్ట నీతిని ప్రదర్శించరాదని జర్నలిస్టులు అన్నారు. శుక్రవారం ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు, ప్లే కార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను భంగం కలిగించే చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. పత్రికారంగాన్ని రాజకీయ కోణంలో చూస్తూ అక్రమ కేసులను పెట్టి భయపెట్టడం ఎంతవరకు నమంజనం అని వారు ప్రశ్నించారు.

అక్రమ కేసులతో కలాలకు కళ్ళెం వేస్తామంటే సహించేది లేదన్నారు. ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు సమస్యలను పత్రిక ద్వారా ప్రజల ముందుకు తీసుకురావడమే నేరమా అని వారు ప్రశ్నించారు. పత్రికలు ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారదులుగా ఉంటూ సంక్షేమం అభివృద్ధి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అటు ప్రభుత్వాలు అధికారుల దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా పత్రికలు పనిచేస్తాయి అన్నారు. అక్రమ కేసులు పెట్టి పత్రికలను తమ గుప్పిట్లోకి తీసుకురావడం కోసం ఇలాంటి తప్పుడు కేసులు పెడితే జర్నలిస్ట్ సమాజం సహించబోదని అన్నారు. ఇలాంటి చర్యలను మానుకోకపోతే జర్నలిస్టు సమాజం తమ సత్తా ఏమిటో చూపిస్తుందని అప్పుడు ప్రజా ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా జర్నలిస్టులపై ఎడిటర్లపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేసి జర్నలిస్టు సమాజానికి పత్రికా రంగానికి ఏపీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసీనియర్ జర్నలిస్ట్ లు కండికొండ మోహన్, జెమినీ సురేష్, అహ్మదుల్లా ఖాన్, హకీమ్ కిషోర్, మాధవ రెడ్డి, పాదం వెంకటేష్, జర్నలిస్ట్ లు రాజేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,

ఏటీగడ్డ వెంకటేష్, సత్యం, సందరాజు బలస్వామి, ఎస్ ఎస్ బాబు, బలస్వామి, వినయ్ గౌడ్, శేఖర్, వెంకటేష్, పరమేష్, మల్లేష్, ప్రదీప్, శ్రీశైలం, బాలు, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి బందును విజయవంతం చేయండి
## అఖిల భారత యాదవ సంఘం

నారాయణపేట అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) : నేటి బందుకు ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీర్ యాదవ్ మాట్లాడుతూఅసలైన బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్ల సాధన కొరకు రాష్ట్రంలోని బీసీ సంఘాల జైంట్యాక్షన్ కమిటీ, జాగృతి బీసీ సేన ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర బంద్ కు పార్టీలకతీతంగా సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఇందుకు గాను యాదవుల తరపున అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా,నారాయణపేట జిల్లా వ్యాప్తంగా యాదవులందరూ పార్టీలకతీతంగా పూర్తిస్థాయిలో ఈ బందులో పాల్గొని జయప్రదం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర నాయకుడు వెంకట్ యాదవ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బాలగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు అఖిల భారత యాదవ మహాసభ పట్టణ అధ్యక్షుడు చిన్నయ్య యాదవ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం.

**రైల్వే పాసులు పునరుద్ధరించాలి.**
**ఉద్యమ నేపథ్యాన్ని చూసి టి డబ్ల్యూ జేఎఫ్ లో చేరిన సీనియర్ జర్నలిస్టు పి వెంకటస్వామి**
**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ.**



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) :జర్నలిస్టుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తామని, జర్నలిస్టులకు రైల్వే పాసులను ప్రభుత్వం పునరుద్ధరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ పరిపూర్ణం లు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా మహాసభల నిర్వహణపై సన్నాహక సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో రామ్ చందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజేయునుండి సీనియర్ జర్నలిస్టు మెట్రో ఈవినింగ్ స్టాఫ్ రిపోర్టర్ పి వెంకటస్వామి టీ డబ్ల్యూ జె ఎఫ్ సభ్యత్వం తీసుకొని సంఘంలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ. జర్నలిస్టుల హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పోరాటాలు చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఆయా నియోజకవర్గ కేంద్రాలలో ఇండ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేటు వైద్యశాలలో చెల్లుబాటు అయ్యే విధంగా హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అన్నారు.. జిల్లా మహాసభల నిర్వహణ కోసం మరొకసారి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించుకొని ఫైనల్ గా ఒక తేదీ అనుకొని ప్రశాంతమైన వాతావరణంలో జిల్లా మహాసభలు నిర్వహించుకునేందుకు ప్రణాళికలు. రూపొందించుకోవాలన్నారు. కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నాగర్ కర్నూల్ నియోజకవర్గాలలో సభ్యత్వాలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రం, ప్రధాన కార్యదర్శి కాలూరి శీను, జాతీయ కౌన్సిల్ సభ్యులు దుమర్ల భాస్కర్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, మద్దిలేటి, బాదం పరమేశ్వర్, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి

**ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల రాజేష్ రెడ్డి**



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) :ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల రాజేష్ రెడ్డి అన్నారు శుక్రవారం నాడు జిల్లా కేంద్రం లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలకపల్లి, తిమ్మాజిపేట మండలాలకు సమందించిన 27 కుటుంబలకు సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు..

ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కి, ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ , స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు..

## చికిత్స పొందుతున్న మాజీ సర్పంచిని పరామర్శించిన ఎమ్మెల్యే



వెల్దండ అక్టోబర్ 17 (వు దయం ప్రతినిధి) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇందులోని ఎన్నమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గానుగట్ట తండా మాజీ సర్పంచ్ పద్య నాయక్ ను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించారు పక్యా నాయక్ కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమామలీల సంజీవ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, నారాయణ, అలీ, తదితరులు ఉన్నారు

## ఊరుకొండ పేటలోగుంతల మయమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.







ఊర్కొండ ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊరుకొండ పేట గ్రామంలో జిల్లా ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం దగ్గర ప్రమాదకరంగా మారింది. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోవాలని విద్యార్థులు ప్రతినిత్యం గాయాల పాలవుతున్నారని గుంతల మయంలా ఉన్న ప్రధాన ద్వారం ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోని తక్షణమే బాగు చేయించాలని ఊరుకొండ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోరుతున్నారు.

## నేటి రాష్ట్ర బందు కు సహకరించాలి
## నారాయణపేట అఖిలపక్షం నేతల డిమాండ్



నారాయణపేటలో మాట్లాడుతున్న అఖిలపక్షం నేతలు

నారాయణపేట టౌన్ అక్టోబర్ 17( వుదయం ప్రతినిధి) నేటి తెలంగాణ రాష్ట్ర బంద్ కు సహకరించి విజవంతం చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజ్, అఖిలపక్షం నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయమైన డిమాండే అన్నారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కలిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్రప్రభుత్వం పార్లమెంట్ లో చట్టం అమలు అయ్యేలా చూడలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బంద్ కు బిసి బందువులు రాజాకీయలకు అతితంగా పెద్ద సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని బంద్ కు వ్యాపార ప్రైవేట్ సంస్థలు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు బండి శివరాం రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు, పట్టణ అధ్యక్షులు మీర్చి వెంకటయ్య, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రమేష్, ఎ.రామ్ రెడ్డి,యంకి హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మక్తల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్రంలో ప్రమాణాలతో కూడిన విద్య,మెరుగైన వైద్యం, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సాంకేతిక శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్లక్రమంలో భాగంగా శుక్రవారం మక్తల్ మండల పరిధిలోని సంగం బండ ( దివంగత చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్) రిజర్వాయర్ తో పాటు మక్తల్ పట్టణంలోని పెద్ద చెరువు మిని ట్యాంక్ బండ్ లో చేప పిల్లలను మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో కలిసి చేప పిల్లను విడుదల చేశారు. సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 100 శాతం రాయితీతో 26 వేల చెరువుల్లో 88 కోట్ల చేపపిల్లలు,10 కోట్ల రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూబీద బడుగు బలహీనర్గాలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. నారాయణపేట– మక్తల్–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని కృషి చేస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్, ఎమ్మెల్యేలు డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఈర్లపల్లి శంకర్, మత్స్య శాఖ సంఘం నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పత్యనాయక్ ను పరామర్శించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ అక్టోబర్ 17 (వు దయం ప్రతినిధి) మండల పరిధిలోని గానుగట్టు తాండకి చెందిన మాజీ సర్పంచ్ పత్య నాయక్,చేర్యాల్ గ్రామానికి చెందిన శ్రీను గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు యేన్నం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హాస్పిటల్ కు విచ్చేసి ఇరువురిని పరామర్శించారు ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వైద్యులకు మెరుగైన వైద్యం అందిచాలని సూచించారు.. తదనంతరం వారి కుటుంబాలకు ఖర్చుల నిమిత్తం 10,000/– రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్,మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్,మాజీ ఉప సర్పంచ్ నర్సింహా,మాజీ ఎంపీటీసీ నిరంజన్,బచ్చలకూర శ్రీను,మైసయ్య, సత్యం,గొడుగు యాదయ్య,కొండల్ యాదవ్,వెంకటయ్య,ఆలీ,ఆనంద్,గాండ్ల జంగయ్య,చర్కా కొండల్,రామచంద్రయ్య,బర్కం గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బిసి బంద్ ను జయప్రదం చేద్దాం -

**42% బిసి రిజర్వేషన్ బంద్ సంపూర్ణ మద్దతు తెలపాలని వినతి పత్రాలు అందజేసిన అఖిలపక్ష, బిసి సంఘాల నాయకులు**

(గద్వాల అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం బిసిలకు 42% రిజర్వేషన్ ప్రకటించడం జరిగింది.అట్టి రిజర్వేషన్ బిల్లును హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే, రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్డ్ చేర్చితే 42% బిసి లకు రిజర్వేషన్ అమలుకు బిసి జెఏసి రేపు 18/10/2025 రోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుకు అర్ టి సి. డిపో అధికారికి,గద్వాల జిల్లా కేంద్ర వ్యాపార సంస్థల దుకాణదారుల అసోసియేషన్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్య, హెూటల్ వ్యాపార,దుకాణ సముదాయ అసోసియేషన్ లకు సంపూర్ణ మద్దతుగా స్వచ్ఛంద బంద్ ను జయప్రదం చేయాలని అఖిలపక్ష,బిసి జెఏసి నాయకులు పట్టణంలోని వు బైక్ ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేసినారు.

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు,బిసి జెఎసి నాయకులు మదుసూదన్ బాబు,అతికూర్ రెహమాన్,ఆలూరు ప్రకాశ్ గౌడ్,మాల శ్రీనివాసులు,ధరూర్ రవి,వాల్మీకి,గంజిపేట్ రాజు, కురువ పల్లయ్య,సీసాల వెంకట్ రెడ్డి,ఎల్కూర్ రంగన్న,వినోద్,టవర్ మకబ్బూల్,కిరణ్, ముని,కృష్ణయ్య యాదవ్,భద్రప్ప,వీరేష్,రామ్మోహన్,రంగస్వామి, నాగన్న,రహిమతుల తదితరులు ఉన్నారు.

# ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సు




(గద్వాల అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డిఎస్పి కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు డిఎస్పి మొగులయ్య ఆధ్వర్యం లో జరిగింది.నేడు.. ఆటో డ్రైవర్ తమ్ముళ్లకు నియమ నిబంధనలతో పాటు బాధ్యత రహితంగా నడపాలి అని అన్నారు. అనంతరం ప్రతి ఆటో డ్రైవర్ మరియు యజమాని ఆటోకు సంబంధించిన పత్రాలు ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలి అన్నా రు.అలాగే ప్రయాణికులను ఎక్కువ మోతాదుల్లో తీసుకువెళ్తే కఠినమైన చర్యలు కూడా ఉంటాయి అన్నారు. డ్రంకింగ్ డ్రై, మరియు ట్రాఫిక్ రూల్స్, ప్రతి ఒకరు పాటించాలి అని ఆయన ఈ సదస్సులో తెలియపరిచారు.

# బి అర్ యస్.పార్టి కి బిగ్ షాక్..

**ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ సమక్షంలో కాంగ్రేస్ తీర్థం పుచ్చుకున్న మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సంకాపురం రాముడు మాజి జడ్ పి టి సి పులికల్ హనుమంతు**



(అలంపూర్ అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి) :జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంయద్రంలో శుక్రవారం ఎఐసిసి కార్యదర్శి,అలంపూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎస్ ఏ.సంపత్ కుమార్ సమక్షంలో బి అర్ ఎస్.పార్టి నుంచి అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు,మాజి జడ్ పి టి సి పులికల్ హనుమంతు ,వారి అనుచరులు బారీ ఎత్తున 2000 మంది తో అయ్యప్ప స్వామి దేవాలయం నుండి పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి,కాంగ్రేస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వారిని ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ కాంగ్రేస్ పార్టీ కండువాలు వేసి పార్టీ లొనికి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసలు,అలంపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మేన్ బింగిదోడ్డి దోడ్డేప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ శేక్షవలి అచారి, మాజీ సర్పంచ్లు, మాజీ ఉప సర్పంచ్లు, మాజీ వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్స్, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు కార్యకర్తలు అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ డెస్క్ టాప్ లా పంపిణీ




మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కు కంప్యూటర్లు అందజేస్తున్న సిబ్బంది

మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి):అరబిందో ఫార్మా ఫౌండేషన్ (అరబిందో ఫార్మా లిమిటెడ్ యొక్క దాతృత్వ విభాగం, అనుబంధ సంస్థలు) మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలకు 20 లక్షల వ్యయంతో 50 కంప్యూటర్ డెస్క్‌టాప్‌లను పంపిణీ నిమిత్తం శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ఛాంబర్ లోఅరబిందో ఫార్మా లిమిటెడ్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఏవిఎస్ మల్లిఖార్జున్, అరబిందో ఫార్మా లిమిటెడ్ డీజీఎం టి .జనార్ధన్ రెడ్డి లుజిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కి అంద చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ మౌలిక సదుపాయాలతో బలోపేతం చేయడం మహబూబ్ నగర్ జిల్లాలోని నిరుపేద గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా కంప్యూటర్ లను అంద చేయడం పట్ల కలెక్టర్ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ను అభినందించారు.ఈకార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,పరిశ్రమల శాఖ జి.ఏం. యాదయ్య,అరబిందో ఫార్మా పౌండేషన్ అడ్మినిస్ట్రేటర్ పి.కె. ఎన్ .వి.గోవర్ధన్ రావు,సి. ఎం. ఓ సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పత్రికలపై రాజకీయం ప్రదర్శించవద్దు

**అంబేద్కర్ చౌరస్తాలో వివిధ పార్టీలు, సంఘాలు, జర్నలిస్టుల నిరసన**



నారాయణపేట అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) పత్రికలపై రాజకీయ పార్టీల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వారిపై జరుగుతున్న దాడులను ఖండించాలని నారాయణపేటలోని వివిధ పార్టీల నాయకులు, వివిధ పత్రికలు, టీవీ చానాళ్ల జర్నలిస్టులు పాల్గొని శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్ర ప్రదేశ్ లోని సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై అక్కడి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు, ప్లే కార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను భంగం కలిగించే చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. పత్రికారంగాన్ని రాజకీయ కోణంలో చూస్తూ అక్రమ కేసులను పెట్టి భయపెట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు సమస్యలను పత్రిక ద్వారా ప్రజల ముందుకు తీసుకురావడమే నేరమా అని వారు ప్రశ్నించారు. పత్రికలు ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారదులుగా ఉంటూ సంక్షేమం అభివృద్ధి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అటు ప్రభుత్వాలు అధికారుల దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా పత్రికలు పనిచేస్తాయి అన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టులపై ఎడిటర్లపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేసి జర్నలిస్టు సమాజానికి పత్రికా రంగానికి ఏపీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా విక్రయాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

## జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు




(గద్వాల అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి) దీపావళి పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పదలచిన వ్యాపారులు పోలీస్ సర్కిల్ అధికారి, ఫైర్ అధికారి, మున్సిపాలిటీ అధికారుల దగ్గర ధరఖాస్తు చేసుకొని ముందస్తుగా అనుమతి పొందవలసిందిగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు.దీనికి సంబంధించిన ఇతర వివరాలు, మార్గదర్శకాలు కోసం ఫైర్, సర్కిల్ పోలీస్ అధికారిని సంప్రదించవలసిందిగా కోరారు.అలాగే ఎటువంటి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పిన వారి పట్ల ఎక్సప్లేషన్ యాక్ట్ 1884 -,రూల్స్ 1933 (సవరణ 2008) ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.బాణసంచా దుకాణాదారులు తప్పక ఈ క్రింది నిబంధనలు పాటించాలి.

పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును సంబంధిత ఫైర్ మరియు సర్కిల్ పోలీస్ అధికారి కార్యాలయంలో సమర్పించాలి,టపాకాయల దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పవలెను. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికేటు పొందపర్చాలి.ఒక క్లస్టర్ లో 50 షాపులకు మించరాదు.జనరద్దీగల ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయరాదు. జనవాసాలు లేని బహిరంగ ప్రదేశాలలో మాత్రమే టపాకాయల షాపుల ఏర్పాటు చేసుకోవాలి. దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, రెండు ఫైర్‌ఎక్స్ట్రిమిషన్‌లు ఉంచాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలి. టపాసుల దుకాణానికి నిర్ధేశిత రుసుము చెల్లించి. విద్యుత్, ఫైర్ శాఖతో పాటు మున్సిపల్ శాఖల ఎన్ ఓ సి. అనుమతి తప్పనిసరి.ఈ లైసెన్సులు 3 రోజుల కోసం మాత్రమే వర్తిస్తాయి.200 లీటర్ల వాటర్ బ్యారల్. నాలుగు ఇసుక బకెట్లు, నీటి బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి.దుకాణంలో ల్యాంప్‌లు, పెట్రోమ్యాక్స్‌లు పాత కరెంట్ తీగలు ఉంచరాదు. జాయింట్ కేబుల్స్ వాడవద్దు. జనరేటర్ 15 నుంచి 20 మీటర్ల దూరంలో ఉండాలి.దుకాణంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన వారే పనిచేయాలని తెలియజేశారు.

# రేషన్ షాపుల్లో నూకలు పంపిణీ! నాణ్యతలేని సన్న బియ్యంతో



(గద్వాల అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి) :జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల అలంపూరు రెండు నియోజకవర్గాలలోనిరు పేదల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రూపాయికే కిలో బియ్యం పథకం లక్ష్యం పక్కదారి పడుతోంది. రేషన్ షాప్ల ద్వారా పంపిణీ అవుతున్న సన్న బియ్యం నాణ్యతపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన మేలు రకం (ఫైన్ వెరైటీ) బియ్యం ప్రజలకు చేరాల్సిన చోట.. 20 నుంచి 30 శాతం వరకు నూకలే ఉన్న బియ్యం సరఫరా అవుతున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా నూకల బియ్యం సరఫరా అవుతున్నా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్ షాప్ల ద్వారా సరఫరా అవుతున్న సన్న బియ్యంలో నూకలు ఎక్కువగా ఉంటుండటంతో, అన్నం వండితే ముద్దగా మారుతోందని లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. మార్కెట్లో కొనుగోలు చేసే బియ్యంలో నూకలు కనిపించకున్నా, రేషన్ బియ్యంలో నూకల శాతం పెరగడంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారు. రైతు నుంచి కొనిరాష్ట్ర ప్రభుత్వం ఏటా ఖరీఫ్, యాసంగి సీజన్లలో ఐకేపీ, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి ధాన్యం కొంటుంది. ఆ ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లర్లకు ఇస్తుంది. మిల్లర్లు ధాన్యాన్ని మర ఆడించి ముడి బియ్యం అయితే 67 కిలోలు, బాయిల్డ్ రైస్ అయితే 68 కిలోల చొప్పున తిరిగి అందజేయాలి. ఇందుకు ప్రభుత్వం మిల్లర్లకు క్వింటాల్ బాయిల్డ్ రైస్కు రూ.50 చొప్పున, ముడి బియ్యానికి రూ.30 చొప్పున ఛార్జీలు కూడా చెల్లిస్తుంది. పారాబాయిల్డ్ బియ్యమైతే గరిష్టంగా నూకలు 16 శాతం డిస్కులర్ రంగుమారిన 5 శాతం, డ్యామేజ్ 4 శాతంలోపు ఉండాలి. ముడి బియ్యమైతే గరిష్టంగా నూకలు 25 శాతం, డిస్కలర్ 5, డ్యామేజ్ 5 శాతంలోపు ఉండాలి అక్కడ డిమాండ్!లకాగా వానాకాలం ధాన్యాన్ని ఏటా మార్చి 31 లోపు యాసంగి ధాన్యాన్ని సెప్టెంబర్ 31లోపు మరల ఆడించి బియ్యం తిరిగివ్వాలి. కానీ, కొనుగోలు సెంటర్ల ద్వారా సేకరించిన వరి ధాన్యాన్ని ఆయా మిల్లులకు కేటాయిస్తారు. ఇక్కడ పండించిన వరి ధాన్యానికి బహిరంగా మార్కెట్లో డిమాండ్ ఉండటంతో వరి ధాన్యం ఇతర రాష్ట్రాలకు తరలించి మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ఒక్కో మిల్లుల యాజమాన్యం కోట్లలో అక్రమాలకు పాల్పడిన ఆరోపణలు వెలువడిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. మేలు రకమైన వరి ధాన్యం బదులు తక్కువ ధరలో సన్న బియ్యాన్ని కొనుగోలు చేసి మరల ఆడించి ప్రభుత్వానికి అందిస్తున్నారు. జిల్లాలో కొన్నిరైస్ మిల్లులో లబ్దిదారులు, అక్రమార్కుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎఫ్సీఐ గోదాంలకు అందిస్తున్నారన్నా ఆరోపణలు జోగులాంబ గద్వాల జిల్లాలో వినిపిస్తున్నాయి. వీటికి కారణమెవరు? కొందరు మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై నిరుపేదలకు నాణ్యతలేని, నూకల బియ్యం అంటగడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి వాస్తవానికి మిల్లర్లు ఎఫ్సీ ఐ పౌర సరఫరాల శాఖ పంపిన ధాన్యాన్నే మిల్లింగ్ చేసి అలా వచ్చిన బియ్యాన్ని తిరిగి ఇవ్వాలి. కానీ, కొందరు మిల్లర్లు మంచి ధాన్యాన్ని తాము వాడేసుకుంటున్నారు.తాము బయట నేరుగా తక్కువ ధరకు కొన్న నాణ్యతలేని ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖకు పంపుతున్నారు. అందుకే బియ్యంలో నాణ్యత తక్కువగా, నూకలు ఎక్కువగా ఉంటున్నట్టు తెలుస్తోంది.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

(హైదరాబాద్,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): బొల్లారం మున్సిపల్ పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏ డిఈ మాధవరావు తెలిపారు. బొల్లారం పారిశ్రామికవాడలోనీ పలు ప్రాంతాలలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని దీనికి వినియోగదారులు పారిశ్రామికవేత్తలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

# కొడకంచిలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం




జిన్నారం ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మున్సిపల్ పరిధిలోని కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం టిఆర్ఆర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందం బాల బాలికలకు ఈఎన్టి పీడియాట్రిక్ ఆప్తల్మాల్జీ సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు సిరప్లు పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యాల పట్ల శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రేమావతి ఉపాధ్యాయులు మొగిలి మాల వైద్య బృందం సరూప్ కుమార్ నితిన్ రావు సిద్ధిక్ విగ్నేష్ చందు లహరి యాదవ్ నర్సులు సునీత అరుణ స్వప్న క్యాంపు మేనేజర్ రాంబాబు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘునందన్ రావు చేతులమీదుగా పార్టీ కార్యాలయం ప్రారంభం



గుమ్మడిదల ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మున్సిపాలిటీ స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎంపీ రఘునందన్ రావు కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గుమ్మడిదల, జిన్నారం మండలాల బీజేపీ అధ్యక్షులు ఐలయ్య, కొత్త కాపు జగన్ రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీని నాయకులు కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అశోక్ కుమార్ ఉదయ్ కుమార్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రతిరోజు వ్యాయామం చేయాలి

**ఉప జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. వెంకట దాస్**



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి)విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని నాగర్ కర్నూల్ ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం వెంకట దాస్ అన్నారు .శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో ఈ సంవత్సరము ఎన్.సి.సి. చేరిన విద్యార్థులకు పెద్ద ముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు, బ్లడ్ గ్రూప్ కొరకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏం .వెంకట్ దాస్ మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులు ఒక గంట సేపు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని , దీనివలన మంచి శారీరకసామర్థ్యాన్ని సాధించుకోగలుగుతారు. ప్రతిరోజు ఆహారంలో గుడ్డును ఒక భాగంగాచేసుకోవాలని, ఆకుకూరలు,కాయగూరల ఒకాలానుగుణంగా దొరికే పండ్లు తప్పనిసరిగాతీసుకోవాలని ,వ్యక్తిగత శుభ్రత పాటించాలని,ముఖ్యంగా చేతులను సబ్బుతో తప్పనిసరిగాశుభ్రపరుచుకోవాలి. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, ఎంఎల్ హెచ్పి సాయి శ్రీ, ల్యాబ్టెక్నీషియన్ కళ్యాణ్ కృష్ణారావు,ఆంజనేయులు , ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గడ్డపోతారంలో ఎన్ఎస్ఎస్ శిబిరం




గడ్డపోతారం ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మున్సిపాలిటీ గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఆరోగ్యం పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు అభినందనీయమని గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య అన్నారు. నగరంలోని పద్మారావు నగర్ సర్దార్ పటేల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మున్సిపల్ కేంద్రంలో వారం రోజులపాటు నిర్వహించే ఎన్ ఎస్ ఎస్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్కులో పచ్చదనం పరిశుభ్రత అంశాలపై క్యాంపు ద్వారా విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు.

సామాజిక స్పృహతో పాటు సేవాభావం పెంపొందుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత శ్రమదానం కార్యక్రమాలను చేపట్టిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రాం ప్రతినిధి బాబు రాజేశ్వర్ మున్సిపల్ అధికారులు నరసింహారాజు మధుసూదన్ రెడ్డి సిబ్బంది, కళాశాల విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

# పనిచేయని ఏటీఎం సేవలు... ఆందోళనలో ఖాతాదారులు



జిన్నారం ,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మున్సిపల్ కేంద్రంలో ఎస్బిఐ ఎటిఎం సేవలు పనిచేయడం లేదని ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు బ్యాంకు ఖాతాదారులు అవసరాల కోసం ఏటీఎం నుంచి డబ్బులు తీసుకునేందుకు వస్తుంటారు. ఏటీఎంకు వెళ్లి చూస్తే సేవలు నిలిచిపోవడంతో అసహనానికి గురవుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. కాకా జిన్నారం మున్సిపాలిటీలో ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా మున్సిపల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బిసి బందుకు సంపూర్ణ మద్దత్తు

**బిసి రిజర్వేషన్స్ అడ్డుకున్నది అగ్రకుల వివక్షే**
**చీఫ్ జస్టిస్ గవాయ్ మీద దాడి కుల వివక్షే**
**ఐపీస్ అధికారి ఆత్మహత్యకు కులమే కారణం**
**ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు జెట్టి ధర్మరాజు**


నాగర్ కర్నూల్, అక్టోబర్ 17(వుదయం ప్రతినిధి) :దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి సంఘటన వెనుక కులం దాగి ఉందని, కులాన్ని నిర్మూలించడం ద్వారానే దేశంలో వివక్షలు పోతాయని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు జెట్టి ధర్మరాజు అన్నారు. శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ

రాజ్యాంగం లో 50 శాతం రిజర్వేషన్ పరిమితి అంశం ఎక్కడా లేకున్నా, ఒక కేసులో జడ్జిలు ఇచ్చిన తీర్పును పదే, పదే చెబుతూ, ప్రజలను తప్పు తోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలో సుప్రీం కోర్ట్ జడ్జ్ మీద బూటు విసరడం మను ధర్మ శాస్త్రం లో భాగమే అని, అలాగే హర్యానా క్యాడర్ ఐపీస్ అధికారి పూర్ణ కుమార్ ఆత్మహత్య వెనుక కుల అణిచివేత స్పష్టంగా వెల్లడి అయ్యింది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవొ 9 ప్రకారం బిసి లకు స్థానిక సంస్థల్లో
రిజర్వేషన్జి
లను 42% ఇవ్వడం మీద రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించడం కారణం కొందరు మనుధర్మ వాదులే నని ఆయన విమర్శించారు. బిసి లకు 42% రిజర్వేషన్స్ అమలు చేయాలని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే బందుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, బిసి ఉద్యామానికి అండగా ఉంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో పూలే అంబేద్కర్ జాతర కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బండి విజయ్ కుమార్, నాయకులు శేఖర్, రవికాంత్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత పై హర్షం

ధరూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సమీర్ ముజాహీద్

(గద్వాల అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి)



:ధరూర్: స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం సడలించడంపై ధరూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమీర్ ముజాహీద్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ మార్పుకు శ్రీకారం చుట్టడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో చాలామంది ఈ నిబంధన కారణంగా స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కోల్పోయారని, ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో సముచితమైన న్యాయమని ఆయన పేర్కొన్నారు. ?ఈ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు, తదితర పాలకవర్గాలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏది ఏమైనా, ఈ చట్ట సవరణ స్థానిక సంస్థల రాజకీయాలపై ప్రభావం చూపుతుందనీ ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# బీసీ జేఏసీ బంద్ కు సంపూర్ణ మద్దతు




నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) నేడు తలపెట్టి పోయే బీసీ జేఏసీ బందుకు సిపిఐ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి అన్నారు శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలో లక్ష్మణాచారి భవన్లో సిపిఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి, హాజరయ్యారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలంటూ శనివారం నాడు జరిగే రాష్ట్ర బందు పిలుపుమేరకు గ్రామీణ ప్రాంతాలు ఉండే బీసీ సంఘాల సైతం బందుకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ కూడా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆయన వివరించారు. గ్రామాల్లో ఉండే వ్యాపారస్తులు అఖిలపక్షం సంఘాల నాయకులు తదితరులు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొన్ని పార్టీలు బీసీలకు మోసగిస్తున్నారని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్న బిసి ఎమ్మెల్యేలు ఎంపీలు అధికారంలో ఉండి ఢిల్లీ సైతం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలన్నారు. ఈ బీసీ రిజర్వేషన్లు కేంద్ర మంత్రుల సంపూర్ణ మద్దతు ప్రకటించాలన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ సౌకర్యం కల్పించకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజా సంఘాల మద్దతు ముందుకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ అనుబంధ సంఘం తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి, జిల్లా అధ్యక్షులు కపిలవాయి గోపి చారి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, మారేడు శివశంకర్ , సిపిఐ నాగర్కర్నూల్ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, బీసీ హక్కుల సాధన జిల్లా నాయకులు పూసల సుధాకర్, సిపిఐ నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, వాడాల బాల పీరు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని గృహప్రవేశం చేయండి

## జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయ



మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకొని గృహ ప్రవేశం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. శుక్రవారం కోయిలకొండ మండలం అనంతపూర్ గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కలెక్టర్ పరిశీలించారు .గ్రామంలో 10 ఇండ్లు మంజూరు అయినట్లు, వాటి నిర్మాణ ప్రగతి గురించి తెలుసుకున్నారు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు భీమమ్మతో మాట్లాడారు .ఎన్ని చదరపు అడుగులలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు.ఎంత ఖర్చు అవుతుంది తదితర వివరాలు తెలుసుకున్నారు .ఇల్లు కంప్లీట్ అయిన శివరంజని లబ్ధిదారు ఇంటిని పరిశీలించారు. ఎక్కువ ఖర్చు చేయకుండా ప్రభుత్వ డిజైన్ ప్రకారం మంచి గా ఇల్లు నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలను అందజేసి ఇండ్ల నిర్మాణానికి సహకారాన్ని అందిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు . ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్దిదారులను అవగాహన కల్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం కోయిలకొండ కోటను జిల్లా కలెక్టర్ సందర్శించారు. హాకోట ను పరిశీలించి నిర్మాణం గురించి తెలుసుకున్నారు.కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,ఎం.పి.డి. ఓ ధనుంజయ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తులను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలి

## అదనపు కలెక్టర్ పి. అమరేందర్

**విజయవంతంగా ముగిసిన క్యాంపస్ ఎకో బజార్ కార్యక్రమం**



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ రాష్ట్ర శాఖ మరియు కళాశాల ఎకో క్లబ్ సమన్వయంతో నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఎకో బజార్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వి. అమరేందర్ ప్రారంభించగా, కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్ స్వాగతం పలికారు. కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, మున్సిపల్ కమీషనర్ నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 50 పర్యావరణ స్నేహపూర్వక స్టాల్స్ ఏర్పాటు చేయబడ్డాయి. వీటిలో స్వదేశీ గ్రీన్ దీపావళి ఉత్పత్తులు, జూట్ బ్యాగులు, మట్టి పాత్రలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, బయోడిగ్రేడబుల్ వస్తువులు మరియు సహజ వంటకాలు ప్రదర్శనకు ఉంచబడ్డాయి. కేజీబీవీలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ఉత్పత్తిదారులు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. "సేంద్రీయ, ఆరోగ్యకరమైన, సుస్థిర జీవనశైలికి కలసి రండి" అనే సందేశంతో విద్యార్థులు ఆకర్షణీయమైన ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ అమరేందర్ మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తులను వాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో పర్యావరణ అవగాహన పెంపొందించడంలో కీలకమని అన్నారు. "పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం. పర్యావరణానికి హాని చేసే ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించి, సుస్థిర జీవనశైలిని అలవరచుకోవడం సమాజ అభివృద్ధికి అవసరం," అని పేర్కొన్నారు. డీఈవో రమేష్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, బాధ్యతాభావాన్ని పెంచుతాయని, కేజీబీవీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. ఆయన విద్యార్థుల స్టాల్స్ సందర్శించి వారి ప్రతిభను అభినందించారు. నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పచ్చదనం పెంచడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచడంలో ఎంతో దోహదపడతాయి," అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ అధికారి శోభారాణి, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు, కళాశాల ప్రోగ్రామ్ ఆర్గనైజర్ ఉమాదేవి, రామకృష్ణ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఆర్ పై 108 అవగాహన కార్యక్రమం





నారాయణపేట టౌన్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) : సిపిఆర్ పై 108 అవగాహన కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుండి 17 వరకు సీపీఆర్ అవగాహన వారంగా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం %-% ప్రతి వ్యక్తికి గుండె ఆగిపోయిన సమయంలో తక్షణ స్పందన ఎలా ఇవ్వాలో తెలియజేయడం, ప్రాణరక్షణ శృంఖలాన్ని ప్రారంభించేందుకు అవసరమైన దశలను నేర్పడం లాంటి కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించారు సీపీఆర్ అనేది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే కీలక ప్రక్రియ అని ప్రజలకు వివరించారు. గుండె ఆగిపోవడం లేదా శ్వాస ఆడకపోవడం వంటి సందర్భాల్లో సమయానికి సీపీఆర్ అందించడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడుకోవచ్చు అని 108 సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా 108 సూపర్వైజర్ రాఘవేంద్ర, అంబులెన్స్ సిబ్బంది, టెక్నీషియన్స్ అబ్దుల్ అసాద్, భీమ్ రెడ్డి,వెంకటేష్,శ్రీనివాస్, భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి గుముడాల వెంకోబా, కించి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల బంద్ కు సంపూర్ణ మద్దతు

**– బిజెపి జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజుల నాగేందర్ గౌడ్**

నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి) :రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్ర బీసీల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న తెలంగాణ బందుకు బిజెపి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజుల నాగేందర్ గౌడ్ శుక్రవారం నాడు ఒక ప్రకటన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బీసీలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని న్యాయస్థానాలలో గట్టిగా వాదనలు వినిపించకుండా తూతూ మంత్రంగా కొనసాగిస్తూ బీసీలను ద్రోహం చేస్తున్నదని ఆరోపించారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న బీసీలకు ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని బీసీల సమాజానికి ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలలో భాగంగా రాష్ట్రంలోని బీసీ సంఘాలు ఈనెల 18న చేపట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ కు బిజెపి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. శనివారం నిర్వహించే బందులో జిల్లాలోని బూత్ కమిటీ నుండి జిల్లా కమిటీ బాధ్యులంతా కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి జిల్లా విద్యాశాఖ అధికారి


**రమేష్ కుమార్**



నాగర్ కర్నూల్ అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి):బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం తోపాటు విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ లతో కలిసి జిల్లా కేంద్రంలోని బెస్ట్ అవైలబుల్ పథకంలో కొనసాగుతున్న బ్రిలియంట్ హైస్కూల్ ను డీఈఓ రమేష్ కుమార్ తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థుల అభ్యున్నతి పై కొనసాగిస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా చదువుకుంటున్న విద్యార్థుల వివరాలను డీఈఓ రమేష్ కుమార్ పరిశీలించారు. పథకం కింద లబ్ధి పొందుతు చదువుతున్న విద్యార్థులతో డిఈఓ మాట్లాడి వివరాలను, యాజమాన్యాలు ఏమైనా ఒత్తిడి గురి చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకుఇ ఒత్తిడి గురి చేస్తే పాఠశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని డిఇఓ హెచ్చరించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎస్సీ ఎస్టీ గిరిజన విద్యార్థులు పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించిన వారి పై ఒత్తిడి చేసిన పాఠశాల పై కఠిన చర్యలు ఉంటాయని ఆయన సూచించారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు మెరుగైన నాణ్యమైన విద్యను అందించేందుకు యాజమాన్యాలు కృషి చేయాలని లేదా విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడితే పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుందని డిఇఓ రమేష్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి ఇరువురు ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించేందుకు సుముఖంగానే ఉందని త్వరలోనే బకాయిలు వచ్చేలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిఈఓ దర్గా ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు శాతాన్ని డిఈవో పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు జారీ చేశారు.

# శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న

**పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి**
**ఏఐసీసీ.కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమర్**




(అలంపూర్ అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని పాండిచేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి,ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మ వారిని స్వామి వారిని దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ చైర్ పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరిత తిరుపతయ్య, ఎమ్మెల్సీ అన్సర్ అలీ ఖాన్, జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్ తిరుమలేష్,
గద్వాల నియోజక టెలికాం నెంబర్ ఇస్మాయిల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అబ్జర్వర్ ఇంచార్జి సంధ్య రెడ్డి, అడ్డాకుల రాము, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తిరుమల్, రాజీవ్ రెడ్డి, మద్దిలేటి, దేవాలయ ధర్మకర్త శేఖర్ రెడ్డి, కార్యనిర్వహణ అధికారి దీప్తి, మండల రెవెన్యూ అధికారీ మంజుల, ఆయా మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# ‘ఓఆర్ఎస్’ పదాన్ని తొలగించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రత కమిషనర్లు, కేంద్ర లైసెన్సింగ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు (ఎఫ్‌బీఓలు) తమ ఆహార ఉత్పత్తులపై ‘ఓఆర్ఎస్’ అనే పదాన్ని తొలగించాలని స్పష్టం చేసింది. ఈ పదాన్ని ఏ రకంగానూ ఉపయోగించవద్దని, ఉత్పత్తి పేరులో ట్రేడ్‌మార్క్‌గానూ వాడకూడదని ఆదేశాల్లో పేర్కొంది. అలా ఓఆర్ఎస్ పదాన్ని వాడటం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2006 నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని వెల్లడించింది. సంబంధిత అధికారులందరూ ఈ చట్టం సూచించిన లేబులింగ్, ప్రకటనల అవసరాలకు, దాని కింద రూపొందించిన నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూసుకోవాలని కోరింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ.. ఆహార ఉత్పత్తులైన పండ్ల రసాలు, నాన్–కార్బొనేటెడ్, రెడీ–టూ–డ్రింక్ బేవరేజెస్‌లకు అనుబంధంగా గానీ, జతగాగానీ లేబుళ్లపై ఉపయోగించేందుకు అనుమతిచ్చింది. అయితే, డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు చేసిన ఓఆర్ఎస్ ఫార్ములా కాదు అనే హెచ్చరిక ఉండాలని సూచించింది. అయితే, ఎఫ్ఎస్ఎస్ఏఐ మరింత సమగ్రంగా సమీక్షించిన తర్వాత, పండ్ల రసాలు, నాన్–కార్బొ నేటెడ్,రెడీ–టూ–డ్రింక్ బేవరేజెస్ వంటి ఆహార ఉత్పత్తుల కోసం ట్రేడ్‌మార్క్ చేసిన పేరు లో లేదా మరేదైనా ‘ఓఆర్ఎస్’ అనే పదాన్ని ఏ విధంగానైనా ఉపయోగిస్తే ఆహార భద్రత, ప్రమాణాల చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించడమేనని తాజాగా తెలిపింది. ఇలాంటి పద్ధతులు తప్పుడు, మోసపూరిత, అస్పష్ట మైనవని, నకిలీ పేర్లు లేదా లేబుల్ ప్రకటనలను ఉపయోగించి వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నట్టు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరించింది. అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు తక్షణమే నిబంధనలను పాటించేలా చూసుకోవాలని, ఉల్లంఘనలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.




## బ్యాటరీ స్టోరేజ్ మార్కెట్లోకి ఓలా

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్, దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎనర్జీ స్టోరేజ్ మార్కెట్లోకి అడుగు పెట్టింది. ఈ మేరకు గురువారం అధికారిక ప్రకటనలో ‘ఓలా శక్తి ‘ బ్రాండ్ పేరుతో బ్యాటరీలను విడుదల చేసింది. ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం ప్రపంచ స్థాయి బ్యాటరీ, సెల్ టెక్నాలజీని రూపొందించాం. ఓలా శక్తి ద్వారా ఇళ్లలో క్లీన్ ఎనర్జీని నిల్వ చేసుకునేందుకు, ఉపయోగించేందుకు వీలవుతుంది. ఇది కంపెనీకి సహజమైన ముందడుగు లాంటిది. ఓలాకు ఉన్న 4,680 సెల్ టెక్నాలజీ, గిగా ఫ్యాక్టరీ ఉత్పత్తి సామర్థ్యం, దేశవ్యాప్తంగా ఓలా నెట్‌వర్క్ ద్వారా అదనపు పెట్టుబడి లేకుండా బ్యాటరీ స్టోరేజ్ మార్కెట్లో రాణించగలం. ప్రస్తుతం రూ. లక్ష కోట్ల మార్కెట్‌గా ఉన్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్), 2030 నాటికి రూ. 3 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. ఓలా ఎలక్ట్రిక్ వార్షిక బ్యాటరీ స్టోరేజ్ వినియోగం రాబోయే కొన్నేళ్లలో 5 గిగావాట్ అవర్‌కు పెరుగుతుందని భావిస్తున్నట్టు కంపెనీ తన ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది. భారత్ ఎనర్జీ కొరతను ఎదుర్కోవడం జరగదు, ఎనర్జీ స్టోరేజ్ అవకాశాలను అందిపుచ్చుకుంటుందని ఓలా ఎలక్ట్రిక్ ఛైర్మన్ భవిష్ అగర్వాల్ అన్నారు. ‘ఓలా శక్తి’ పూర్తిగా స్వదేశీ రూపకల్పన. స్థానికంగా ఇంజనీరింగ్, తయారీ ద్వారా తెచ్చిన మొట్టమొదటి బీఈఎస్ఎస్ అని ఆయన పేర్కొన్నారు. ఓలా శక్తి 1.5 కిలోవాట్ అవర్, 3 కిలోవాట్ అవర్, 5.2 కిలోవాట్ అవర్, 9.1 కిలోవాట్ అవర్ సామర్థ్యాలతో లభిస్తుంది. మొదటి 10,000 యూనిట్లకు ప్రారంభ ధరలు వర్తిస్తాయని కంపెనీ తెలిపింది. గురువారం నుంచే రూ. 999 చెల్లించి బుకింగ్ చేసుకునే సదుపాయం ప్రారంభించింది. వచ్చే ఏడాది సంక్రాంతి నుంచి డెలివరీలు ఇవ్వనున్నట్టు కంపెనీ పేర్కొంది.



## తమిళనాడుకు తరలిన ఫాక్స్‌కాన్!

ఒకప్పుడు భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఏ విదేశీ సంస్థ ముందుకొచ్చినా తొలుత తెలంగాణను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే.. ఇతర రాష్ట్రాలతో చర్చలు జరపడం ఆనవాయితీ అంటే అతిశయోక్తి కాదు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పరిస్థితి మారింది. నాడు పోటీపడి జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించిన రాష్ట్రం.. నేడు కనీసం ఉన్న కంపెనీల విస్తరణను కూడా నిలుపుకోలేని స్థితికి వెళ్లిపోతున్నది. ఇందుకు ఫాక్స్‌కాన్ సంస్థే తాజా ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి తరలివచ్చిన ఈ తైవాన్ కంపెనీ.. ఇప్పుడు విస్తరణ కోసం తమిళనాడును ఎంచుకున్నది. రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అయితే తెలంగాణలోనే అదనపు పెట్టుబడులు పెట్టేలా కంపెనీని ఒప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడం వల్లే ఇలా జరిగిందని పరిశ్రమ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడుల గమ్యస్థానంగా మారగా.. ఇప్పుడు ప్రముఖ కంపెనీలు ఇతర రాష్ట్రాలవైపు మళ్లుతున్నాయని చర్చ జరుగుతున్నది. ఇప్పటికే కేన్స్ టెక్నాలజీస్ వంటి పలు దిగ్గజ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన సంగతి తెలిసిందే. తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ (హాన్ హై టెక్నాలజీ (గ్రూపు) ప్రఖ్యాత యాపిల్ ఐఫోన్ల తయారీని చేపడుతున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్చి 2023లో తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు స్వయంగా వచ్చి, అప్పటి సీఎం కేసీఆర్‌తో సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వాసంతో సుమారు రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు కంపెనీ ముందుకొచ్చిం ది. ఒప్పందం ప్రకారం అప్పుడే ప్రభుత్వం ఫాక్స్‌కాన్‌కు రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో 186.7 ఎకరాలు కేటాయించింది.




## హైదరాబాద్‌లో రూ.1.35 లక్షలు దాటిన పసిడి ధర

దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.35 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,35,250కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,81,000కి చేరింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్ – చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. మరోవైపు, ధనత్రయోదశి నాడు ప్రజలు బంగారం, వెండి, విలువైన ఇతర పాత్రలను కొనుగోలు చేస్తారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆ సెంటిమెంట్ కూడా బంగారం ధర పెరుగుదలకు కారణమవుతోంది. దాంతోపాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చేఏడాది నాటికి బంగారంధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా.



# ఆట

## ఆస్ట్రేలియాతో తలపడనున్న భారత్‌కి కోహ్లీ సూచనలు



టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ప్రస్తుతం అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియాతో కీలకమైన వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు ఆయన చేసిన ఈ ట్వీట్, జట్టు సన్నద్ధత, ఆయన మానసిక దృక్పథంపై బలమైన సంకేతాలు పంపుతోంది. ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ఆడేందుకు భారత జట్టు పెర్త్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలో, ఈ ఉదయం విరాట్ కోహ్లీ తన ‘ఎక్స్’ ఖాతాలో ఒక స్ఫూర్తిదాయక సందేశాన్ని పంచు కున్నాడు. “మీరు వదులుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు మాత్రమే నిజంగా విఫలమవుతారు” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నాడు. ఈ పోస్ట్ పెట్టిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది కేవలం ఒక సాధారణ కొటేషన్ కాదని, కఠినమైన ఆస్ట్రేలియా పర్యటనకు తాను మానసికంగా ఎంత బలంగా ఉన్నాడో చెప్పేందుకు కోహ్లీ ఈ మార్గాన్ని ఎంచుకున్నాడని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

## బంగ్లాపై భారీ విజయం.. సెమీస్‌కు దూసుకెళ్లిన ఆస్ట్రేలియా

మహిళల వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు ఎదురులేకుండా పోయింది. టోర్నీలో వరుసగా నాలుగో విజయం నమోదు చేయడమే కాకుండా సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌కు చేరుకున్న తొలి జట్టు ఆసిసే. విశాఖపట్నంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో భారీ విజయం అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాను ఆసిస్ బౌలర్లు స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. బంగ్లా అతికష్టం మీద నిర్ణీత 50 ఓవర్లలో 198/9 స్కోరు చేసింది. శోభన(66 నాటౌట్) హాఫ్ సెంచరీతో పోరాడగా.. రుబియా హైదర్(44) పర్వాలేదనిపించింది. మిగతా బ్యాటర్లు కనీస పోరాటం చేయలేక చేతులెత్తేశారు. ఇక, 199 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా అలవోకగా ఛేదించింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించడం గమనార్హం. ఓపెనర్లే జట్టుకు విజయాన్ని కట్టబెట్టారు. అలీసా హీలీ మరోసారి సెంచరీ బాదింది. 77 బంతుల్లో 113 పరుగులతో అజేయంగా నిలిచింది. మరో ఓపెనర్ లిచ్‌ఫీల్డ్(84 నాటౌట్) కూడా సత్తాచాటింది. దీంతో 24.5 ఓవర్లలో 202 రన్స్ చేసి విజయతీరాలకే చేరింది. మహిళల వన్డే వరల్డ్ కప్ చరిత్రలో 10 వికెట్ల తేడాతో గెలవడం ఆసిస్‌కు ఇది 8వ సారి. ఇతర ఏ జట్టు కూడా మూడుసార్ల కంటే ఎక్కువసార్లు 10 వికెట్ల తేడాతో గెలవలేదు.



## వరల్డ్ నం.2కు షాకిచ్చిన లక్ష్యసేన్



డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ అదరగొట్టాడు. రెండో రౌండ్‌లో వరల్డ్ నం.2కు షాకిచ్చాడు. ఆ విజయంతో క్వార్టర్ ఫైనల్స్‌కు కూడా దూసుకెళ్లాడు. జరిగిన మ్యాచ్‌లో సేన్ 21–13, 21–14 తేడాతో తన కంటే మెరుగైన ర్యాంక్ కలిగిన డెన్మార్క్ ప్లేయర్ ఆంటోన్సెన్‌ను చిత్తు చేశాడు. గతేడాది ఆంటోన్సెన్ చేతిలో సేన్ రెండు సార్లు ఓడిపోయాడు. కానీ, ఈ సారి వరల్డ్ నం.2 ప్లేయర్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. 53 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సేన్‌కు ఆంటోన్సెన్ పోటీ ఇవ్వలేకపోయాడు. రెండో గేములో ఒక దశలో 13–12తో ఒక్క పాయింట్ లీడ్ సాధించినప్పటికీ ఆ వెంటనే సేన్ బలంగా పుంజుకున్నాడు. వరుసగా 7 పాయింట్లు నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మరోవైపు, పురుషుల డబుల్స్ ప్లేయర్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.రెండో రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన లీ జే హుయ్–యాంగ్ పో హ్సువాన్ జోడీపై 21–19, 21–17 తేడాతో భారత జంట గెలుపొందింది. ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదరవడంతో సాత్విక్ జోడీ చెమటోడ్చాల్సి వచ్చింది. అయినప్పటికీ ఎలాంటి తప్పిదాలు చేయకుండా వరుస గేముల్లోనే మ్యాచ్‌ను ముగించింది.

## వరల్డ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ అదిరే ప్రదర్శన..

గువహతి వేదికగా జరుగుతున్న వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ కుర్రాడు జ్ఞానదత్తు అదరగొడుతున్నాడు. బాయ్స్ సింగిల్స్ విభాగంలో వరుస విజయాలతో జోరు మీద ఉన్నాడు. ఈ క్రమంలోనే క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. జరిగిన ప్రీక్వార్టర్స్‌లో తన కంటే మెరుగైన ర్యాంక్ కలిగిన ప్లేయర్‌ను చిత్తు చేశాడు. అమెరికా షట్లర్ గార్రెట్ టాన్‌పై 15–21, 15–13 తేడాతో గెలుపొందాడు. ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ జ్ఞానదత్తు ఎక్కడా పట్టుదల కోల్పోలేదు. దీంతో 30 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ ప్రత్యర్థిని మట్టికరిపించాడు. టోర్నీలో బాయ్స్ సింగిల్స్‌లో భారత్ తరపున మిగిలిన ఏకైక షట్లర్ జ్ఞానదత్తే. జ్ఞానదత్తుతోపాటు ఇతర భారత యువ షట్లర్లు కూడా సత్తాచాటుతున్నారు. గర్ల్స్ సింగిల్స్‌లో తన్వి శర్మ, ఉన్నతి హుడా కూడా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో తన్వి 15–8, 15–5 చైనాకు చెందిన సున్ లి యువాన్‌పై ఏకపక్ష విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఉన్నతి 15–10, 15–7 తేడాతో మలేసియా క్రీడాకారిణి కరీన్ టీని ఓడించింది. పురుషుల డబుల్స్‌లో భార్గవ్ రామ్–విశ్వ తేజ్ జోడీ 15–13, 9–15, 13–15 తేడాతో చైనీస్ తైపీ జంట యి హ్సుయాన్ చెన్–చున్ యెన్ చుపై పోరాడి గెలిచి ముందంజ వేసింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో భవ్య–విశాఖ టొప్పొ ఏకంగా 3వ సీడ్‌కే షాకిచ్చింది. 40 నిమిషాలపాటు సాగిన ప్రీక్వార్టర్స్‌లో భారత ద్వయం 15–21 11–15, 12–15 తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన థిబాల్ట్ గార్డన్–అగాథే క్యూవాస్ జంటపై విజయం సాధించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.



## ‘ప్లేయర్ ఆఫ్ ద మంత్’గా అభిషేక్ శర్మ

టీమిండియా యువ సంచలనం, డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. సెప్టెంబర్ నెలకు గానూ ‘ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్’ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఇటీవల ముగిసిన ఆసియా కప్ 2025 టోర్నమెంట్లో అతడు కనబరిచిన అద్భుతమైన ప్రదర్శనకు ఈ పురస్కారం దక్కింది. ఈ రేసులో అభిషేక్ తో పాటు అతని సహచరుడు కుల్దీప్ యాదవ్, జింబాబ్వే ఆటగాడు బ్రియాన్ బెన్నెట్ పోటీపడ్డారు.ఆసియా కప్‌లో అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ తో విధ్వంసం సృష్టించాడు. కేవలం 7 మ్యాచ్‌లలోనే ఏకంగా 200 స్ట్రైక్ రేట్‌తో 314 పరుగులు చేసి టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ తో సహా పలు కీలక సమయాల్లో అద్భుతంగా రాణించి భారత్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు.ఈ అవార్డు గెలుచుకోవడంపై అభిషేక్ శర్మ సంతోషం వ్యక్తం చేశాడు. “ఈ ఐసీసీ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. జట్టు విజయాల్లో పాలుపంచుకున్నందుకు ఈ గుర్తింపు రావడం గర్వంగా ఉంది. కఠిన పరిస్థితుల నుంచి కూడా విజయాలు సాధించగల సత్తా ఉన్న జట్టులో నేను భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నా” అని ఐసీసీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాడు. తనకు స్వేచ్ఛగా ఆడే అవకాశం కల్పించిన టీమ్ మేనేజ్‌మెంట్‌కు, తనకు మద్దతుగా నిలిచిన సహచరులకు అతడు ధన్యవాదాలు తెలిపాడు.ప్రస్తుతం అభిషేక్ శర్మ ఐసీసీ పురుషుల టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అంతేకాకుండా 931 రేటింగ్ పాయింట్లతో కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్ సాధించి, డేవిడ్ మలన్ (919) రికార్డును కూడా బద్దలు కొట్టాడు. కాగా, ఈ నెల 29 నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌లో అభిషేక్ బరిలోకి దిగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా ఇదే ఫామ్ కొనసాగించి జట్టులో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలని భావిస్తున్నాడు.



# చక్కని ఆరోగ్యం

## 40 ఏళ్లు తర్వాత శరీరానికి కావలసిన పోషకాలు

40 ఏళ్ల వయసు దాటిన తర్వాత శరీరంలోని మెటబాలిజం నెమ్మదిస్తుంది, అందువల్ల క్యాలరీలు తక్కువగా ఖర్చవుతాయి. ఫలితంగా బరువు పెరగడం సాధారణం. ఈ దశలో హై బీపీ, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అయితే సరైన ఆహారపు అలవాట్లు పాటిస్తే, ఈ వ్యాధులను నియంత్రించి ఆరోగ్యంగా జీవించ వచ్చు. 1. చేపలు, కోడిగుడ్లు: చేపల్లో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ ఆసిడ్స్ గుండెకు మేలు చేస్తాయి. ఇవి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా నిరోధి స్తాయి. కోడిగుడ్లు ప్రోటీన్ మరియు క్యాల్షియం సమృద్ధి గా అందిస్తాయి. ఇవి ఎముకలు, కండరాలు దృఢంగా ఉంచి, వయసు పెరిగినా శరీరాన్ని చురుకుగా ఉంచుతాయి. 2. అవకాడో, బెర్రీలు:అవకాడోలో ఉండే హెల్తీ ఫ్యాట్స్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్త పోటును నియంత్రించడంలో సహాయపడతాయి.స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్‌బెర్రీ వంటి బెర్రీల్లో ఫైబర్ మరియు యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి బరువును నియంత్రించి, క్యాన్సర్ కణాల వృద్ధిని అడ్డుకుంటాయి.రోజూ బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి గింజలను తీసుకోవడం కూడా శరీరానికి అవసరం. ఇవి ప్రోటీన్, మంచి కొవ్వులు అందించి గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. 3. బీట్‌రూట్: బీట్‌రూట్‌లో ఉన్న పోటాషియం మరియు ఇతర పోష కాలు రక్తపోటును నియంత్రించి, రక్త ప్రవాహాన్ని మెరుగు పరుస్తాయి. ఇది శరీ రానికి శక్తిని అందించి యాక్టివ్‌గా ఉంచు తుంది. అలాగే గుండె ఆరోగ్యాన్ని రక్షించడం లో కీలక పాత్ర పోషి స్తుంది. సారాంశం: 40 ఏళ్లు దాటిన తర్వాత చేపలు, కోడిగుడ్లు, అవ కాడో, బెర్రీలు, బీట్‌రూట్ మరియు ఆరోగ్యకరమైన గింజలు వంటి ఆహారాలను ప్రతిరోజూ డైట్‌లో చేర్చుకోవాలి.ఇవి శరీరాన్ని దృఢంగా ఉంచి, వృద్ధాప్యంలో వచ్చే మధుమేహం, గుండె వ్యాధులు, బీపీ వంటి సమస్యల నుండి రక్షణ కల్పిస్తాయి.



## పొట్ట ఉబ్బరాన్ని తగ్గించే ఫుడ్స్


గ్యాస్, మలబద్ధకం. ఈ రెండు సమస్యలు చాలా మందిని ఇబ్బం ది పెడుతున్నాయి. నిద్ర లేచిన దగ్గరనుంచి మళ్లీ పడు కునేంత వరకూ పొట్టలో అసౌకర్యంగా అనిపి స్తూనే ఉంటుంది. ఏం తిన్నా సరే సరిగ్గా జీర్ణం కాదు. విపరీతంగా పొట్ట ఉబ్బిపోయినట్టుగా అవు తుంది. ఈ సమస్య నుంచి బయటపడడానికి చాలా మంది మందులు వాడుతుంటారు. ఇవి వాడక తప్పదు. అలా అని పూర్తిగా వాటిపైనే ఆధారపడితే ఎప్పుడో అప్పుడు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అందుకే సహజంగానే ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవాలి. ఇందుకోసం ముందుగా చేయాల్సిన పని ఏంటంటే..ఆహారంలో మార్పు లు చేసుకోవడం. ఇందులో భాగంగానే కొన్ని పొట్ట ఉబ్బరం తగ్గడానికి కొన్ని రకాల ఫుడ్స్ తీసుకోవాలని చెబుతున్నారు డాక్టర్ సౌరభ్ సేథి. ఈ ఫుడ్స్ తీసుకోవడం వల్ల చాలా త్వరగా ఈ సమస్య నుంచి రిలీఫ్ వస్తుందని వివరిం చారు. కివీ: పొట్ట ఉబ్బరాన్ని తగ్గించడంలో చాలా బాగా పని చేసే ఫుడ్స్ లో ముందుగా చెప్పు కోవాల్సింది కివీ గురించి. కివి పండ్లను ఒకప్పుడు చాలా తక్కు వగా తినే వారు. కానీ రానురాను చాలా మందికి ఆరోగ్యంపైన అవగాహన పెరుగుతోంది. కివీ పండ్లలో ఉండే పోషకాల విలువల గురించి తెలిశాక ఎక్కువ మంది ఇప్పుడు వీటిని తినేందుకు ఆసక్తి చూపిస్తున్నా రు. కివీ పండ్లు రోగనిరోధక శక్తిని పెంచ డంలో చాలా తోడ్పుతుంది. అంతే కాదు. గుండె ఆరో గ్యాన్ని కాపాడ డంలోనూ సహకరిస్తుంది. కివిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. రెగ్యులర్‌గా తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది.



ఇక పొట్ట ఉబ్బరాన్ని తగ్గించడంలోనూ ఇది సహకరిస్తుంది. అందుకు ఓ ముఖ్యమైన కారణం ఉంది. అదేంటంటే.. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుది. ఇది జీర్ణ ప్రక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. ఇదే సమయంలో మలబద్ధకాన్ని కూడా పోగొడుతుంది. అందుకే రోజువారి డైట్ లో తప్పనిసరిగా కివీ పండ్లు ఉండేలా చూసుకోవడం మంచిది. బొప్పాయి: కివీ తరవాత ఆ స్థాయిలో పోషకాలు అందిస్తుంది బొప్పాయి. బొప్పాయిలో విటమిన్ ఎ ఎక్కువ గా ఉంటుంది. కంటి ఆరోగ్యానికి ఇది చాలా మంచిది. పైగా ఇందులో వాటర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఫలితంగా కాస్త తినగానే కడుపు నిండిపోయినట్టుగా అవు తుంది. ఈ కారణంగానే అనారోగ్యకరమైన ఆకలి తగ్గి పోతుంది. బరువు తగ్గాలనుకునే వారు రెగ్యులర్‌గా బొప్పాయి తింటే చాలా మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే క్యాన్సర్ కణాలు వృద్ధి చెంద కుండా ఇవి అడ్డుకుంటాయి. బొప్పాయిలో ఉండే ఎంజైమ్స్ జీర్ణక్రియను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా పొట్టలో ఉబ్బరం, మలబద్ధకాన్ని తగ్గించడంలో తోడ్పడతాయి. ఇందుకు ముఖ్య కారణం ఏంటంటే..కివీలాగానే బొప్పాయి లోనూ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫలితంగా జీర్ణ సమ స్యలు తగ్గిపోతాయి. పైనాపిల్: పైనాపిల్ కూడా ఆరోగ్యాన్ని అందించడంలో ముందుంటుంది. ఇందులోనూ విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా రెగ్యులర్‌గా తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇదే సమయంలో పైనాపిల్‌లో మాంగనీస్ లాంటి మినరల్స్ ఉంటాయి. అన్నింటి కన్నా ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ ఎక్కువగా ఉంటే చాలా త్వరగా జీర్ణం అవుతుంది. అంతే కాదు. బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుం ది. ఇది జీర్ణ క్రియకు సహాయపడుతుంది. కండరాలు బలంగా మారడానికి పైనాపిల్ ఎంతగానో ఉపయోగపడు తుంది. పైనాపిల్ తో పాటు కీరదోసకాయలు కూడా చాలా బాగా ఉపయోగపడతాయి. చియా సీడ్స్: చియా సీడ్స్ ఉపయోగాలు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ రోజు ల్లో చాలా మంది వీటిని విరివిగా వాడుతున్నారు. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. నీటిలో నానబెట్టడం వల్ల ఇవి జెల్‌గా మారతాయి. వీటిని తీసుకోవడం వల్ల జీర్ణ శక్తి మెరుగవుతుంది. ముఖ్యంగా పేగులలో కదలికలు వచ్చి మలవిసర్జన సాఫీగా జరుగుతుం ది. చియా సీడ్స్ ఇంతగా ఉపయోగపడ డానికి కారణం ఏంటంటే..ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని విడుదల చేయడంలో తోడ్పడు తుంది. అయితే చియా సీడ్స్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వీటిలో ఫైబర్ ఉంది కదా అని ఎక్కువ మొత్తంలో తీసుకుంటే పొట్ట ఉబ్బరం తగ్గక పోగా పెరుగుతుంది.

## జీవనశైలితో మెరుగైన ఆరోగ్యం!

శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జీవక్రియ (మెటబాలిజం) కీలక పాత్ర పోషిస్తుంది. ఆధునిక జీవనశైలిలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు ఇది. జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వైద్య నిపుణులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేస్తున్నారు. ఈ పద్ధతులు మీ శరీరాన్ని తీవ్ర ఒత్తిడికి గురిచేయకుండా, సురక్షితమైన రీతిలో మీ జీవనశైలిని మార్చుకోవడానికి దోహద పడతాయి. ముఖ్యంగా, మితిమీరిన ఆహార నియంత్రణ పద్ధతులకు దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్యకరమైన జీవక్రియకు సరైన పోషకాహారం కీలకం. నాణ్యమైన ప్రోటీన్‌ను తగినంతగా ఆహారంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం. ఇది కండరాల నిర్మాణానికి సహాయపడటంతో పాటు, జీవక్రియ రేటును స్థిరంగా ఉంచుతుంది. ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వుల సమతు ల్యత ఉండే ఆహారాన్ని తీసు కోవడం ఉత్తమం. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు సమృద్ధిగా ఉండే ఆహార ప్రణాళిక మీ శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందిస్తుంది. శారీరక శ్రమ జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. వైద్యుల సూచనల ప్రకారం, రెగ్యులర్ వ్యాయామం, ముఖ్యంగా స్ట్రెంగ్త్ ట్రైనింగ్ (బరువులు ఎత్తడం లేదా రెసిస్టెన్స్ బ్యాండ్‌లు ఉపయో గించడం) కండరాల నిర్మాణానికి సహాయపడుతుంది. కండర ద్రవ్యరాశి పెరగడం వల్ల విశ్రాంతి సమయంలో కూడా ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి, ఫలితంగా జీవక్రియ మెరుగుపడు తుంది. రోజువారీ నడక లేదా తేలికపాటి వ్యాయామాలను మీ దినచర్యలో భాగం చేసుకోవడం కూడా ప్రయోజనకరం. ఇక, తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ జీవక్రియకు అత్యంత అవసరం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతి రాత్రి 7 నుంచి 8 గంటలు నిద్రపోవడం ముఖ్యం. నిద్ర లేమి హార్మోన్ల అసమతుల్యతకు దారితీసి, జీవక్రియను మందగింప జేస్తుంది. సరైన నిద్ర జీవక్రియ ప్రక్రియలను సరిచేస్తుంది. ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం, యోగా వంటి పద్ధతులను అనుసరించడం వల్ల శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుంది. ఈ సాధారణ మార్పులు మెరుగైన జీవక్రియ ఆరోగ్యానికి, తద్వారా మంచి జీవితానికి దారి తీస్తాయి.



## చియా సీడ్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్


ఈ మధ్య కాలంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొలెస్ట్రాల్, బరువు తగ్గించుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే డైట్‌లో మార్పులు చేర్పులు చేసుకుంటున్నారు. ముఖ్యంగా రకరకాల సీడ్స్‌కి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో తప్పనిసరిగా కనిపించేవి చియా సీడ్స్. ఇందులో ఎన్నో పోషకాలున్నాయి. ముఖ్యంగా బరువు తగ్గడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నీటిలో నానబెట్టి తీసుకుంటే మలబద్ధకం సమస్య కూడా తీరిపోతుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నప్పటికీ సరైన విధంగా వీటిని వాడడం తెలియకపోతే సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు అని హెల్త్ ఎక్స్ పర్ట్స్ వారిస్తున్నారు. మోతాదు మించి వాడడం వల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉంటా యని చెబుతున్నారు. చియా సీడ్స్ అనగానే అందరూ చెప్పేమాట ఇదో సూపర్ ఫుడ్ అని. అలా అనడానికి కారణాలున్నాయి. ఎందుకంటే చియా సీడ్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో పాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇన్ని పోషకాలున్నాయి కదా అని ఎక్కువ మోతాదులో తీసుకుంటే మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు. ముఖ్యంగా ఎలా తీసుకోవాలో ఓ అవగాహన లేకుండా తింటే చాలా సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే వీటిని తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. చియా సీడ్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ లో ముందుగా మాట్లాడుకోవాల్సింది జీర్ణ సమస్యల గురించే. మామూలుగా అయితే ఇందులో ఫైబర్ ఉంటుంది. ఆహారం త్వరగా జీర్ణం కావడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఎక్కువగా తీసుకుంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా సరిగ్గా నీరు తీసుకోకుండా కేవలం చియా సీడ్స్ ని అధికంగా తినడం వల్ల పొట్ట ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం లాంటి సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. పొట్టలో నొప్పి వచ్చి ఇబ్బంది పడాల్సి వస్తుంది. సాధారణంగా చియా సీడ్స్‌ని నీటిలో నానబెట్టి మాత్రమే తినాలని సూచిస్తుంటారు వైద్యులు. అందుకు ఓ కారణం ఉంది. నీటిలో ఈ సీడ్స్ వేసినప్పుడు మెల్లగా అదో జెల్ మాదిరిగా తయారవుతుంది. అప్పుడు తిన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా సులువుగా జీర్ణం అవుతుంది. కానీ..కొంత మంది తెలియకుండా నీటిలో నానబెట్టకుండా నేరుగా వీటిని తింటూ ఉంటారు. ఇలా తిన్నప్పుడు అవి సరిగ్గా జీర్ణం కావు. పదేపదే గొంతులోకి వచ్చినట్టుగా అవుతాయి. అంతే కాదు. ఇలా పొడిగా తినడం వల్ల నాలుక కోసుకు పోయి నట్టుగా కూడా అవుతుంది. అందుకే తప్పనిసరిగా వీటిని నీటిలో నానబెట్టాల్సి ఉంటుంది. ఇక చియా సీడ్స్‌ని చాలా మంది పాల ఉత్పత్తులతో కలిపి తింటూ ఉంటారు. మామూలుగానే నీటిలో వేసినప్పుడు ఈ గింజలు ఉబ్బుతాయి. జెల్‌గా మారతాయి. అయితే..పాలు, లేదా పాల ఉత్పత్తులతో కలిపినప్పుడు ఇవి మరింత మందంగా తయారవుతాయి. ఫలితంగా వీటిని తినడానికి చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అంతే కాదు. ఇవి మందంగా తయారవడం వల్ల తొందరగా జీర్ణం కూడా కావు. ఫలితంగా పొట్ట అంతా పట్టేసినట్టుగా తయారవుతుంది.



ఇందాకే చెప్పుకున్నట్టుగా చియా సీడ్స్ లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి గుండెకి చాలా మంచి చేస్తాయి. ఎందుకంటే..బ్లడ్ ప్రెజర్ ని తగ్గించడంలో ఇవి ఎంతో తోడ్పడతాయి. చియా సీడ్స్ అందరికీ మంచివే అయినా లోబీపీతో ఇబ్బందులు పడుతున్న వారిలో మాత్రం సైడ్ ఎఫెక్ట్స్‌కి దారి తీస్తుండవచ్చు. ఎందుకంటే చియా సీడ్స్ కారణంగా బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. ఇప్పటికే లోబీపీ సమస్యకు మందులు వాడుతున్న వారు చియా సీడ్స్ తింటే బీపీ మరింత పడిపోతుంది. ఇది చాలా ప్రమాదకరం. అందుకే లోబీపీ ఉన్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ చియా సీడ్స్ ని తినకూడదు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే..చియా సీడ్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అయితే చాలా మంది వెజిటబుల్ సలాడ్ తో పాటు చియా సీడ్స్ తీసుకుంటారు. అయితే ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలతో పాటు చియా సీడ్స్ తీసుకుంటే ఫైబర్ కంటెంట్ ఎక్కువైపోతుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. చియా సీడ్స్ లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కేవలం బ్లడ్ ప్రెజర్ ని తగ్గించడమే కాదు. రక్తాన్ని కూడా పల్చగా మార్చేస్తుంది. ఇప్పటికే ఈ సమస్య ఉండి మెడిసిన్ వేసుకుంటున్న వారు చియా సీడ్స్ అతిగా తింటే రక్తం మరీ పల్చగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. కొన్ని సార్లు ఇది బ్లీడింగ్ అయ్యే ముప్పు కూడా ఉంటుంది. అంతే కాదు. కొన్నిరకాల పండ్లతో కలిపి చియా సీడ్స్ అసలు తీసుకోకూడదు. అసిడిక్ నేచర్ ఎక్కువగా ఉండే పండ్లతో కలిపి అసలు తినకూడదు. అంటే సిట్రస్ ఫ్రూట్..నారింజ, ద్రాక్ష లాంటి పండ్లతో కలిపి తిన్నప్పుడు జీర్ణ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశాలుంటాయి. వీటిలో ఉండే అసిడిటీ పొట్టలో ఉబ్బరం, గ్యాస్ కి దారి తీస్తాయి. అందుకే వీలైనంత వరకూ ఈ పండ్లతో కలిపి తినకపోవడమే మంచిది. అయితే అరటి పండ్లు, యాపిల్స్ తో కలిపి తీసుకుంటే మాత్రం ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావు అని ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. కొంత మందికి చియా సీడ్స్ తినడం వల్ల అలెర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా చర్మంపై దద్దులు వస్తాయి. దీంతో పాటు కళ్లలో నుంచి నీరు కారడం కూడా తలెత్తుతుంది. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడతారు. కొంత మందికి ఆవాలు, నువ్వులు కూడా పడవు. వెంటనే అలెర్జీ వచ్చేస్తుంది. అలాంటి వాళ్లు వీలైనంత వరకూ చియా సీడ్స్ కి దూరంగా ఉండడమే మంచిది. ఇక చియా సీడ్స్ లో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. డైట్ లో ఉన్న వారు మరీ అతిగా ఈ సీడ్స్ తినడం వల్ల కేలరీలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా క్రమంగా బరువు పెరుగుతారు. సరైన ఫిజికల్ యాక్టివిటీ లేకుండా చియా సీడ్స్ అతిగా తీసుకుంటే బరువు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

## ఐరన్ తక్కువైతే ఇలా ప్రభావం చూపుతుంది!

రక్తహీనత (అనీమియా) అనేది చాలా మంది చిన్న సమస్యగా భావించినప్పటికీ, వైద్య నిపుణుల ప్రకారం ఇది శరీరానికి ముప్పు తెచ్చే 'నిశ్శబ్ద వ్యాధి'. మన శరీరంలోని ప్రతి అవయవానికి ఆక్సిజన్ సరఫరా రక్తం ద్వారా జరుగుతుం ది. అయితే రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయి తగ్గిపోతే దానిని రక్తహీనత అంటారు. హీమోగ్లోబిన్ తక్కువగా ఉంటే శరీర అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల పలు రకాల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.వైద్యులు చెబుతున్నట్లుగా, చాలామంది రక్తహీనతను పెద్ద సమస్యగా భావించరు, కానీ వాస్తవానికి ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. తాజా గణాంకాల ప్రకారం భారతదేశంలో పురుషుల్లో సుమారు 25 శాతం, మహిళల్లో 57 శాతం, పిల్లల్లో 67 శాతం, గర్భిణీల్లో 52 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.రక్తహీనత ఉన్నవారిలో శరీర శక్తి తగ్గిపోవడం, అలసట, నిరుత్సాహం, గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కాళ్ల వాపు వంటి లక్షణాలు తరచూ కనిపిస్తాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో చిన్న వ్యాధులే తీవ్రమైన సమస్యలుగా మారే అవకాశం ఉంటుంది. రక్తహీనత అధికమైతే గుండెపై అదనపు ఒత్తిడి పడి, గుండె వాపు లేదా ఇతర హృదయ సంబంధిత సమస్యలు రావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాలామంది తినే ఆహారం సరిపోకపోవడం వల్ల రక్తం తగ్గిపోతుందని భావిస్తారు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం, రక్తహీనత ఉన్నవారిలో ఆకలి తగ్గడం వల్లే ఆహారం తినే పరిమాణం తగ్గుతుందంటు న్నారు. ముఖ్యంగా మహిళల్లో నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, హార్మోన్ల అసమతుల్యత (ఉదాహరణకు థైరాయిడ్), గర్భ సంచి



గడ్డలు వంటి పరిస్థితులు రక్తహీనతకు దారితీస్తాయి.గర్భిణీ స్త్రీల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. రక్తహీనతతో బాధపడే తల్లులకు పుట్టే శిశువులు తక్కువ బరువుతో పుడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే ప్రసవానంతరం తల్లులు తీవ్ర నీరసం, బలహీనతతో బాధపడే ప్రమాదం ఉంది.ఇక ఇతర వైద్య కారణాల్లో కడుపులో అల్సర్, క్యాన్సర్ వంటి వ్యాధులు కూడా రక్తహీనతకు కారణమవుతాయి. శరీరంలో ఇనుము, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి పోషకాల లోపం కూడా ఈ సమస్యను పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారు.రక్తహీనతను ఎప్పుడూ చిన్నచూపు చూడకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏవైనా లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుని సంప్రదించి సరైన రక్తపరీక్షలు చేయించుకోవాలి. ఆహారంలో ఇనుము సమృద్ధిగా ఉండే పదార్థాలు, పాలకూర, బీట్‌రూట్, జాగ్రి (బెల్లం), ఆకుకూరలు, పొడి పండ్లు చేర్చుకోవడం ద్వారా రక్తహీనతను నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సినిమా

## సఖి లాంటి ఫ్యామిలీ మూవీ 'డ్యూడ్'




లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్'తో దీపావళికి ప్రేక్షకుల ముం దుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. శుక్రవారం తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "–ఇది డిఫరెంట్ లవ్ స్టోరీ. చాలా కొత్త కథలాగా అనిపిస్తుంది. అద్భుతమైన సన్నివేశాలు ఉంటాయి. అలాగే భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉంటాయి. – డైరెక్టర్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్మకంగా ఉంది. కథలో ఎంత కావాలో అంతే మోతాదులో ఇందులో ఎమోషన్స్ అన్నీ ఉంటాయి. డ్యూడ్ ఈ కథకు సరైన టైటిల్. – తమిళ్‌తో సమానంగా తెలుగులో ఈ సినిమా ఆడుతుందని నమ్మకం ఉంది. ఇది మన ఎమోషన్స్ కి తగ్గట్టుగా ఉండే సినిమా. ఇది యూత్‌తో పాటు ఫ్యామిలీ కూడా చూసే సినిమా. తప్పకుండా చాలా కొత్తగా, ఆసక్తికరంగా ఉంటుంది. ఇది సఖి లాంటి ఫ్యామిలీ మూవీ. చాలా యూత్‌ఫుల్ సన్నివేశాలు ఉంటాయి.

## ఎమోషనల్ వార్‌ని చూడబోతున్నారు

'మిరాయ్' లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్–ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ, 'ఈరోజు చాలా బాధగా ఉంది. ఒక ఏడాదిగా చాలా రాడికల్, ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. ఒక వింత మనిషి బుర్రలో బతుకుతున్నాను. 17న సినిమా రిలీజ్ కాబోతుంది. వరుణ్ అనే క్యారెక్టర్‌కి గుడ్ బై చెప్పేయాలి. నేను ఎందుకు ఆ క్యారెక్టర్ గురించి అంత పర్టికులర్‌గా చెప్తున్నానో సినిమా చూస్తున్నప్పుడు మీకు అర్థం అవుతుంది. మన ఎమోషన్స్ మన కంట్రోల్‌లో ఉండాలని అర్థమవుతుంది. పవర్ కంట్రోల్ మనసులో మెయింటైన్ అవ్వాలి. ఇంకేమైనా డౌట్లు మిగిలిపోయి ఉంటే 17న థియేటర్స్‌కి వచ్చి సినిమా చూడండి. ఈ సినిమాలో వరుణ్ అనే క్యారెక్టర్ ఒక్క చుక్క రక్తం చిందించకుండా ఎమోషనల్ వార్, సైకలాజికల్ వైలెన్స్‌ని జనరేట్ చేస్తాడు. అది నా ప్రామీస్. బెర్ముడా ట్రయాంగిల్ మీద నుంచి షిప్ వెళ్లిన, ఎయిర్ క్రాఫ్ట్ వెళ్ళినా దానిలోకి లాగేసుకుంటుంది. ఈ సినిమా కూడా అలాంటి లవ్ ట్రయాంగిల్. ఈ సినిమా చూసిన వాళ్ళందరినీ కూడా అది లాగేస్తుంది' అని తెలిపారు. 'ఇది చాలా స్పెషల్ ఫిలిం. నాకు కథ చాలా నచ్చింది.



## హృతిక్‌కు హైకోర్టులో ఊరట..

ప్రముఖ బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అనుమతి లేకుండా తన ఫోటోలను వాడుతున్నారని ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా ఆయనకు కోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఇకపై అనుమతి లేకుండా హృతిక్ ఫోటోలు వాడడానికి వీల్లేదని కోర్టు ఆదేశించింది. వెంటనే హృతిక్ ఫోటోలను తొలగించాలని ఇ–కామర్స్ వెబ్‌సైట్లకు సూచించింది. అయితే అనుమతి లేకుండా తన వాయిస్, ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్, ఫ్యాన్స్ పేజీలలో ఉపయోగించుకుంటున్నారని హృతిక్ చేసిన ఆరోపణలను కోర్టు తోసిపుచ్చింది. అభిమానుల పేజీలలో వాడుకునేందుకు ప్రస్తుతానికి



అనుమతి ఇచ్చింది. హృతిక్ పేరు, డ్యాన్స్ వీడియోలతో ట్యూటోరియల్స్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని నటుడి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం వారు ప్రజలకు నేర్పించడం కోసం ఆ డ్యాన్స్ వీడియోలను ఉపయోగిస్తున్నారని తెలిపింది. అందులో వాణిజ్య ప్రయోజనం ఏమాత్రం లేదని.. ఎవరైనా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.

## మరోసారి డైరెక్టర్‌తో ఆ స్టార్ హీరో గొడవ..

కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ వరుస సినిమాలతో పాటు పలు వివాదాల్లో నిలుస్తుంటారు. దర్శకులతో అభిప్రాయ బేధాలు రావడంతో పలు చిత్రాలు ఆగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా, విశాల్ చుట్టూ ఓ వివాదం తిరుగుతుంది. మరోసారి ఓ దర్శకుడితో ఆయన గొడవ పడినట్లు సమాచారం. దీంతో భారీ ప్రాజెక్ట్ మధ్యలో షూటింగ్ ఆగిపోయినట్లు టాక్. అసలు విషయంలోకి వెళితే.. డైరెక్టర్ రవి అరుసు, విశాల్ కాంబోలో 'మకుటం' సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన కొంత మేరకు చిత్రీకరణ కూడా పూర్తి అయింది. ఇందులో దుషారా విజయన్, అంజలి హీరోయిన్లుగా నటిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. ఆర్బీ చౌదరి ప్రతిష్టాత్మక బ్యానర్ సూపర్ గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. విశాల్ కెరీర్‌లో 35వ ప్రాజెక్ట్‌గా రాబోతుంది. ఇటీవల మోషన్ పోస్టర్‌ను కూడా రిలీజ్ అయి మంచి రెస్పాన్స్‌ను దక్కించుకుంది. ఇక ఈ మూవీలో విశాల్ ట్రిపుల్ రోల్‌లో



కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. రవి అరుసు, విశాల్ మధ్య గొడవలు తలెత్తినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ గొడవలకి అసలు కారణం ఏంటో తెలియనప్పటికీ 'మకుటం' సినిమా ఆగిపోయినట్లు సమాచారం. ఈ చిత్రానికి కొత్త దర్శకుడెవరైనా వస్తారా? లేక విశాలే డైరెక్ట్ చేస్తాడా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## ఫ్యామిలీతో రండి.. అందరినీ నవ్విస్తాం



బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్ మీద కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ప్రియదర్శి, నిహారిక హీరో హీరోయిన్లు. విజయేందర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం నేడు (గురువారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో బుధవారం సాయం త్రం ప్రీమియర్లతో ఆడియెన్స్ ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించింది. సమర్పకుడు బన్నీ వాస్ మాట్లాడుతూ,' ప్రీమియర్లకు మంచి స్పందన వస్తోంది. డిమాండ్ పెరుగుతుం డటంతో స్క్రీన్లను పెంచుకుంటూ వెళ్తున్నాం. అయితే ప్రీమియర్లతో రిస్క్ కూడా ఉం టుంది. ఆ రిస్క్‌ని కూడా నేను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. దీపావళి పండుగ 21 అయితే.. నవ్వుల పండుగ మాత్రం ఈ రోజు సాయంత్రం మా ప్రీమియర్లతో స్టార్ట్ అయ్యింది. అందరూ ఫ్యామిలీతో సినిమాకు రండి.. హాయిగా నవ్వించి బయటకు పంపిస్తాం. మా సినిమా మీద కావాలనే నెగటివ్ క్యాంపైన్ చేస్తున్నారు. కానీ మనలో ఎవ్వరూ మాట్లాడటం లేదు. అందుకే నేను గట్టిగా, ఎమోషనల్‌గా రెస్పాండ్ అయ్యాను. కొంత మంది నిర్మాతలు తెలిసో తెలియక ఇలాంటి నెగటివ్ క్యాంపైన్ లను సపోర్ట్ చేస్తున్నారు. పక్క సినిమాని తొక్కాలని చూడటం మాత్రం చాలా తప్పు. ఒక మూవీని తొక్కితేనే ఇంకో మూవీ ఆడుతుంది అని అనుకోవడం మూర?త్వం. నా చేతిలో ఉన్న థియేటర్లకి కూడా మిగిలిన చిత్రాలకు ఛాన్స్ ఇచ్చాను. నా మూవీని రెండు షోలు వేస్తే.. మిగతా చిత్రాలకు రెండు షోలు ఇస్తున్నాను. అన్ని సినిమాలు బాగుండాలి.. అన్ని చిత్రాలు ఆడాలన్నదే నా ఉద్దేశం.

## 'మైసా'కి జేక్స్ బిజోయ్ మ్యూజిక్

ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా' తో హీరోయిన్ రష్మిక మందన్న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం ఇప్పటికే ఆసక్తికరమైన టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో బజ్‌ను సృష్టించింది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ భారీ బడ్జెట్‌తో పాన్–ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మేకర్స్ ఓ ఆసక్తికర అప్డేట్ ఇచ్చారు. బ్లాక్ బస్టర్ 'సరిపోదా శనివారం' ఫేం జేక్స్ బిజోయ్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. 'సౌండింగ్ అదిరిపోయింది. 'మైసా' మ్యూజికల్‌గా గ్రాండ్ స్కేల్‌లో ఉండబోతుంది. గోండ్ తెగల బ్యాక్ డ్రాప్‌లో హై–ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని అలరించనుంది. రష్మిక మందన్న ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్‌లో సర్‌ప్రైజ్ చేయనుంది. సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తుండగా, 'కల్కి 2898 ఏ డీ' ఫేమ్ ఆండి లాంగ్ యాక్షన్ కొరియోగ్రఫీని డిజైన్ చేస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది' అని చిత్ర యూనిట్ చెప్పింది.



## బండ్ల గణేష్ సంచలన ట్వీట్..

టాలీవుడ్ ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఏదో ఒక పోస్ట్ పెట్టి, వార్తల్లో నిలుస్తూ ఉంటారు బండ్ల గణేష్.అదే సమయంలో ఏదైనా సినిమా ఫంక్షన్ కు వెళ్తే ఖచ్చితంగా పవన్ కళ్యాణ్ ప్రస్తావన తీసి తెగ పొగిడేస్తుంటారు. ఇక బండ్ల గణేష్ ఎప్పుడైనా టీవీ డిబేట్లో కూర్చుంటే పెద్ద వివాదమే జరుగుతూ ఉంటుంది. అలాంటి సంఘటనలు చాలానే ఉన్నాయి.అయితే అలాంటి బండ్ల గణేష్ తాజాగా సంచలన పోస్ట్ పెట్టారు. అది పీకుతా, ఇది పీకుతా అని చెప్పాల్సిన పనిలేదు... మాటలు మన చేతిలో ఉన్నప్పటికీ, ఆట ఎవరిదో జనాలు తీర్మాని స్తారు అంటూ పోస్ట్ పెట్టారు. బండ్ల గణేష్ ఈ పోస్టు పెట్టగానే క్షణం లోనే వైరల్‌గా మారింది. దీంతో సినిమా అభిమానులు, నెటిజెన్స్ రకరకాలుగా స్పందిస్తున్నారు. బండ్ల గణేష్ ఎవరినో ఉద్దేశించి కావాలనే ఈ పోస్ట్



పెట్టాడని కామెంట్స్ పెడుతున్నారు. మొన్న బన్నీ వాసు చేసిన కామెంట్లకు ఇప్పుడు బండ్ల గణేష్ పరోక్షంగా స్పందిం చాడని మరి కొంత మంది పేర్కొంటున్నారు. అనవసరంగా బన్నీ వాసును గెలకకూడదని మరి కొంత మంది సూచిస్తున్నారు. బన్నీ వాసు నిర్మాణంలో వచ్చిన లేటెస్ట్ మూవీ మిత్ర మండలి. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా బన్నీ వాసు సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది తన సినిమాపై నెగటివ్ ప్రచారం చేస్తున్నారని, వాళ్లు తన వెంట్రుక కూడా పీకలేరని ఆయన వార్నింగ్ ఇచ్చారు. బన్నీ వాసు ఈ వ్యాఖ్యలు చేసిన రెండు రోజులకే బండ్ల గణేష్ కౌంటర్ ఇచ్చినట్లు చెబుతున్నారు.

## కృతి సనన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ కృతి సనన్ 'తేరే ఇష్క్ మే' మూవీతో రాబోతుంది. ఇందులో స్టార్ హీరో ధనుష్ సరసన రొమాన్స్ చేయనుంది. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రాబోతుంది. ఈ లవ్ స్టోరీ నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో పాటు మరో ప్రాజెక్ట్ చేస్తోంది. ఇక కృతి సనన్ ఓ వైపు షూటింగ్స్‌లో పాల్గొంటూ బిజీగా ఉన్నప్పటికీ పలు ఈవెంట్లకు వెళ్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా, బెర్లిన్‌లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేసింది. "మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉంది. ప్రపంచ జనాభాతో పోల్చుకుంటే.. దాదాపు సగం మంది మహిళల వైద్యానికి సరిపడా నిధులు ఉండడం లేదు.



## నేటి బంద్ కు సహకరించాలి



జన్నారం, అక్టోబర్ 17(వుదయం విలేకరి) బీసీ రిజర్వేషన్లు 42 శాతం సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర బంద్ కు బీసీ సంఘాల పిలుపుకు సహకరించాలని మంచిర్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీ రాముల గంగాధర్ కోరారు. అయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం ఆదేశాల మేరకు ఈ నెల 18 శనివారం రోజున బంద్ కు వర్తక వాణిజ్య వ్యాపారులు, చిరు వ్యాపారులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్ జీవోను నిలిపివేయడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేయికండ్ల రవి చారి, ప్రధాన కార్యదర్శి బండోజు లక్ష్మీనరసయ్య, ఉపాధ్యక్షులు శ్రీరాముల వెంకటేష్, నాయకులు రామచంద్రం తొగిటి శోభన్, శ్రీనివాస్, ముమ్మడి రమేష్, ఉప్పుల సత్యం, బిసి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సాక్షి ఎడిటర్ పై కేసును ఎత్తివేయాలంటూ జర్నలిస్ట్ ల రాస్తారోకో



జన్నారం, అక్టోబర్ 17(వుదయం విలేకరి) ఆంధ్రప్రదేశ్ లో సాక్షి 'ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ జన్నారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం లోని ప్రధాన రహదారి పై శుక్రవారం మధ్యాహ్నం రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిలువేరు నర్సయ్య మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం కు మధ్య వారదిగా ఎంతో క్రియ శీల పాత్ర పోషిస్తున్న జర్నలిస్ట్ ల కక్ష పూరితంగా వ్యవరించడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి ఎడిటర్ పై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న గౌడ్ స్థానిక జర్నలిస్ట్ లు కందుల రమేష్, అమరగొండ సతీష్, కాంతయ్య, కొత్త వేణు గోపాల్ గుప్తా,మేడ మురళి,ముస్తఫా,గొనె సత్యం,కొమరవెల్లి శివరామకృష్ణ, జీవీపీ రాజు, నిమిష కవి రాజు, అజ్మత్,ఐలవేణి నర్సయ్య,మల్లేష్, కస్తూరి సతీష్, కాంగ్రెస్ నాయకులు గంగన్న యాదవ్, మహేంద్ర సంఘం నాయకులు కోడి జుట్టు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బంద్ కు సీపీఐ మద్దతు

♦ సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఆర్కే పి పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్



రామకృష్ణాపూర్/అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): బీసీ రిజర్వేషన్లు నలబై రెండు శాతం సాధనే లక్ష్యంగా,బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలు జరపాలని హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే నేటి తెలంగాణ రాష్ట్ర బంద్ కు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ లు అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ లు మాట్లాడారు. బీసీలు దశాబ్ద కాలంగా రిజర్వేషన్లు పెంచాలని పోరాటాలు చేస్తున్న నేపద్యంలో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ లు కల్పించాలని తలపెట్టిన బంద్ కు వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, అన్ని కుల సంఘాలు,అన్ని వర్గాల ప్రజలు సహకరించి బంద్ లో పాల్గొనాలని తెలిపారు. అగ్రకులాల వారు బీసీ రిజర్వేషన్ ఆపాలని కోరుతూ స్టే తీసుకొచ్చిన నేపథ్యంలో బంద్ కు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇప్పకాయల లింగయ్య, సాంబయ్య , మొండి, పౌలు, మారేపల్లి రవి, రాయలింగు,రాములు,దేవానంద్, గోపి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## భారీ విరాళాన్ని అందజేసిన పూసల దంపతులు

♦ పూసల దంపతులను ఘనంగా సత్కరించిన ఉత్సవ కమిటీ



ఆలమూరు, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలమూరు మండలం నర్శిపూడి తూర్పు వీధి పాత రామాలయం వద్ద ఏర్పాటుచేసిన శ్రీదేవి ఉత్సవ పందిరి వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో ఆలమూరు మండపేట మండలాల నుండి వేల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి పేరున నిర్వహించే ఈ అన్నదానం మరింత భారీగా నిర్వహించాలని అదే గ్రామానికి చెందిన పూసల శ్రీనివాసు, రాజేశ్వరి దంపతులు రూ.50 వేలు భారీ విరాళాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. విరాళాన్ని అందించిన పూసల దంపతులకు ఉత్సవ కమిటీ సభ్యులు పూలమా ల లతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. అమ్మవారి అన్న సంతర్పణ ఎంతో ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను పూసల దంపతులు అభినందించారు.

# ఉన్నత విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

♦ ధర్మపురి కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ
♦ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



ధర్మపురి అక్టోబర్ 17(వుదయం విలేకరి): ఉన్నత విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాల యంను జిల్లా కలెక్టర్ బి.సత్యప్ర సాద్ ఆకస్మిక తనిఖీ నిర్వహించా రు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ విద్యార్థినులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకు న్నారు. విద్యార్థినుల ఆరోగ్య, విద్యల పట్ల శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించా రు. అనంతరం భోజనం నిర్వహణ ను, వంట సరుకుల నాణ్యతను, స్టోర్ రూమ్ లో గల బియ్యం నాణ్యత ను పరిశీలించి వంట నిర్వాహ కులను ప్రభుత్వ ఆదేశా నుసారం మెను ప్రకారంగా,శుభ్ర మైన వాతా వరణంలోనే విద్యార్థు లకు వండి వడ్డించాలని సూచించా రు. పాఠశాలలో ఉన్నటువంటిఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా లయం చుట్టూ ఉన్న పరిసరాల శుభ్రతను పరిశీలించారు. విద్యా ర్థులతో కలిసి భోజనం చేసి భోజ న తీరు పట్ల కొన్ని విషయాలను తెలుసుకొని ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీఓ మధుసూదన్,డిఈఓ కే. రాము,ఎంఈఓ సీతాలక్ష్మీ తహశీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం

♦ పెద్దపల్లి కలెక్టరేట్ లో నిర్వహణ



సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం

పెద్దపల్లి, అక్టోబర్ 17(వుదయం విలేకరి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ రోజు (17 అక్టోబర్) సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్) పై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ గారి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా డా. ప్రశాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండం పాల్గొని సిపిఆర్ చేసే విధానంపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ ఇచ్చారు. అనంతరం పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డా. వాణిశ్రీ మాట్లాడుతూ, "గుండె పోటు వంటి హఠాత్ ఆరోగ్య సమస్యలు నివారించాలంటే జీవన శైలి లో మార్పులు తెచ్చుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి, తక్కువ క్రొవ్వు ఉన్న ఆహారం తీసుకోవాలి, ఉప్పు వాడకాన్ని తగ్గించాలి, బరువు నియంత్రణలో పెట్టాలి" అని సూచించారు. ఆమె మాట్లాడుతూ – "ఒకరు ఆకస్మికంగా కుప్పకూలితే వెంటనే శ్వాస ఉన్నదో లేదో పరిశీలించాలి. వెంటనే 108 కు సమాచారం ఇచ్చి, సిపిఆర్ చేయడం ద్వారా పునర్జీవితం కల్పించవచ్చు. ఈ పరిజ్ఞానం సాధారణ పౌరులకు కూడా ఉండటం ఎంతో అవసరం. ఇది ప్రాణాల్ని రక్షించగల సామర్థ్యాన్ని అందిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డా. ఆర్. రాజమౌళి, డా. కె.వి. సుదాకర్ రెడ్డి, డా. బి. కిరణ్ కుమార్, డా. నిస్సీ క్రిస్టినా, డా. మమత, జిల్లా అధికారులు మాధవి, రంగా రెడ్డి, నరేష్, రవీందర్ సహా జిల్లాలోని పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కోట్లు ముంచిన కేటుగాడి అరెస్టు



మంథని, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మంథని పట్టణంలో వ్యాపారాల పెట్టుబడి పేరిట భారీ ఎత్తున అప్పులు తీసుకొని నమ్మించి మోసం చేసిన కేటుగాడు బంధం చంద్రశేఖర్ ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. మంథని పట్టణానికి చెందిన బండారి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి బంధం చంద్రశేఖర్ ను మంథని పోలీసులు అరెస్ట్ చేసి మంథని కోర్టులో జడ్జి లేని కారణంగా గోదావరిఖని జడ్జి ఎదుట హాజరుపరచి కరీంనగర్ జైలుకు రిమాండ్ చేయడం జరిగింది. బాధితుల వద్ద రూ. 5 కోట్ల నుండి రూ.6 కోట్ల మేరకు పథకం ప్రకారము నమ్మించి సుమారు 25 మంది బాధితుల నుండి వడ్డీ ఎక్కువ ఇస్తాను అని ఆశ చూపి కోట్ల వసూలు చేసినట్లు సమాచారం. మంథని పరిధిలో జులాయిగా తిరుగుతూ మోసాలకు పాల్పడుతున్న చంద్రశేఖరను కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.

మరో బాధితుడు ఆకుల కిరణ్ మాట్లాడుతూ భర్త కు తెలియకుండా భార్య దగ్గర భార్యకు తెలియకుండా భర్త దగ్గర లక్షల రూపాయలు అప్పులు తీసుకొని మోసం చేశారని బ్యాంకులను సైతం తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి మోసం చేసి లక్షల రూపాయలు అప్పులు చేశాడని ఆయన పేర్కొన్నారు ఇలాంటి మోసగాళ్లను నమ్మి ఎవరు అప్పులు ఇవ్వకూడదని సూచించారు. బంధం చంద్రశేఖర్ పై మరో ఐదుగురు బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వారెంట్లు పెండింగ్లో ఉన్నట్లు సమాచారం. హెడ్మాస్టర్ తాడిచర్ల రాజేశ్వరరావు, ఆకుల కిరణ్, కమ్మగోని రవి లు పోలీసులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

# శ్రీకృష్ణదేవరాయుల పాలన స్వర్ణయుగం

♦ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



రావులపాలెం, అక్టోబర్17(వుదయం విలేకరి): విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయుల పాలన స్వర్ణయుగమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయుల 496వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో ప్రజల మన్ననలు పొందిన గొప్ప చక్రవర్తులలో శ్రీకృష్ణదేవరాయులు ఒకరన్నారు. ఆయన పాలనా కాలంలో ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించారని వ్యాఖ్యానించారు. ఆయన కాలంలో రత్నాలు,వజ్రాలు బజార్లలో రాశులుగా పోసి అమ్మేవారని చరిత్ర చెబుతుందన్నారు. తెలుగు భాషకు ఆయనచేసిన సేవ చిరస్మరణీయమన్నారు. తన పాలనతో స్వర్ణ యుగాన్ని సృష్టించిన శ్రీకృష్ణదేవరాయులు మనందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రావులపాలెం లో శ్రీ కృష్ణ దేవరాయల కాంస్య విగ్రహం ఏర్పాటు కి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, నందం సత్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఎస్సీ కమిషనర్ విచారణ

♦ జి సునీల్ కుమార్ బాబు



హుస్నాబాద్, అక్టోబర్17(వుదయం విలేకరి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో గల జిల్లెలగడ్డలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి వివేక్ (13) ఈ నెల 7న పాఠశాల ఆవరణలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ అధికారులు శుక్రవారం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ డైరెక్టర్ జి. సునీల్ కుమార్ బాబు, సభ్యులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా అగ్రవాల్, ఏసీపీ సదానందం, హుస్నాబాద్ ఆర్డీవో రామూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ రామేష్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ తదితర అధికారులతో సమావేశమై వివరాలు సేకరించారు. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, తరగతి సహచరులను కూడా విచారించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు మాట్లాడుతూ...విచారణ కొనసాగుతోందని... పూర్తి నివేదిక ఇవ్వడానికి ఒక నెల సమయం పడుతుందన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించామని, ప్రతి అనుమానాస్పద అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. విచారణ అనంతరం దోషులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం అని తెలిపారు. అలాగే, జిల్లా యంత్రాంగానికి పలు ఆదేశాలు జారీ చేశామని, తీసుకోవాల్సిన చర్యల వివరాలను వారంలోగా కమిషన్‌కు తెలియజేయాలని సూచించామని పేర్కొన్నారు. లోటుపాట్లు ఉన్నచోట క్రమశిక్షణాత్మక చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుల సమీక్ష సమావేశం



మంథని,అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): మంథని యూత్ కాంగ్రెస్ నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు సూచనల మేరకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, పెంటరి రాజేందర్ మంథని క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బండ కిషోర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల కమల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ నాయకులను ఉద్దేశించి వారు ప్రసంగించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆదేశానుసారం కాంగ్రెస్ గ్రామ కమిటీలను రద్దు చేయడం జరిగిందని, నూతన కమిటీలు నిర్మించడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని వారు వివరించారు. పార్టీకి కష్టకాలంలో ఉన్నటువంటి యువ నాయకులకు అవకాశం కల్పించడం జరుగుతుందని వారు తెలిపారు నూతన కమిటీ సంబంధించి క్లస్టర్ల వారిగా ఇన్చార్జను నియమించడం జరిగిందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మంథని మండలంలోని అన్ని గ్రామాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా హాథిరాం బాలాజీ భర్షి ఉత్సవాలు

• డాక్టర్ ఎస్ పి నాయక్ మహారాజ్



హుస్నాబాద్, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): అక్కన్నపేట మండలంలోని సేవాలాల్ మహారాజ్ తండా గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ శ్రీ హాథిరామ్ బాలాజీ భర్షి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రముఖ బంజారా ప్రవచనకర్త ఎస్పీ నాయక్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ భర్షి ఉత్సవాలు విశేషంగా నిర్వహించారు. కలియుగ దైవమైన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామితో పాచికలాడి గెలిచి, భగవంతుడి పేరే బాలాజీ అని నామకరణం చేసిన పరమభక్తుడు, తిరుమల తిరుపతి దేవస్థానం తొలి పూజారి హాథిరాం బావాజీ జ్ఞాపకార్థంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. సుమారు 600 సంవత్సరాలుగా భక్తుల కోరికలు నెరవేర్చుతున్న హాథిరాం బాలాజీ జీ సమాధి యాదిలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని భజన, పాటలతో స్వామిని స్మరించారు. ఈ కార్యక్రమంలో హరిలాల్ నాయక్, భాస్కర్ నాయక్, కిషన్ నాయక్, రాజు నాయక్, పవర్ తిరుపతి నాయక్, సుమన్ నాయక్, రమేష్ నాయక్, భిక్యా నాయక్, రాజేష్ నాయక్, మహేష్ నాయక్, సంపత్ నాయక్, ఈర్యా నాయక్, లక్ష్మణ్ నాయక్, సక్రు నాయక్, రజిత, బంగారి, బుజ్జి, నీల, శాలి తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

♦ ధర్మపురి రెవెన్యూ కార్యాలయం ఆకస్మిక తనిఖీ
♦ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



ధర్మపురి, అక్టోబర్17(వుదయం విలేకరి): ధర్మపురి మండలం రెవెన్యూ కార్యాలయం ను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీ లించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవల సిందిగా అధికారులకు ఆదేశించా రు. అనంతరం పలురికార్డులను పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పునఃనిర్మాణం పనులకు సంబం ధించిన భూసే కరణ పనులు వేగవంతం చేయాలని అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీఓ మధు సూదన్, తహశీల్దార్ శ్రీనివాస్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సమయ వేళల మార్పుపై నిరసన మందమర్రి



అక్టోబర్ 17( వుదయం విలేకరి ): మందమరి ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్లో సమయ వేళలు మార్చినందుకు శుక్రవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం జరిగింది. కేవలం ఒక్కరోజు ముందుగా చెప్పి ఈ విధంగా సమయం మార్చడం సరైనది కాదనిపాత పద్ధతి ప్రకారం సమయమైన కొనసాగించాలని వారు కోరడం జరిగింది. గెలిచిన సంఘాల వైఖరి వల్లనే ఈ విధంగా సమయ వేళలు మారాయి అని ఆరోపించారు.

## బీసీలకు రాజకీయ విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి

- నేటి బిసి బందుకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు.
- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్య.



ఖానాపురం, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి బీసీలకు రాజకీయపరంగాగాని విద్యపరంగాగాని ఉద్యోగపరంగాగాని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన విధంగా వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిని బీసీల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.నేడు శనివారం జరగబోవు బిసి జేఏసీ బందుకు బిఆర్ఎస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ లకు రిజర్వేషన్ 42 శాతం అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుపుతూ వివిధ వాణిజ్య వ్యాపారలను బంద్ చేసి బీసీలకు మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకుడు గుగులోత్ లక్ష్మణ్ నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షులు కోరే సుధాకర్, మండల అధికార ప్రతి తక్కలపల్లి బాబురావు, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే రాము, నాయకులు కాస ప్రవీణ్, వల్లెపు సోమయ్య, భూక్య వెంకన్న, గుగులోతు బాలునాయక్, జాటోత్ బాలునాయక్, బందారపు శ్రీనివాస్ గౌడ్, ముద్దంగుల రవి, ఆబోతు అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా డివిఏహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ



రాయపర్తి అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): పశువులకు సీజనల్ గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా డివిఏహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో పశువులకు గాలి కుంటూ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మితితంగా తనిఖీ చేస్తూ రికార్డును వరంగల్ జిల్లా డివిఏహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పశువులకు గాలి కుంటి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రుతి,ఎండి .మక్బుల్ జెవిఓ వెంకటయ్య (ఎల్.ఎస్.ఏ), గణేష్ (వి.ఏ) , కపిల్, గోపాల మిత్ర రమేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ చేస్తే ప్రాణాలు నిలిచే అవకాశం ఉంది

- మాతా శిశు సంరక్షణ వైద్యాధికారి డాక్టర్ భాస్కర్



వెంకటాపురం అక్టోబర్ 17 (వుదయం ప్రతినిది): గుండెపోటుకు గురైన సమయంలో సిపిఆర్ చేయడం వల్ల ప్రాణం పోకుండా కాపాడే అవకాశం ఉంటుందని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత శిశు సంరక్షణ వైద్యాధికారి భాస్కర్ అన్నారు.శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ఉన్నతపాఠశాల,ప్రభుత్వ జూనియర్ క ళాశాల,విద్యార్థులకు,ఉపాధ్యాయులకు సిపిఆర్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ..మనిషి ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు రావడం వల్ల వయసుతో సంబంధం లేకుండా చాలామంది గుండెపోటుతో చనిపోతున్నారని అన్నారు.గుండెపోటు వచ్చిన సమయంలో వారికి సిపిఆర్ అనేది కీలక పాత్ర పోషిస్తుందని,ఈ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని అన్నారు.గుండె ఆగిపోవడం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నప్పుడు సిపిఆర్ చేపడితే రక్త ప్రసరణ జరిగి ప్రాణాలు నిలవచ్చని తెలిపారు.ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు అధికమయ్యాయని దీనిపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల లెక్చరర్స్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు,హెచ్ఈఓ కోటిరెడ్డి,స్టాఫ్ నర్స్ స్వప్న,హెల్త్ అసిస్టెంట్ రాఘవులు,ఏఎన్ఎం భారతమ్మ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 31 వ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి!

- అభివృద్ధికి డివిజన్ ప్రజలు సహకరించగలరు
- కార్పొరేటర్ మామిండ్ల రాజు



హనుమకొండ, అక్టోబర్ 17(వుదయం జిల్లా ప్రతినిధి) : ప్రభుత్వ నిర్ణయించిన మాస్టర్ ప్లాన్ ప్రకారంగా మన న్యూ శాయంపేట కూడలి ఇందిరా గాంధీ బొమ్మ నుంచి రైల్వే గేట్ వరకు ఉన్న ప్రధాన రహదారి వెడల్పు డివైడింగ్ పనులు అతి త్వరలో ప్రారంభించుటకు సిద్ధంగా ఉందని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. ఈ ప్రధాన రహదారి డివైండింగ్ ఏర్పాటులో భాగంగా పూర్తిగా ఇండ్లు కోల్పోయే బాధితులు నన్ను సంప్రదిస్తే వారికి నా యొక్క విధిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేపిస్తాను. 31వ డివిజన్ ప్రజలందరూ ఇట్టి అభివృద్ధి పనులకు సహకరించ గలరని కార్పొరేటర్ మామిండ్ల రాజు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థినిలకు మెరుగైన విద్యను ఉపాధ్యాయులు అందించాలి

**కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సందర్శన.**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**





ఖానాపురం, అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి):విద్యార్థినిలకు మెరుగైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల రిజిస్టార్లను విద్యార్థినిల హాజరు పట్టికను విద్యార్థులకు అందించే భోజనమును భోజనశాలను వంటగదిని విద్యార్థులకు అందించే నీటి సౌకర్యాలను విద్యార్థినిలు ఆడుకునే గ్రౌండ్ను కలెక్టర్ క్షుణంగా పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థినిలకు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పలు ప్రశ్నలు అడిగి విద్యార్థినిల ద్వారా తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు, అలాగే గురుకుల విద్యాలయంలోని కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేశారు. పాఠశాలకు గురుకుల పాఠశాలకు కోతుల విడుద ఎక్కువగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఈ సందర్భంగా విద్యార్థినిలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినిలు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినిలకు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నంగునూరి రమేష్, మండల స్పెషల్ ఆఫీసర్ సౌజన్య, టిఈడబ్ల్యూఐడిసి డిఈ అశోక్, జిఈసిఓ ఫ్లోరెన్స్, ఎంఈఓ శ్రీదేవి, స్పెషల్ ఆఫీసర్ మేనక, ఉపాధ్యాయ బృందము విద్యార్థినిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేద పాఠశాల భూమీ సేకరణ కరపత్ర ఆవిష్కరణ



నర్సంపేట అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నర్సంపేట ఆలయ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ధరణిశ్రీ ఫౌండేషన్ సనాతన ధర్మ పరిరక్షణ సేవాసమితి చైర్మన్ ముడుంబై వేంకటాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జీర్ణోద్ధారణ ఆలయ నిర్మాణ పనులు వాస్తు విషయాలు కమిటీ వారితో చర్చించి తగు సూచనలు ఇచ్చారు. పనులు వేగవంతంగా దగ్గరుండి నిర్వహిస్తున్న కమిటీ చైర్మన్ ఎర్ర. జగన్మోహన్ రెడ్డి వారి కార్యవర్గం, వాస్తు ప్రకారం దేవాలయ నిర్మాణంలో శ్రద్ధతో పని చేస్తున్న కాంట్రాక్టర్ కి అభినందనలు తెలియజేశారు. హిందూ సంస్కృతి సంప్రదాయం దేవాలయాలనుండి వస్తుందని సనాతన ధర్మాన్ని అభివృద్ధి చేయాలని ఇందుకు వేద పాఠశాలలు ఎక్కువగా ఏర్పాటు చేయాలని దాని ద్వారా వేదము, అర్చకత్వం, పౌరోహిత్యం, జ్యోతిష్యము, అష్టాదశ పురాణములు నేర్పించి నిష్ణాతులను, తయారు చేయాలనే సంకల్పముతో ధరణి శ్రీ ఫౌండేషన్ ముందుకు వచ్చిందని పాఠశాల ఏర్పాటుకు భూమి స్థల సేకరణ నిమిత్తమై ఒక ఎకరం స్థలం హైదరాబాద్ సమీపంలో వరంగల్ రూట్ మధ్య కొనుగోలుకు స్థలం అవసరమున్నందున ఒక గజమునకు 1250 చొప్పున 5 గజములకు

## బిసి రిజర్వేషన్లకై సంపూర్ణ మద్దతు...

- వాడ బలిజ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షులు బి దర్ర దామోదర్



వెంకటాపురం అక్టోబర్ 17 (వుదయం ప్రతినిది) 18 వ తారీకు శనివారం రోజున జరగబోయే అటువంటి బీసీలకు 42 % రిజర్వేషన్లు సాధించుట కొరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బంధు ప్రకటించడం జరిగింది. ఆ బందు కి సంపూర్ణ మద్దతు తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్ తెలపడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ
శనివారం జరగబోయే తెలంగాణ రాష్ట్ర బందు కి పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీ బందుని విజయవంతం చేయాలని, ఆ సంఘ నాయకులకు,కార్యకర్తలకు,పిలుపునిచ్చారు .రిజర్వేషన్లలో బీసీ ఏ కులాల జాబితాలో మూడవ కులం, బీసీ ఏ రిజర్వేషన్ కేటగిరీలో సీరియల్ నెంబర్ 3 లో వాడ బలిజ కులస్తులుగా అత్యధిక జనాభా కలిగి ఉన్న మనం 42% రిజర్వేషన్ లలో ఏ,బీ, సి డీ వర్గీకరణను స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో అమలు చేయించుకోవడానికి ప్రస్తుతం జరుగుతున్న రిజర్వేషన్ లు ఉద్యమంలో పోరాడవలసి ఉంటుందనీ,మనకు రావాల్సిన వాటా మనకు వచ్చేంతవరకు పోరాటాలు ఉద్యమాలు రాస్తారోకలు నిర్వహించి ఖచ్చితంగాసాధించుకోవలసిందేనని ఎక్కడికక్కడ శాంతియుతంగా ప్రతి మండల కేంద్రంలో మన ప్రాంతాల్లో ఉన్న విద్యాలయాలు, ఆఫీసులు, వాణిజ్య వ్యాపార సంస్థలు, ఆర్టీసీ బస్సులు లారీలు ఇతర వాహనాలు ఏవి రోడ్లపై తిరగకుండా సంపూర్ణ మద్దతుకు సహకరించాలని కోరుతూ బంద్ ప్రశాంత వాతావరణంలో బందును విజయవంతం చేసేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఉన్నటువంటి బీసీ కులాలను కలుపుకొని కాపు,మున్నూరు కాపు సోదరులు బెస్త సోదరులు యాదవ సోదరులు కుమ్మరి సోదరులు రజక సోదరులు నాయి బ్రాహ్మణ సోదరులు కంసాలి సోదరులు పెరిక సోదరులు కమ్మరి వడ్డెర సోదరులు గౌడ సోదరులు పద్మశాలి సోదరులు మైనారిటీ మరియు మిగతా బీసీ కులాలను కలుపుకుని తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం అధ్యక్షులు దర్ర దామోదర్ పిలుపునిచ్చారు.

## 108 కళాశాలతో సకల నది తీర్థ సంగ్రహణ యాగశాల సంప్రోక్షణ




పరకాల అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం నందు ఉదయము 6:30 నిమిషములకు 108 కలశములతో అన్ని రకాల పుణ్య నది జలాలతో ఆలయంలో ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ కోమల్లపల్లి సంపత్ కుమార్ శర్మ చే పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం 108 కలశములతో ఆలయ ప్రాంగణం నుండి పరకాల పట్టణ భక్తులు యాగ సమితి సభ్యులు పుర ప్రముఖులు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని స్మరిస్తూ పరకాల పట్టణ పురవీధులలో 108 కలశాలతో ఊరేగింపుగా మహా రుద్ర యాగ స్థలా వేదికకు చేరుకొని 108 కలశముల నది జలాలతో యాగ స్థలమును సంప్రోక్షణ నిర్వహించిన ఆలయ అర్చకులు బ్రహ్మ శ్రీ కోమాళ్ళపల్లి సంపత్ కుమార్ శర్మ ఇట్టి కార్యక్రమంలో మహా రుద్రయాగ సమితి అధ్యక్షులు ఎర్రం లక్ష్మణ్ కన్వీనర్ గందె రవి కన్వీనర్ అశోక్ యాగ సమితి కోశాధికారి తోట భద్రయ్య ఆలయ డైరెక్టర్స్ డాక్టర్ సరోజన దేవి తోట రవి గౌరిశెట్టి నవీన్ సురేష్ రెడ్డి భక్తులు అడగని జనార్ధన్ నవీన్ కుమార్ ముడుతనపల్లి చేరాలు పరకాల పట్టణ పరిసర గ్రామాల భక్తులు పలువురు పాల్గొనడం జరిగింది.

## పశువుల సంతకు సంబంధించిన భూమి

- శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానానికి చెందినదే
- సంతోషం వ్యక్తం చేస్తున్న పరకాల ప్రజలు

పరకాల అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి )పరకాల ప్రముఖ శైవక్షేత్రం శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానమునకు సంక్రమించిన స్థలము దేవస్థానమునకు ప్రక్కనే సర్వేనెంబరు 991, 4ఎకరముల 11 గుంటల స్థలం ఉంది ఇట్టి స్థలాన్ని అట్టి వంశానుగత అర్చకులు, భక్తులు, దేవాదాయశాఖ కలిసి 1982 నుండి ఉన్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించిగా రికార్డులను పరిశీలించి గత 6నెలల క్రితం అప్పటి వరకు జరిగిన వాదోపవాదములను పునః పరిశీలించి న్యాయం వెలువరించాలని అడిషనల్ కలెక్టర్ హనుమకొండని ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ హనుమకొండ పలు దఫాలుగా విచారణ జరిపి రికార్డులన్నింటినీ పరిశీలించి ఈ స్థల%శీ% శ్రీకుంకుమేశ్వర స్వామి వారిదేనని తీర్పు ఇవ్వడము జరిగింది. 2006 నుండి పరకాల మున్సిపాలిటీ వారు దేవస్థానము వారి నుండి స్థలాన్ని లీజు తీసుకొని పశువుల సంత నిర్వహిస్తున్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో దేవస్థానం చైర్మన్గా వ్యవహరించిన గందె వెంకటేశ్వర్లు కుంకుమేశ్వర స్వామికి సంబంధించిన నాలుగు ఎకరాల భూ వ్యవహారంపై పలుసార్లు ప్రస్తావిస్తూ దేవదాయ శాఖకి ఫిర్యాదులు అందిస్తూ దేవస్థానం భూమిలో పరకాల మున్సిపాలిటీ వారు



టెండర్ల ద్వారా పశువుల సంతను నడుపు విషయం గురించి నోటీసులు జారీ చేయడం జరిగింది. ఎట్టకేలకు నేటితో కుంకుమేశ్వర స్వామి దేవస్థానంకు చెందినదిగా తీర్పు రావడంతో పరకాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన రాయపర్తి గురుకుల విద్యార్థులు



రాయపర్తి అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి): ఓ సిటీలో నిర్వహించిన 69వ ఎస్జిఎఫ్ ఫెడరేషన్ అండర్ 19 వాలీబాల్ క్రీడలలో జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందారు. జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారు. గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్ ఎంఎల్టిచదువుతున్న చందన, ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సిరి రాష్ట్రస్థాయిక్రీడల్లో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ సరిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## బీసీ బిడ్డలారా నేటి తెలంగాణ బంద్ విజయవంతం చేయండి.

- బీసీ రాజ్యాధికార సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్.



నర్సంపేట అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి):నర్సంపేట పట్టణంలో బీసీ రాజ్యాధికార సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలంతా జేఏసీగా ఏర్పడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జస్టిస్ ఫర్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా బందు పాటించాలని యువత మేల్కొని వ్యాపార వాణిజ్య సంస్థలను విద్యాసంస్థలను బందు చేయాలని ప్రతి బీసీ బిడ్డ కచ్చితంగా రోడ్డుపైకి వచ్చి బందు పాటించాలని కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి బీసీలను మోసం చేసిందన్నారు. గత 70 సంవత్సరాలుగా అణచివేయబడిన బీసీలు ఇకనైనా మేల్కొని బీసీలు స్వతంత్రంగా విద్య ఉద్యోగ రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకోవాని పోరాటం చేయాలని మేమెంతో మాకంత వాటా కావాలని గలం విప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, ములుక ఇందిరా, కొక్కు అశోక్, గుల్లపెల్లి సుధాకర్, పెంచాలా యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి బిసి సంఘాల బంద్ ను విజయవంతం చేయండి.

- నర్సంపేట పట్టణ బిఆర్ఎస్వి అధ్యక్షులు దేవోజు హేమంత్.





నర్సంపేట అక్టోబర్ 17 (వుదయం ప్రతినిధి):బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన నేటి తెలంగాణ రాష్ట్ర బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మద్దతు మేరకు బంధు కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం పాల్గొంటుందని గత 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో బీసీలను విద్యాలో మరియు రాజకీయపరంగా అణిచివేస్తూ బీసీలను రాజకీయంగా వాడుకొని కాంగ్రెస్ పార్టీ కాలం గడుపుకుంటూ వచ్చిందన్నారు. బీసీ విద్యార్థిని, విద్యార్థులు అందరూ కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ వచ్చేవరకు బిసి విద్యార్థులతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ పార్టీ రాజకీయ నాటకాలు ఇక బీసీల ముందు చెల్లవని పట్టణంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాలలు విద్యాసంస్థలు ఈ యొక్క బీసీ బందుకు సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

## జిఎస్టి ద్వారా తగ్గిన ధరలను బోర్డులపై ప్రదర్శించని వ్యాపార వాణిజ్య సంస్థలు.

- బాల్నే జగన్ బిజెపి జిల్లా ప్రచార కార్యదర్శి.

నర్సంపేట అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని వ్యాపార వాణిజ్య సంస్థలు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి ధరలను బోర్డులపై ప్రదర్శించకుండా ప్రజలను మాయచేస్తున్నారని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ 147 వస్తువుల మీద జీఎస్టీ తగ్గస్తూ ప్రకటన చేసిన కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ సెప్టెంబర్ 22 నుంచి 147 వస్తువుల మీద జీఎస్టీ తగ్గుతుందని ప్రజలకు దీపావళి కానుకగా సామాన్య ప్రజలకు ప్రతి వస్తువు మీద జిఎస్టి తగ్గించి దసరా దీపావళి కానుకగా అందివ్వడం జరిగిందని తగ్గిన జీఎస్టీ ని ప్రతీ షాప్ యజమానులు బోర్డు మీద ప్రతీ వస్తువు పాత రేటు, కొత్త రేట్ ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. కానీ ప్రభుత్వం చెప్పిన విదంగా పట్టణంలోని వ్యాపార సంస్థల యజమానులు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తూ వ్యాపారం చేస్తున్నారని అధికారులు దృష్టి పెట్టి ప్రజలకు మేలు జరిగేవిదంగా చూడాలని అధికారులను కోరారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో మండల దీక్ష తీసుకున్న భక్తులు.



నర్సంపేట అక్టోబర్ 17 వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో జై భవాని గ్రూపుకు సంబంధించిన 20 మంది భక్తులు ఆలయ అర్చక స్వాములు దేవేష్ మిశ్రా ఆధ్వర్యంలో మండల దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గురు స్వాములు నిరంజన్ మాట్లాడుతూ మండల దీక్ష కార్యక్రమంలో స్వాములు భక్తిశ్రద్ధలతో స్వామి దీక్షను చేపట్టాలని నిత్యం అయ్యప్ప స్వామి నామస్మరణ చేస్తూ నియమాలు పాటిస్తూ ఒంటి పూట ఆహారాన్ని భుజిస్తు నియమాలని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతల నిరంజన్, చింతల నరేందర్, జీజుల సాగర్, దొడ్డ రమేష్, మల్యాల వినయ్ కుమార్, బండారి శ్రీనివాస్, కాపుర బోయిన రమేష్, టి శ్రీనివాస్, బ్రహ్మచారి, అజిత్, బొడిగ రమేష్, మామిండ్ల మురళి, గండు రవి, వేల్పుల భాస్కర్, గర్నెపల్లి శ్రీనివాస్ తదితర స్వాములు మాల ధారణ ధరించినారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.